సోమవారం
28-10-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 37
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

వెనిజులా నోరు నొక్కలేరు: మదురో

కారకస్: బ్రిక్స్‌లో చేరాలనుకున్న తమ ప్రతిపాదనను బ్రెజిల్ వీటో చేయడంపై వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మదురో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ చర్య తర్వాత తమ దేశం మౌనంగా ఉండబోదని ప్రకటించారు. బ్రెజిల్ నిర్ణయాన్ని అనైతికమైనదిగా పేర్కొన్నారు. ఇటీవల రష్యాలోని కజన్ నగరంలో జరిగిన సమావేశంలో బ్రెజిల్ వీటో అధికారం ద్వారా తమను అడ్డుకోవడాన్ని మౌనంగా భరించబోమని స్పష్టంచేశారు. 'వెనిజులాను ఎవ్వరూ అడ్డుకోలేరు... నిషేధించలేరు... నోరు నొక్కలేరు. ఇది ఇప్పుడు, ఎప్పుడు జరగబోదు' అని బ్రెజిల్ పేరు ప్రస్తావించకుండా మదురో అన్నారు.

6న ఏపీ కేబినెట్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఏపీ కేబినెట్ భేటీ నవంబరు 6న జరగనుంది. సీఎం చంద్ర బాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో 6వ తేదీ ఉదయం 11 గంటలకు మంత్రి వర్గ సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భేటీలో అనేక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది. నవంబరులో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుండటంతో దీనిపైనా చర్చించనున్నారని సమాచారం. సమావేశాలు నిర్వహించే తేదీలను ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయి.

'ఉపాధి' పనుల నాణ్యతలో రాజీ వద్దు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడకూడదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఉపాధి హామీతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చిన క్రమంలో వాటిని సక్రమంగా, పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో అభివృద్ధి పనుల నాణ్యతను శనివారం అధికారులు

- మిగతా 2 లో



ఏపీ టూరిజం ఎండీగా ఆమ్రపాలి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలంగాణ రాష్ట్రం నుంచి ఏపీ కేడర్‌కు వచ్చిన ఐఏఎస్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు పోస్టులు కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి నీరబ్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీజేశారు. ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ వీసీ, ఎండీగా ఆమ్రపాలిని నియమించారు. ఆమెకు ఏపీ టూరిజమ్ సీఈవోగా అదనపు బాధ్యతలను అప్పగించారు. సాధారణ పరిపాలనశాఖలో సర్వీసులు వ్యవహారాలశాఖ ముఖ్య కార్యదర్శిగా జి.వాణి మోహన్‌ను నియమించారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా వాకాటి కరుణను నియమించారు.

విద్యా కేంద్రంగా మహబూబ్‌నగర్

జిల్లా అభివృద్ధికి పూర్తి సహకారం: సీఎం

విశాలాంధ్ర-హైదరాబాద్: మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని, విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సీఎం చొరవతో పాలమూరు వర్సిటీలో ఇంజినీరింగ్, లా కళాశాల ఏర్పాటుకు క్యాబినెట్ అనుమతించింది. ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డితో కలిసి ధన్యవాదాలు తెలిపారు. 200 మంది పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఉచితంగా నీట్, ఇంజినీరింగ్ ఎంట్రెన్స్ కోసం శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం సీఎంకు ఈ సందర్భంగా వివరించారు.

జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా మార్చండి...

జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బాలానగర్‌ను మున్సిపాలిటీ గా మార్చాలని, నవాబ్ పేట్ మండలం కొల్లూరు గ్రామాన్ని.. జడ్చర్ల రూరల్‌ను మండల్ గా ఏర్పాటు చేయాలని కోరారు. రెవెన్యూ డివిజన్ కావడానికి జడ్చర్లకు అన్ని అర్హతలు ఉన్నాయని వివరించారు. దీనివల్ల భూ సమస్యలు పరిష్కరించడానికి, వందల కోట్ల విలువైన గైరాన్, భూదాన్ ప్రభుత్వ భూములను కాపాడుకోవడానికి అవకాశం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. సాగు నీటి ప్రాజెక్టులను ప్రస్తావించారు. జడ్చర్ల కు రైలు, రోడ్డు వసతులు ఉన్నాయని, 44వ నంబర్, 167 వ నంబర్ జాతీయ రహదారులు జడ్చర్ల మీదుగానే వెళుతున్నాయని, స్థానిక స్థానికేతరుల జనాభా 4.5 లక్షల వరకూ ఉందని తెలిపారు. రాష్ట్రంలో కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుపై అధికారిక కమిటీ వేస్తామని, కమిటీ నివేదిక అనంతరం నిర్ణయం తీసుకుంటామని సీఎం అన్నారు. బాలానగర్ ను మున్సిపాలిటీగా మారిస్తే చుట్టూ ఉండే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఏర్పడుతుందని అనిరుధ్ రెడ్డి చెప్పారు. బాలానగర్,

- మిగతా 2 లో

ఉపాధి హామీ ఏదీ?

తొలగింపులే ఎక్కువ... చేరికలు తక్కువ

- 1.02 కోట్ల జాబ్ కార్డులు తొలగింపు
- ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థతోనే అసలు సమస్య
- నమోదు లక్ష్యాలు నిర్ణయించలేమంటున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ: ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారుతోంది. పథకం అమలులో అలసత్వమే అందుకు కారణమని స్పష్టమవుతోంది. పాలకుల ప్రచార్భాటమేగానీ గ్రామీణ ప్రజల జీవనోపాధికి దోహదపడే కీలక పథకాన్ని అమలు చేయడంలో చిత్తశుద్ధి మాత్రం కనిపించడం లేదు. అయితే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద నమోదు తగ్గుతోందన్న వార్తలను గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదివారం తోసిపుచ్చింది. ఆర్థిక సంవత్సరం ఇంకా కొనసాగుతున్నందున డిమాండ్-ఆధారిత పథకంలో మొత్తం నమోదుకు లక్ష్యాలను నిర్ణయించడం సాధ్యం కాదని పేర్కొంది. ఇదిలాఉండగా, పథకం అమలుపై లిబ్‌టెక్ ఇండియా నివేదిక ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే ఉపాధి హామీ పథకం కింద క్రియాశీల కార్మికుల సంఖ్య 8 శాతం తగ్గింది. 39 లక్షల మంది కార్మికుల నికర తొలగింపు జరిగిందని, తప్పుడు తొలగింపుల గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ నివేదిక పేర్కొంది. 84.8 లక్షల మంది కార్మికుల పేర్లు తొలగించగా, 45.4 లక్షల మంది కార్మికులను మాత్రమే పథకం కింద చేర్చారు. ఉపాధి హామీ పథకం కింద ఏర్పడిన ఉపాధి గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 2024-2025 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ భాగంలో 16.6 శాతం తగ్గింది. తమిళనాడు, ఒడిశా అన్ని రాష్ట్రాలలో అత్యధిక క్షీణతను నమోదు చేశాయి. పౌర సమాజ సంస్థలు లిబ్‌టెక్ ఇండియా, ఎన్‌ఆర్‌ఈజీఏ సంఘర్ష్ మోర్చా శుక్రవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ వివరాలు ఇలా ఉన్నాయి. 'భారతదేశంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ అమలు : అంతర్దృష్టులు-పోకడలు' (ఏప్రిల్-సెప్టెంబర్ 2024)' పేరుతో రూపొందించిన నివేదిక, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబరు మధ్య క్రియాశీల

- మిగతా 2 లో

జన్వాడ ఫామ్‌హౌస్‌పై పోలీసుల దాడి

- రేవ్ పార్టీ భగ్నం...
- ఏ2 నిందితుడిగా రాజ్ పాకాల

విశాలాంధ్ర-హైదరాబాద్: జన్వాడలోని రిజర్వ్ కాలనీలో ఉన్న ఓ ఫామ్‌హౌస్‌పై సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం తెల్లవారుజామున దాడి చేశారు. ఇది బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు చెందినదిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. నర్సింగ్ పోలీసులతో కలిసి వీఐపీల రేవ్ పార్టీని భగ్నం చేశారు. ఫామ్‌హౌస్ నుంచి భారీగా డీజే శబ్దాలు రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫామ్‌హౌస్‌పై స్పెషల్ పార్టీ, ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. రేవ్ పార్టీలో దొరికిన వారికి పరీక్షలు చేయించారు. వ్యాపారవేత్త విజయ్ మద్దూరికి కొకైన్ పాజిటివ్ రావడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. భారీగా విదేశీ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎండీపీఎస్ యాక్ట్, సెక్షన్ 34 ఎక్సైజ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు.

లోతుగా విచారణ జరపాలి: ఎంపీ అనిల్ యాదవ్

ఫామ్‌హౌస్ లో జరిగిన రేవ్ పార్టీ పై సమగ్ర విచారణ జరపాలని

- మిగతా 2 లో

మహిళా సంఘాలకు లక్ష కోట్లు

- అబలల ఆర్థిక పరిపుష్టే లక్ష్యం
- ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కులు: భట్టి

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: రాబోయే ఐదేళ్లలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్లు వడ్డీ లేని రుణాలు ఇస్తామని, మహిళలు తమ కాళ్లపై తాము నిలదొక్కుకునేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన... ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ఆవరణలో నూతన బస్సు షెల్టర్, ఎస్‌బీఐ బ్రాంచ్, మహిళా శక్తి క్యాంటీన్‌కు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. అనంతరం భట్టి మీడియాతో మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలకు ప్రత్యేకంగా ఎంఎస్‌ఎంఈ పార్క్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు మహిళా సంఘాలే ఇచ్చేలా వారిని ఓనర్లుగా మార్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించిందని విక్రమార్క పేర్కొన్నారు. దేశానికి ఆదర్శంగా తెలంగాణ మహిళలు నిలుస్తారని అన్నారు. ఉచిత ఆర్టీసీ ప్రయాణానికి రూ.400 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు.

ఇందిరమ్మ ప్రభుత్వంలో వడ్డీ లేని రుణాలు

గత ప్రభుత్వ హయాంలో మహిళలకు వడ్డీ లేని రుణాలు నిలిపివేశారని, ఇందిరమ్మ రాజ్యం రాగానే మహిళలకు మరో సారి వడ్డీ లేని రుణాలు పున: ప్రారంభించామని

- మిగతా 2 లో

కేరళ అంటే అలసత్వమా

వయనాడ్‌కు సాయంలో జాప్యంపై ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అసంతృప్తి

తిరువనంతపురం: ప్రకృతి విపత్తు సంభవించిన వయనాడ్‌కు సాయం అందించే విషయంలో కేంద్రప్రభుత్వ జాప్యంపై కేరళ ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తంచేసింది. వయనాడ్‌కు పునరావాసం కల్పించే విషయంలోనూ ప్రతికూల వైఖరితో కేంద్రం ఉందని విమర్శించింది. నెలలు గడుస్తున్నాగానీ వయనాడ్ విపత్తు వర్గీకరణపై స్పష్టత లేదని, కేంద్రం నుంచి ఇప్పటివరకు దీనిపై ఎలాంటి ప్రకటన రాలేదని వ్యాఖ్యానించింది. కేరళ అంటే అలసత్వమా? చిన్నచూపా? అంటూ కేంద్రాన్ని నిలదీసింది. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన

- మిగతా 2 లో

లౌకికవాదం, సోషలిజమే నా విధానం

- స్త్రీశక్తి... పెరియార్, కామరాజ్ సిద్ధాంతాలే చోదకశక్తులు
- నీట్‌కు వ్యతిరేకం- కులగణనకు అనుకూలం
- తమిళగ వెట్రి కళగం ఆవిర్భావ సభలో విజయ్

విల్లుపురం (తమిళనాడు): 'మిమ్మల్ని నమ్మి... మీ కోసం అన్ని వదిలేసి వచ్చా... రాజకీయాల్లో బచ్చానే కానీ ఈ బచ్చాకు రాజకీయమైనా- సర్పమైనా... ధైర్యంగా ఆడుకోవడం తెలుసు' అని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆవిర్భావ సభలో అధ్యక్షుడు విజయ్ ఉద్ఘాటించారు. రాజకీయ అనుభవం లేకపోయినా నిలద్రొక్కుకుంటా అని ప్రకటించారు. విజయ్ తన తొలి రాజకీయ ప్రసంగంలో అభిమానుల్లో, పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం, విశ్వాసం నింపారు. స్త్రీశక్తితో పాటు పెరియార్, కామరాజ్ సిద్ధాంతాలే చోదకశక్తులుగా లౌకికవాదం, సోషలిజం సూత్రాలతో ముందుకెళతానని విజయ్ చెప్పారు.

తమిళనాడులోని విల్లుపురం జిల్లా విక్రవాండిలోని వీసాలైలో టీవీకే తొలి సభ అట్టహాసంగా జరిగింది. ప్రాంగణం లక్షల మందితో కిక్కిరిసింది. అశేష జనం మధ్య తన పార్టీ సిద్ధాంతాలు, సూత్రాలు, విధానాలను విజయ్ ప్రకటించారు. 2026 ఎన్నికల్లో టీవీకేను ఆశీర్వదించాలని కోరారు. సభలో పార్టీ సైద్ధాంతిక గీతాన్ని ఆవిష్కరించారు. తొలుత ఖడ్గంతో పాటు రాజ్యాంగం, భగవద్గీత, ఖురాన్, బైబిల్ ప్రతులను విజయ్‌కు బహూకరించారు.

విజయ్ మాట్లాడుతూ రాజకీయాల్లోకి రావాలన్న నిర్ణయం పూర్తి అవగాహనతో తీసుకున్నదేనని, వెనకడుగు వేసే ప్రసక్తే ఉండదని చెప్పారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) సోషలిజం, లౌకికవాదానికి కట్టుబడుతుందని ప్రకటించారు. ఆపై తమ పార్టీ తమిళ కవి తిరువల్లూర్, పెరియార్, కామరాజ్, స్వాతంత్ర్య సమరయోధుడు వెలు నాచియార్, అంజలై అమ్మల్ చూపిన మార్గాలను అనుసరిస్తుందని అన్నారు. లౌకిక సామాజిక న్యాయ సిద్ధాంతాలతో ప్రజలకు సేవ చేయాలనే రాజకీయాల్లోకి వచ్చానని ఉద్ఘాటించారు. లౌకికవాదం, స్వయంప్రతిపత్తి, కలుపుకుపోవడం, రెండు భాషల విధానం, అవినీతి నిరోధకం, అణచివేత ఆలోచనలను తిరస్కరించడం, మాదకద్రవ్యాల రహిత తమిళనాడు సాధన వంటివి తమిళగ వెట్రి కజగం విధానాలుగా విజయ్ తెలిపారు. చనిపోయిన తన సోదరిని స్మరించుకుంటూ నీట్ అభ్యర్థి ఎస్.అనిత ఆత్మహత్య చేసుకోవడాన్ని ప్రస్తావిస్తూ ఆ రెండు ఘటనలను తనను ఎంతగానో ప్రభావితం చేశాయని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏవియేషన్ చట్టాల్లో మార్పు

- బెదిరింపులపై లోతైన దర్యాప్తు: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- విశాఖ-విజయవాడ విమాన సర్వీసులు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో -విశాఖపట్నం: బాంబు బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు హెచ్చరించారు. విమానాలకు వస్తున్న వరుస బాంబు బెదిరింపులపై కేంద్రం చాలా ఆగ్రహంగా ఉందన్నారు. విశాఖ- విజయవాడల మధ్య రెండు విమాన సర్వీసులను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ... బాంబు బెదిరింపులపై లోతైన దర్యాప్తు జరుగుతోందన్నారు. విచారణలో వీటి వెనుక ఎవరున్నారనే దానిపై స్పష్టత వస్తుందన్నారు. బాంబు బెదిరింపులను అరికట్టడానికి ట్విట్టర్, లా ఏజెన్సీలు, ఇంటిలిజెన్స్ సహకారం తీసుకుంటున్నామన్నారు. సివిల్ ఏవియేషన్‌లో ఉన్న రెండు చట్టాల్లోనూ మార్పులు చేస్తున్నామని తెలిపారు. నూతన చట్టం తీసుకువచ్చి బెదిరింపులకు పాల్పడుతున్న దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. విశాఖ-విజయవాడ మధ్య ఫ్లైట్ కనెక్టివిటీ పెంచాలని చాలా మంది ప్రయాణికులు కోరినట్టు చెప్పారు. ఒకేసారి రెండు నగరాల మధ్య రెండు ఫ్లైట్లు ప్రారంభం కావడం ఇదే మొదటిసారన్నారు. ప్రజల కోరిక మేరకు ఈ మార్గంలో రెండు సర్వీసులు ప్రారంభించాం. రెండు నగరాల మధ్య ఎక్కువ సీట్లు అందుబాటులోకి

- మిగతా 2 లో

మత రాజకీయాలకు మోదీ ప్రాధాన్యం

- ఉద్యోగ, ఉపాధితోనే రాష్ట్రాభివృద్ధి
- యువజన కమిషన్ ఏర్పాటు
- ఏఐవైఎఫ్ మాజీ నేత చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం యువజన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ మాజీ నేత, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌ను గోదావరిఖనిలోని ఓ హోటల్‌లో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రీ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 76 సంవత్సరాలు గడుస్తున్నా దేశ ఆర్థిక స్థితిగతులు మారలేదన్నారు. బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో పొందు పరిచిన ప్రాథమిక హక్కులను సైతం హరించేలా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. మత రాజకీయాలకు మోదీ ప్రాధాన్యత ఇస్తున్నాడని వారు ధ్వజమెత్తారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు చొప్పున గత పది సంవత్సరాల కాలంలో 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి నేటికీ కనీసం 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ మాట్లాడుతూ సిద్ధాంతపరమైన రాజకీయ, శాస్త్రీయ ఆచరణకు వర్క్ షాప్‌లు దోహదపడతాయన్నారు. విద్య, వైద్య, ఉపాధి హక్కుల సాధన కోసం యువత పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత యువజన సంఘం జెండాను ఏఐవైఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ

- మిగతా 2 లో

క్యూబాపై అమెరికా ఆంక్షలు ప్రతిఘటిద్దాం

వర్కర్స్, కమ్యూనిస్టు పార్టీల పిలుపు

క్యూబాపై అమెరికా ఆంక్షలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత బలోపేతం చేసుకోవాలంటూ వర్కర్స్& కమ్యూనిస్టు పార్టీలు పిలుపునిచ్చాయి. క్యూబాకు సంఘీభావాన్ని ప్రకటించాయి. క్యూబా ఒంటరి కాదని, ఎల్లప్పుడు అండగా నిలుస్తామని నినదించాయి. క్యూబా విప్లవానికి, క్యూబా ప్రజలకు, క్యూబా కమ్యూనిస్టు పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఉమ్మడి ప్రకటన వెలువరించాయి. క్యూబాను ఉక్కిరిబిక్కిరి చేసేలా అమెరికా ఆంక్షలు విధిస్తోందని ఆస్ట్రేలియా, డెన్మార్క్, ఎల్ సాల్వడార్, గ్రీస్, భారత్, ఐర్లాండ్, మెక్సికో, నెథర్లాండ్స్, నార్వే, పాకిస్తాన్, పరాగ్వా, పెరూ, ఫిలిప్పీన్స్, రొమేనియా, స్పెయిన్, కటాలోనియా, స్వాజిలాండ్, వెనిజులా దేశాల కమ్యూనిస్టు పార్టీలు ఆక్షేపించాయి. ఉగ్ర దేశాల జాబితా నుంచి క్యూబా పేరు తొలగించాలని డిమాండ్ చేశాయి. ప్రస్తుత బైడెన్ ప్రభుత్వం, గత ట్రంప్ ప్రభుత్వం క్యూబాపై దుష్ట చర్యలకు పాల్పడ్డాయని విమర్శించాయి. కఠోర ఆంక్షలు విధిస్తూ ఆ దేశాన్ని అణచివేయాలని చూస్తున్నాయని అగ్రరాజ్యం చర్యలను దుయ్యబట్టాయి. తక్షణమే ఆయా ఆంక్షలను రద్దు చేయాలని, ఉగ్రదేశంగా క్యూబాపై వేసిన ముద్రను తొలగించాలని కమ్యూనిస్టు, సోషలిస్టు, వర్కర్ల పార్టీలు ఐక్యంగా డిమాండ్ చేశాయి. అదే సమయంలో హరికేన్ ఆస్కార్ వల్ల జరిగిన నష్టంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంఘీభావం తెలిపాయి.

ఏవియేషన్ చట్టాల్లో మార్పు

(మొదటిపేజీ తరువాయి)

రావడంతో విమాన టికెట్ల ధరలు తగ్గుతాయి. విశాఖ-విజయవాడ మధ్య రూ.మూడువేలకే టికెట్ దొరికే అవకాశం ఉందన్నారు. విశాఖ ఎంతో అభివృద్ధి చెందుతున్న నగరం అని, దీనిని మరింత అభివృద్ధి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృతనిశ్చయంతో ఉన్నాయన్నారు. విశాఖ-గోవా మధ్య విమాన సర్వీసులు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తు న్నట్టు వివరించారు. విశాఖ నుంచి అత్యధిక కనెక్టివిటీలు ఉండేలా కృషి చేస్తానన్నారు. కాగా, విశాఖ-విజయవాడ మధ్య తిరిగే సర్వీసుల సంఖ్య మూడుకు చేరింది.

త్వరలో అంతర్జాతీయ ఎయిర్ కార్గో సేవలు

ఎయిర్ సర్వీస్ యూనివర్సిటీని భోగాపురంలో పెట్టాలని నిర్ణయించినట్టు చెప్పారు. రాష్ట్రంలో కొత్త ప్రాంతాలలో విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నట్టు పేర్కొన్నారు. విమానయానరంగం అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. విశాఖ నగరం మరింత అభివృద్ధి చెందడానికి అవకాశాలు ఉన్నాయని, నగరానికి టీసీఎస్‌ను మంత్రి నారా లోకేశ్ తీసువచ్చార న్నారు. విశాఖను స్పోర్ట్స్ హబ్‌గా తయారు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎయిర్ కార్గోపై ప్రత్యేక దృష్టి పెట్టామని, త్వరలో అంతర్జాతీయ ఎయిర్ కార్గో సేవలు విశాఖ నుంచి ప్రారంభమవుతాయన్నారు. అంతర్జాతీయ ఎయిర్ కనెక్టివిటీ పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం అని రామ్మోహన్ నాయుడు చెప్పారు.

కేరళ అంటే అలసత్వమా

(మొదటిపేజీ తరువాయి)

విపత్తుకు 100 రోజులు అయ్యాయి కానీ పునరావాసం కోసం కేంద్రం నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి సాయం అందలేదని రెవెన్యూ మంత్రి కె.రాజన్ అన్నారు. వయనాడ్ కోసం ప్రత్యేక ప్యాకేజి కోరుతున్నట్లు తెలిపారు. కేంద్ర సాయం కోసం ఓపికగా నిరీక్షిస్తున్నట్లు ఆయన ఆదివారం విలేకరులతో చెప్పారు. కేంద్ర ప్రతికూల వైఖరి రాష్ట్రానికి బాధాకరమన్నారు. కేంద్ర సాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు డిమాండ్ చేసినట్లు తెలిపారు. 'రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్ఎఫ్) కాదు వయనాడ్ కోసం కేరళ కోరుతున్నది ప్రత్యేక ప్యాకేజి. విపత్తు నివారణ చట్టం కింద ఇప్పటికే కేంద్రానికి మెమోరాండాన్ని అందజేశాం. ఎస్‌డీఆర్ఎఫ్ నిధిగా వచ్చిన దాని గురించి మాత్రమే కేంద్రం మాట్లాడుతోంది. వారు చెప్పే దానికి, మేము కోరుతున్న దానికి మధ్య సంబంధం లేదు' అని మంత్రి అన్నారు. రాష్ట్రంలో పెద్ద/చిన్న విపత్తు సంభవిస్తే ఎస్‌డీఆర్ఎఫ్ నుంచి కొంత ఇస్తారు కానీ వయనాడ్‌కు కావల్సినది ప్రత్యేక ప్యాకేజి అని ఆయనన్నారు. ఈ విషయంలో కేంద్రం మౌనం వహి స్తోందని, ఇప్పటివరకు వయనాడ్ విపత్తును ఏ విభాగం కిందకు వర్గీకరించిందో చెప్పలేదన్నారు. వయనాడ్ విపత్తును ఎల్1, ఎల్2 లేక ఎల్3 విభాగాల్లో దేని కింద పరిగణిస్తారో వెల్లడించలేదని మంత్రి తెలిపారు. ఎల్3గా పరిగణిస్తే వయనాడ్ పునరావాసం కోసం దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు సహకారం అందించవచ్చన్నారు. కేంద్రం స్పందన కోసం ఓపికగా ఎదురు చూస్తున్నామని చెప్పారు. విపత్తు నిర్వహణ యంత్రాంగంతో సంప్రదింపులను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం నుంచి తప్పక సాయం అందుతుందని ఆశగా ఎదురు చూస్తున్నామని రాజన్ అన్నారు. విపత్తు వేళ రాష్ట్రాన్ని నాశనం చేసే లక్ష్యంతో కేంద్రం వ్యవహరించినట్లు సీఎం పినరయి విజయన్ మండిపడిన ఒక రోజు తర్వాత రాజన్ చేసిన ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

మృత్యుకూపాలుగా రక్షిత ప్రాంతాలు

ఉత్తర గాజా, బీరుట్‌పై ఇజ్రాయిల్ దాడులు

నిర్వాసిత ప్రాంతాలపై బాంబులు - 45 మంది మృతి

జెరుసలేం: గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ భీకర దాడులతో రక్షిత ప్రాంతాలన్నీ మృత్యుకూపాలుగా మారిపోయాయి. పలస్తీనియన్ల ప్రాణాలకు హామీ లేకుండా పోయింది. నిర్వాసిత ప్రాంతాలు, శిబిరాలపైనా ఇజ్రాయిల్ వైమానిక, భూతల దాడులు సాగిస్తోంది. దీంతో ప్రాణ నష్టం భారీగా సంభవిస్తోంది. తాజాగా ఉత్తర గాజాలోని బెయిల్ లహియాలోని ఆరు భవనాలపై ఇజ్రాయిల్ దళాలు బాంబుల వర్షం కురిపించగా 45 మంది చనిపోయారు. 2023 అక్టోబరు నుంచి ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో ఇప్పటివరకు 43వేల మంది పలస్తీనియన్లు చనిపోగా, 1,00,544 మంది గాయపడినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. దీంతో పలస్తీనా భూభాగంలోని మొత్తం జనాభాను తుదిముట్టించేందుకు సాగుతున్న వ్యూహాత్మక మారణహోమాన్ని ఆపాలంటూ అమెరికాకు కౌన్సిల్ ఆన్ అమెరికన్ ఇస్లామిక్ రిలేషన్స్ (సీఏఐఆర్) పిలుపునిచ్చింది. గాజాలో ఎవరూ సురక్షితం కాదని... మారణహోమంలో వారు ఎప్పుడైనా ప్రాణాలు కోల్పోవచ్చని ఐరాస ప్రత్యేక రిపోర్టర్ అల్బనీస్ ఆందోళన వ్యక్తంచేశారు. అటు బీరుట్‌లోనూ ఇజ్రాయిల్ వైమానిక దాడులు కొనసాగాయి. ఇరాన్‌లోనూ ఉద్రిక్త పరిస్థితికి ఇజ్రాయిల్ దళాలు తెరతీశాయి. శనివారం దాడుల్లో తమ సైనికులు నలుగురు చనిపోయినట్లు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తెలిపారు. గాజాలోని ఇళ్లతో సహా నిర్వాసిత ప్రాంతంపై ఇజ్రాయిల్ సైన్యం తాజా దాడుల్లో చనిపోయిన వారిలో పిల్లలు, మహిళలు ఎక్కువని పలస్తీనా అధికారిక వార్తా సంస్థ డబ్ల్యూఏఎఫ్ఏ నివేదించింది. ఆ సమయంలో పౌర రక్షణ లేక వైద్య బృందాలు చేరుకొనే పరిస్థితి లేకపోవడంతో బాధితులను కాలినడకన, గాడిద బండ్లపై తరలించాల్సి వచ్చినట్లు జిన్హువాతో స్థానికులు చెప్పారు.

లెబనాన్ ఊళ్లు ఖాళీ...

తమ దాడులను విస్తరిస్తున్న ఇజ్రాయిల్... లెబనాన్‌లో ఒకదాని తర్వాత ఒకటిగా మొత్తం 14 ఊళ్లను బలవంతంగా ఖాళీ చేయించింది. అక్కడ వారంతా అవాలీ నదికి ఉత్తరం వైపునకు తరలిపోయేలా ఆదేశాలిచ్చింది. ప్రాణాలు కాపాడుకోవాలంటే వెళ్లిపోండి అని హెచ్చరించింది. 'అవాలీ నదికి ఉత్తరం దిక్కుగా వెళ్లిపోండి. దక్షిణం వైపుకు వెళ్లేందుకు అనుమతి లేదు. అటుగా వెళ్లారో ఆపాయమే. హెజ్బుల్లా స్థావరాలు, వర్గాలు, ఆయుధాలు ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండండి లేదంటే ప్రాణాలు పోతాయి' అని ఇజ్రాయిల్ సైన్యానికి అధికార ప్రతినిధి పేర్కొన్నారు. ఖాళీ చేసే గ్రామాల పేర్లనూ ఆయన ప్రకటించారు.

జార్జియా ఎన్నికల్లో అధికార పార్టీదే గెలుపు

టిఫ్లిస్: జార్జియాలో అధికార పార్టీని తిరిగి విజయం వరించింది. సార్వత్రిక ఎన్నికలో ఈ పార్టీ గెలిచినట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. జార్జియన్ డ్రీమ్ పార్టీకి 54.08శాతం ఓట్లు వచ్చినట్లు తెలిపింది. ఈ పార్టీ 2012 నుంచి జార్జియాలో అధికారంలో ఉంది. రష్యా, చైనాకు మొగ్గు చూపే పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని 99శాతం సర్వేలు అంచనా వేశాయి. నాలుగు విపక్షాలకు 37.58శాతం ఓట్లు వచ్చాయని ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎన్నికల కమిషనర్ జార్జి కలాందరిష్విలి తెలిపారు. ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛగా జరిగాయన్నారు. ఈ ఫలితాలతో 150 మంది సభ్యులు ఉండే పార్లమెంటులో జార్జియన్ డ్రీమ్ పార్టీకి 91 స్థానాలు వచ్చాయి. రాజ్యాంగబద్ధ మెజారిటీ మార్కు 113ను ఆ పార్టీ చేరుకోలేదు. అయితే మంచి ఫలితాన్ని సాధించినట్లు ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మముకా తెలిపారు. మరోవైపు ఈ ఫలితాన్ని విపక్షాలు తోసిపుచ్చాయి. ఇవి మోసపూరితమని ఆరోపించాయి. జార్జియా భవిష్యత్‌ను దొంగలించేందుకు ప్రయత్నించారని విమర్శించాయి. ఈ ఫలితాన్ని అంగీకరించబోమని యునైటెడ్ నేషనల్ మూవ్‌మెంట్ (యూఎన్ఎం) ప్రకటించింది. జార్జియన్ డ్రీమ్ అధికారంలో కొనసాగలేదని పేర్కొంది.

వికీపీడియాకు విరాళాలు ఇవ్వొద్దు: ఎలన్ మస్క్

వాషింగ్టన్: వామపక్ష కార్యకర్తల అధ్వర్యంలో నడుస్తోన్న వికీపీడియాకు విరాళాలు ఇవ్వొద్దని టెస్లా అధినేత ఎలన్ మస్క్ పిలుపునిచ్చారు. వికీపీడియా తన పేరును డికీపీడియాగా మార్చుకుంటే ఆ సంస్థకు బిలియన్ డాలర్లు ఇస్తానని ఆయన గతంలో ప్రకటన చేశారు. మార్చుకోవాలని ఆయన సూచించారు. వికీపీడియాకు చెందిన 40 మంది సంపాదకుల నేతృత్వంలోని ఓ బృందం.. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ అమెరికాకు చెందిన న్యూస్ వెబ్‌సైట్ పైరేట్ వైర్స్ ప్రచురించిన కథనాన్ని షేర్ చేశారు. ఏడాదిగా జరుగుతున్న ఇజ్రాయిల్-గాజా పోరులో ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా వేర్పాటువాద ఇస్లామిస్ట్ గ్రూప్‌లకు అనుకూలంగా వికీపీడియా సంపాదకుల నేతృత్వంలో దాదాపు 40 మంది పనిచేస్తున్నారు' అని కథనాన్ని షేర్ చేసిన మస్క్.. 'వామపక్ష కార్యకర్తలు నడిపే వికీపీడియాకు విరాళాలు ఇవ్వొద్దు..' అని పేర్కొన్నారు.

'ఉచిత ఇసుక'కు తూట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉచిత ఇసుక విధానంపై సవరణలతో ప్రభుత్వం జారీజేసిన మార్గదర్శకాలు ఈ పథకం లక్ష్యం, అమలు తీరుకు ఆటంకాలుగా మారాయి. ఇసుక రీచ్‌ల నిర్వహణ, తవ్వకాల నుంచి స్టాక్ యార్డు నిర్వహణ, సరఫరా తదితర బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడమే ఈ ఉత్తర్వుల సారాంశం. ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకుని...ప్రైవేట్‌కు పెద్దపీట వేసేందుకే ఈ ఉత్తర్వులు తీసుకొచ్చిందన్న విమర్శలున్నాయి. ఉచిత ఇసుకలో ప్రభుత్వం కేవలం ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యేలా కనబడుతోంది. ప్రైవేట్ ఏజెన్సీల ప్రవేశంతో సామాన్యులకు ఉచిత ఇసుక చేరువకావడం గగనంగా మారుతుంది. ఇప్పటికే పేరుకు ఉచిత విధానాన్ని ప్రకటించినప్పటికీ అది సమర్థంగా అమలుకు నోచుకోవడం లేదు. అన్ని జిల్లాల్లోనూ ఇసుక మాఫియా విస్తరించింది. కూటమి పార్టీల నేతల కనుసన్నల్లోనే మాఫియా రాజ్యం నడుస్తున్నట్లు విపక్షాలు మండిపడుతున్నాయి. ఇసుకను ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీజేసినప్పటికీ ఆచరణ కనిపించడం లేదు. ఉచిత ఇసుక అందుబాటులోకి వచ్చినప్ప టికీ... గత ప్రభుత్వం కంటే ఇప్పుడు అధిక ధరకు ఇసుకను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రభుత్వ విధానాలతో ఇసుక విక్రయాల ఆదాయం ప్రభుత్వానికి రాకుండా పక్కదారి పడుతోంది.

'ఉపాధి' పనుల నాణ్యతలో రాజీ వద్దు

(మొదటిపేజీ తరువాయి)

తనిఖీలు చేయగా, వీటిపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణ తేజ, ఉపాధి హామీ పథకం అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో ఆదివారం పవన్ కళ్యాణ్ సమీక్షిం చారు. 2024 -25 సంవత్సరంలో సిమెంట్ రోడ్లు 3వేల కిలో మీటర్లు, బీటీ రోడ్లు 500 కిలోమీటర్లు, గోకులాలు 22,525, ఫారం పాండ్లు 25వేలు, 30 వేల ఎకరాలకు సంబంధించి నీటి సంరక్షణ కందకాలు చేపట్టామని...వాటి పనులు పల్లె పండుగ నుంచి మొదలు పెట్టామని తెలిపారు. ఈ పనులు నిర్దేశించిన విధంగా సాగుతున్నాయని వివరించారు. "ఉపాధి హామీ, ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టే పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ప్రతి దశలోనూ నాణ్యతా ప్రమాణాలు తనిఖీ చేయాలని, పనులు ఏ దశలో ఉన్నాయో కూడా ప్రజలకు తెలియచేస్తే పారదర్శకత వస్తుందన్నారు. గత పాలకుల మాదిరి పంచాయతీలకు దక్కాల్సిన నిధులను పక్కదారి పట్టడం లేదని ప్రజలకు తెలుస్తుందన్నారు. ఏ పంచాయతీకి ఎంత నిధులు అందాయో, వాటి ద్వారా చేస్తున్న పనులు ఏమిటో కూడా ప్రజలకు తెలియజేసే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

లౌకికవాదం, సోషలిజమే నా విధానం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. వైద్య ప్రవేశ పరీక్ష (నీట్) అవసరం ఏమిటని ప్రశ్నించారు. దీనిని వ్యతిరేకిస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తామని ప్రకటించారు. కులగణనకు మద్దతు ప్రకటించారు. సామాజిక న్యాయం, మహిళా సాధికారత, మత స్వేచ్ఛకు కట్టుబడి టీవీకే పనిచేస్తుందని విజయ్ అన్నారు. సినీ కెరీర్ తారస్థాయిలో ఉన్నప్పటికీ ప్రజల్లో ఉన్న నమ్మకంతో రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. 2026లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సింగిల్ మెజారిటీ సాధిస్తామన్న విశ్వాసం ఉందని విజయ్ అన్నారు. కూటమి ఉండాలని పార్టీలు భావిస్తే అధికారంలో వాటా ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటించారు. 'రాజకీయాల్లో విజయాలు, ఓటముల గురించి అన్నీ తెలుసుకున్న తర్వాతే రాజకీయాల్లోకి అడుగు పెట్టాను. ఎవరు ఏమన్నా, ఎన్ని విమర్శలు చేసినా వెనక్కి తగ్గదే లేదు. నేను నటుడిని మాత్రమే అంటూ కొందరు తక్కువ చేస్తున్నా పర్వాలేదు ఎదురు రొడ్డి నేను, నా పార్టీ సత్తా చాటుతాను. తమిళనాట ఎంజీఆర్.. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ ఏ విధంగా రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారో అందరికీ తెలుసు. ఏ టీమ్, బీ టీమ్ అనే తప్పుడు ప్రచారాలతో టీవీకేని ఓడించలేరు' అని విజయ్ చెప్పారు. బీజేపీపై, రాష్ట్రంలోని అధికార డీఎంకేపైనా విజయ్ విమర్శలు గుప్పించారు. ద్రవిడియన్ మోడల్ అని చెబుతూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నారని విమర్శించారు.

విద్యా కేంద్రంగా మహబూబ్‌నగర్

(మొదటిపేజీ తరువాయి)

నందారం, గుండేడ్, పెద్దాయపల్లి, గౌతాపుర్ గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు.

భాగ్యనగర అభివృద్ధిలో యాదవుల పాత్ర ఎనలేనిది

భాగ్యనగర అభివృద్ధిలో యాదవుల పాత్ర ఎనలేనిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నగరంలో సదర్ ఉత్సవాలు నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమని, సదర్ సమ్మేళనం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తాను ఆనాడే చెప్పానన్నారు. హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం తెలంగాణ సదర్ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రేవంత్ మాట్లాడుతూ... ఇక నుంచి ప్రతీ ఏటా సదర్ సమ్మేళనం అధికారికంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సదర్ అంటే యాదవుల ఖదర్ అని, సదర్ సమ్మేళనాన్ని ప్రతీ గ్రామానికి తీసుకెళ్లాలని సూచించారు. యాదవులు రాకీయంగా ఎదగాలని అనిల్ కుమార్ యాదవ్ ను రాజ్యసభకు పంపించామని చెప్పారు. రాజకీయాల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నగరంలో యాదవులు పశు సంపదను పెంచి పోషించారని, ఆనాడు మూసీ పరివాహక ప్రాంతాల్లో పశుగ్రాసాన్ని పెంచుకునేవారని తెలిపారు. నేడు మురికి కూపంగా మారిన మూసీకి పునరుజ్జీవం కల్పిద్దామని పిలుపునిచ్చారు. నగర అభివృద్ధికి అండగా నిలబడాలని కోరారు. మూసీ ప్రాంతవాసుల జీవన ప్రమాణాలను మెరుగు పరచబోతున్నట్లు వెల్లడించారు. కురుక్షేత్రంలో అధర్మం ఓడి ధర్మం గెలిచిందని... యాదవులు ధర్మం వైపు నిలబడండి... అధర్మాన్ని ఒడిద్దామని పిలుపునిచ్చారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సింగర్ రాహుల్ సిప్లిగంజన్ పాల్గొన్నారు.

జన్వాడ ఫామ్‌హౌస్‌పై పోలీసుల దాడి

(మొదటిపేజీ తరువాయి)

ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పోలీ సులను కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ... ఫ్రీ డ్రగ్స్ స్టేట్‌గా చేయాలని అహర్నిశలు కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల తన ఫామ్ హౌస్ లో డ్రగ్, విదేశీ మద్యంతో పార్టీ ఇచ్చారని, ఇది రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాను ప్రోత్సహించే విధంగా ఉందని మండిపడ్డారు. ఎంతటి పెద్దవారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ అండ్ బ్యాచ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ స్టేట్‌గా మార్చేస్తున్నారని ఆరోపించారు.

పోలీసులకు కాంగ్రెస్ మహిళా నేతల ఫిర్యాదు

రేవ్ పార్టీ, డ్రగ్స్ వినియోగంపై కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలు స్పందించారు. కేటీఆర్ బావమరిది రాజు పాకాల నిందితుడు అని, దీనిపై సమగ్ర విచారణ జరపాలన్నారు. నిందితులను శిక్షించాలని సైబరాబాద్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత, మహిళ ప్రతినిధులు ఉన్నారు.

విదేశీ మద్యం సీజ్: ఎక్సైజ్ సీఐ

జన్వాడ ఫామ్ హౌస్ పార్టీ కేసు విచారిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ శ్రీలత వెల్లడించారు. ఏ1గా ఫామ్‌హౌస్ సూపర్‌వైజర్ కార్తిక్, ఏ2గా రాజ్ పాకాలను చేర్చామన్నారు. నిబంధనలను ఉల్లంఘించి పార్టీ నిర్వహించినట్లు తెలిపారు. 'కర్నాటక లిక్కర్‌తోపాటు విదేశీ మద్యం కూడా స్వాధీనం చేసుకున్నాం. ఏడు లీటర్ల మద్యాన్ని సీజ్ చేశాం. రాజ్ పాకాల పరారీలో ఉన్నారు. విచారణలో మరికొన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి.' అని సీఐ శ్రీలత పేర్కొన్నారు.

సెర్చ్ వారెంట్ చూపండి

రాజ్ పాకాల సోదరుడు శైలేంద్ర పాకల ఫామ్‌హౌస్ వద్ద బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేపట్టారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి నేతృత్వంలో సోదాలు నిర్వహించేందుకు రాగా బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, ఎమ్మెల్యే వివేక్, బాల్క సుమన్, సంజయ్‌తో పాటు కార్యకర్తలు భారీగా విల్లా వద్దకు చేరుకున్నారు. సెర్చ్ వారెంట్ చూపాలని ఎక్సైజ్ పోలీసులతో బీఆర్ఎస్ కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. తమ న్యాయవాది సమక్షంలో సెర్చ్ చేయాలని వాదనలు వినిపించారు. సోదాలు చేయొద్దని నినాదాలు చేశారు. పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

డీజీపీకి కేసీఆర్ ఫోన్?

జన్వాడ ఫామ్‌హౌస్ ఘటనపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు స్పందించినట్లు తెలుస్తుంది. రాజు పాకాల ,శైలేంద్ర పాకాల ఇళ్లల్లో సోదాలపై డీజీపీకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారని సమాచారం. సెర్చ్ వారెంట్ లేకుండా సోదాలు ఎందుకు చేస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. సోదాలు ఆపాలని డీజీపీని కోరినట్లు వినికిడి.

శైలేంద్ర పాకాల ఇంట్లో సోదాలు

శైలేంద్ర పాకాల ఇంటిలో న్యాయవాది సమక్షంలో తనిఖీలు చేశారు. బీఆర్ఎస్ నేతలు పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. స్పెషల్ పార్టీ పోలీసులు భారీగా చేరుకోవడంతో తోపులాట జరిగింది. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను అరెస్ట్ చేశారు.

కీలక విషయాలు విజయ్ వెల్లడి

పోలీసులు విచారించగా విజయ్ మద్దూరి పలు కీలక విషయాలను వెల్లడించినట్టు తెలిసింది. రాజ్ పాకాల వద్ద కొకైన్ తీసుకొని తాను సేవించినట్లు అంగీకరించారని సమాచారం. విజయ్ ప్రకటన కీలకంగా మారింది.

విచారణకు హాజరు కాని రాజ్

ఎక్సైజ్ కార్యాలయం, మోకిలా పోలీస్ స్టేషన్ విచారణకు రాజ్ పాకాల డుమ్మా కొట్టారు. మొబైల్ స్విచ్ఛాఫ్ చేశారు. 24 గంటలు చూసి వారెంట్ జారీ చేస్తామని మోకిలా పోలీసులు చెబుతున్నారు. రేవ్ పార్టీలో పాల్గొన్న మహిళలు డ్రగ్స్ శాంపుల్స్ ఇచ్చేందుకు నిరాకరించారని పోలీసులు తెలిపారు. రాజ్ పాకాల రెండు సాఫ్ట్‌వేర్ కంపెనీలకు సీఈఓగా ఉన్నారని చెప్పారు. ఈటీజీ కంపెనీకి సీఈఓగా విజయ్ మద్దూరి ఉన్నారు. నార్కోటిక్ కేసులో ఏ1గా రాజ్ పాకాల, ఏ2గా విజయ్ మద్దూరిని ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఎస్ఐ కోటేశ్వరావు ఫిర్యాదు మేరకు మోకిలా పీఎస్‌లో కేసు నమోదు చేశారు. వీకెండ్స్‌లో రాజ్ పాకాల ,విజయ్ మద్దూరి కలిసి డ్రగ్స్ పార్టీలు చేసుకునేవారని మోకిలా పోలీసులు వెల్లడించారు.

35 మందితో లిక్కర్ పార్టీ

21 మంది పురుషులు, 14 మంది మహిళలు కలిపి మొత్తం 35 మందితో లిక్కర్ పార్టీ జరుగు తున్నట్లు పోలీసులు గుర్తించారు. క్యాసినో పరిక రాలు, ప్లేయింగ్ కార్డ్స్, ప్లాస్టిక్ క్రైన్స్, 10.5 లీటర్ల విదేశీ మద్యం, 10 లూజ్ ఇండియన్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై ఎక్సైజ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు.

మహిళా సంఘాలకు లక్ష కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఉపముఖ్యమంత్రి అన్నారు. వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుందని, మహిళా సంఘాల నుంచి వసూలు చేయడానికి వీలు లేదని తెలిపారు. మహిళా సంఘాలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ కలెక్టరేట్ లో ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. మహిళలను మహాలక్ష్మి గా కొలుస్తామని, స్త్రీలను గౌరవించుకునే విధంగా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 48 గంటల్లో ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మహిళలచే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పన చేపట్టామని తెలిపారు. గ్యాస్ సిలిండరును సబ్సిడీ పై రూ.500కే సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. రుణాలతో వ్యాపార యూనిట్లను ఏర్పాటు చేయడం వల్ల మంచి లాభాలు వస్తాయని అన్నారు. జుజ్జుల్‌రావుపేట కు చెందిన రాణి... తన వ్యవసాయ క్షేత్రంలో చేపలు, రొయ్యల చెరువు, పాడి, నాటుకోళ్ల ఫారం, గొర్రెల పెంపకం, కూరగాయలు, సేంద్రీయ వరి సాగు చేపట్టి లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటోందని, మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారని వివరించారు. ప్రతి సంవత్సరం మహిళా సంఘాలకు 20 వేల కోట్ల పైగా వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నట్టు చెప్పారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో లక్ష కోట్లు అందిస్తామని ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుందని అన్నారు. వ్యాపారాలు చేయాలని, అవసరమైన శిక్షణ, తోడ్పాటును ప్రభుత్వమే అందిస్తుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో చిన్న, చిన్న పరిశ్రమలు, ఎం.ఎస్.ఎం.ఈ. పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, స్థలాల ఎంపిక జరుగుతుందని, మౌలిక సదుపాయాలు ప్రభుత్వమే కల్పిస్తుందని అన్నారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. భవిష్యత్తులో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో కూడా మహిళలకు భాగస్వామ్యం కల్పిస్తామని అన్నారు. మధిరలో ఇందిరా మహిళా డైరీ ఏర్పాటు చేశామని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కలెక్టరేట్ లో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేశామని, 14 మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. టీ స్టాళ్లను బస్టాండ్, రైల్వే స్టేషన్ జనసంచారం గల ప్రదేశాలలో ఏర్పాటు చేశామని చెప్పారు. సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సుహాసిని మాట్లాడుతూ ప్రభుత్వ తోడ్పాటుతో మహిళా సంఘాలు బలపడి, ఆర్థిక పరిపుష్ఠిని సాధించాలన్నారు. వైరా శాసనసభ్యులు మాలోతు రామదాసు నాయక్, రాష్ట్ర గిడ్డంగులు సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఆర్డీవో సన్యాసయ్య, డీఆర్వో ఎం. రాజేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' ఏదీ?

(మొదటిపేజీ తరువాయి)

కార్మికుల సంఖ్య 8 శాతం తగ్గిందని పేర్కొంది. 2022-2023 నుంచి గత సంవత్సరం 10 శాతం పెరిగిన పని కోసం డిమాండ్ ఈ సంవత్సరం పడిపోయినందున పథకం అమలు గురించి నివేదిక ఆందోళనలను లేవనెత్తింది. 'ఆర్థిక సంవత్సరం 2006-07 నుంచి 2013-14 ఆర్థిక సంవత్సరం మధ్య మొత్తం వ్యక్తుల రోజులు 1,660 కోట్లుగా ఉన్నాయి. అయితే ఆర్థిక సంవత్సరం 2014-15 నుంచి 2024-25 మధ్య మొత్తం వ్యక్తుల రోజులు 2,923 కోట్లుగా ఉన్నాయి' అని పేర్కొంది. నివేదిక ప్రకారం ఈ పథకం కింద ఉపాధి అవకాశాలు అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 184 కోట్ల నుంచి 154 కోట్ల వ్యక్తిగత రోజులకు గణనీయంగా పడిపోయాయి. మొత్తం కార్మికులలో 27.4 శాతం లేదా 6.7 కోట్ల మంది ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఏబీపీఎస్) ద్వారా వేతనాలు పొందేందుకు అనర్హులని కూడా పేర్కొంది. '26.10.2024 నాటికి 13.1 కోట్ల క్రియాశీల కార్మికులకు ఆధార్ సీడింగ్ జరిగింది. ఇది మొత్తం క్రియాశీల కార్మికులలో 99.3 శాతం (13.18 కోట్లు)' అని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ క్షీణత కార్యక్రమంలో పాల్గొనే కార్మికుల సంఖ్య తగ్గిపోతుందని నొక్కి చెబుతోంది. బలహీనమైన గ్రామీణ జనాభాకు ఉపాధిని పొందడం గురించి కూడా ఆందోళనలు లేవనెత్తుతున్నాయని ఎన్ఆర్ఈజీఎస్ సంఘర్ష్ మోర్చా సభ్యులు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

14 రాష్ట్రాల్లో క్షీణించిన నమోదు

విశ్లేషించిన 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకుగాను 14 రాష్ట్రాలు ఈ సంవత్సరం గ్రామీణ ఉపాధిలో క్షీణతను నమోదు చేశాయి. ఆరు రాష్ట్రాలు పెరిగాయి. మహారాష్ట్ర (66 శాతం), హిమాచల్ ప్రదేశ్ (53.4 శాతం) గత ఏడాదితో పోలిస్తే వ్యక్తిగత రోజులలో అత్యధిక పెరుగుదలను చవిచూశాయి. మరోవైపు, తమిళనాడులో (59.1 శాతం), ఒడిశా (49.7 శాతం) పోలిస్తే రాజస్తాన్, ఉత్తర ప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, కర్నాటక, అసోం, జార్ఖండ్ రాష్ట్రాలు ఈ సంవత్సరం అందించిన పని దినాల సంఖ్య తగ్గాయి. ఎన్ఆర్ఈజీఏ సాఫ్ట్ ప్రకారం, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలు తొలగించిన మొత్తం జాబ్ కార్డుల సంఖ్య 1.02 కోట్లు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో అక్టోబరు 26 నాటికి ఆ సంఖ్య 32.28 లక్షలు. అయితే ఎన్ఎంఎంఎస్ యాప్‌ను సపోర్ట్ చేసే స్మార్ట్‌ఫోన్‌లను సహచరులు (ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లు) కలిగి లేని గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులు చేపట్టడం లేదనే వాదనను మంత్రిత్వ శాఖ తిరస్కరించింది. అయితే జాబితా నుంచి పేర్లు తప్పుగా తొలగించడం, ఈ సంవత్సరం జనవరి 1 నుంచి తప్పనిసరి చేసిన ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఏబీపీఎస్ అమలు నుంచి ఉత్పన్నమయ్యే సమస్యలు వంటి వివిధ కారణాల వల్ల క్రియాశీల ఉపాధి హామీ పథకం కార్మికుల సంఖ్య నిరంతరం తగ్గడం పని డిమాండ్ తగ్గడానికి కీలకమైన కారణం. సామాజిక కార్యకర్త, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (ఎంకేఎస్ఎస్) సహ వ్యవస్థాపకుడు, ఎన్ఆర్ఈజీఏ సంఘర్ష్ మోర్చా సభ్యుడు నిఖిల్ డే ఒక వీడియో ప్రకటనలో ఇలా అన్నారు. 'ఇది పని కోసం డిమాండ్ పడిపోయిందని కాదు. కానీ సమస్య ఏమిటంటే ప్రజలకు పని లభించడం లేదు. రాజస్తాన్‌లో ప్రజలు డిమాండ్ చేసినప్పటికీ పని పొందలేకపోవడం మేము చూశాము. మరో సమస్య ఏబీపీఎస్‌కి సంబంధించినది. నివేదిక ప్రకారం, 50 లక్షల మంది వేతనాల కోసం ఏబీపీఎస్‌కు అనర్హులు. మరో 50 లక్షల మంది జాబ్ కార్డులను తొలగించారు. 'చట్టం డిమాండ్ ఆధారిత ప్రాథమిక హామీని దెబ్బతీస్తూ నిధుల కేటాయింపు చాలా తక్కువగా కొనసాగడం ప్రధాన సమస్య' అని ఆయన అన్నారు. ఈ ఏడాది నికరంగా 39 లక్షల మంది కార్మికులను తొలగించారు. 'తప్పుగా తొలగించిన కార్మికులను తిరిగి నియమించినట్లయితే, వ్యక్తిగత రోజుల సంఖ్య మరింత ఎక్కువగా ఉండేదని ఊహించడం సహేతుకమైనది. ఇది పథకంపై కార్మికుల గణనీయమైన ఆధారపడటాన్ని ప్రధానంగా లేవనెత్తుతుంది' అని నివేదిక పేర్కొంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రథమార్థంలో చురుకైన కార్మికుల సంఖ్య 8 శాతం తగ్గిందని అధ్యయనం కనుగొంది. ఈ సంవత్సరం చత్తీస్‌గఢ్, తమిళనాడు, బీహార్, అసోం, ఒడిశా కొన్ని రాష్ట్రాలలో 4 నుంచి 14 శాతం నికర తొలగింపులను నివేదించినట్లు నివేదిక ప్రత్యేకంగా ఎత్తి చూపింది. 'ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం బలమైన ఒత్తిడి కారణంగా తప్పుడు తొలగింపులను తగినంతగా పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతో పాటు సమస్యను మరింత తీవ్రతరం చేసింది' అని పేర్కొంది. 54 లక్షల మంది క్రియాశీల కార్మికులు ఏబీపీఎస్ ద్వారా వేతనాలు పొందేందుకు అనర్హులని నివేదిక పేర్కొంది. ఏబీపీఎస్‌కు అనర్హులైన కార్మికులకు పని నిరాకరించవద్దని కేంద్రం రాష్ట్రాలను ఆదేశించినప్పటికీ, 'మేము 10 రాష్ట్రాల్లో 200 కేసులను చూశాము. ఇక్కడ కార్మికులకు (ఏబీపీఎస్‌కు అనర్హులు) వేతనాలు చెల్లించడం లేదనే భయంతో ఫ్రంట్‌లైన్ అధికారులు పనికి నిరాకరించారు' అని నివేదిక వెల్లడించింది. అయితే 'ఉపాధి హామీ పథకం అనేది డిమాండ్-ఆధారిత పథకం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికీ కొనసాగుతున్నందున వ్యక్తి రోజుల ఉత్పత్తి కచ్చితమైన లక్ష్యాన్ని నిర్ణయించడం సాధ్యం కాదు. అయినప్పటికీ, రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలు స్థానికంగా అవసరాలు భావించిన ప్రకారం లేబర్ బడ్జెట్ రివిజన్ కోసం ప్రతిపాదనలు పంపవచ్చు' అని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

మత రాజకీయాలకు మోదీ ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి శనిగారపు చంద్రశేఖర్ ఎగురవేశారు, తెలంగాణ ప్రజా నాట్య మండలి కళాకారుల విప్లవ గేయాలు పోరాట స్ఫూర్తిని నింపాయి. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మానస్ కుమార్, మార్కపురి సూర్య, లింగం రవి, కుసుకుంట్ల శంకర్, యుగంధర్, బిజ్జ శ్రీనివాసులు, రామకృష్ణ, పేరబోయిన మహేందర్, కొండల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్లంకి మహేష్, మహేందర్, చిలుకరాజు శ్రీను, సీపీఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, గౌతమ్ గోవర్ధన్, గోసిక మోహన్, కె.కనకరాజు, ప్రజా నాట్యమండలి కళాకారులు కన్నెము లక్ష్మీ నారాయణ, ఇనుముల రాజమౌళి, ఎర్రల లెనిన్, ఇజ్జ రాజయ్య, ఆసాల రమ, 26 జిల్లాల నుంచి యువజన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధుల తరహా సౌకర్యాలు తెలంగాణ ఉద్యమకారులకివ్వాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : స్వాతంత్ర సమరయోధులకు ప్రభుత్వాలు ఏ సౌకర్యాలయితే కల్పిస్తున్నాయో వాటినే తెలంగాణ ఉద్యమకారులకు ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఎస్‌కె. ఉమర్ డిమాండ్ చేశారు. ఆదివారం చంద్రుగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగినది. ఇందులో పాల్గొన్న ఉమర్ మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్రం కోసం ఉద్యమకారులు ఎన్నో త్యాగాలున్నాయని గుర్తు చేశారు. స్వతంత్ర సమరయోధులకు ఇచ్చే విధంగానే పెన్షన్, సాగుభూమి, ఇంటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో వేలాదిమంది పోలీస్ కేసులపాలై న్యాయ స్థానాల చుట్టూ తిరుగుతూ వారి కుటుంబాలకు అనేక విధాలుగా నష్టం జరిగిందని ఒక్కొక్కటిగా వివరించారు. దివంగత పూర్వ ప్రధాని ఇందిరా గాంధీ స్వతంత్ర పోరాట సమరయోధుల గుర్తించి వారికి అనేక సౌకర్యాలు కల్పించినట్లు గుర్తు చేశారు. ఇపుడు తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ రాజకీయ వారసత్వాన్ని కొనసాగించి తెలంగాణ ఉద్యమ ఉద్యమకారులను గుర్తించి వాగ్దానం చేసిన అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. వారిని తెలంగాణ. ఈ సమావేశంలో న్యూడెమోక్రసీ నాయకులు వరి కోటి వెంకట్రావు, కొండపనేని సత్యనారాయణ, బద్దం వెంకన్న, బానోతు భద్రు, గుగులోతు కిషన్, తేజవత్ భీముడు, తేజవత్ వీరన్న, చిరంజీవి, బద్దం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో ఇండియన్ స్కౌట్ డే వేడుకలు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ (ఎస్జీఎఫ్) 65వ ఆవిర్భావ దినోత్సవ ఫెలోషిప్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవి పల్లి మండలం లోని సెంట్రల్ పార్కులో ఆదివారం ఈ వేడుకలు జరిగాయి. ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడులోగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాసిం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు సంఘం వెంకట పుల్లయ్య, సింగరేణి ఎడ్యుకేషన్ సెక్రటరీ గుండా శ్రీనివాస్ లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి విరిద్దరినీ ఆత్మీయంగా సన్మానించారు. ఎస్‌జిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, సీడీపీఓ కనకదుర్గ, కోశాధికారి చిట్టిమల్ల బ్రహ్మం చారి, ఆర్గనైజింగ్ కార్యదర్శి డింపుల్ శర్మ బొడ్డు శ్రీనివాస్, విజయకుమార్, శనగ రామచందర్, ఉమెన్స్ గిల్డ్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ నూరి మెహరున్నిసా, కోశాధికారి సోనా, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం. జ్యోతిరాణి, నసీం పాషా, జరీనా బీ, ఉమాకిషోర్, కవిత, న్యాయవాది అడపాల మహాలక్ష్మి, కుమారి, ఛాయాదీక్షిత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగం మరువలేనిది : ఎస్పీ

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : జోహార్ పోలీస్ అమరవీరులకు, పోలీస్ అమరవీరుల త్యాగం మరవలేనిదని జిల్లా ఎస్పీ సుధీర్ రామనాద్ కేకన్ అన్నారు. ఆదివారం అమరవీరులను స్మరించుకుంటూ నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రెండు రోజులు మహబూబాబాద్ శనిగపురం వద్ద మైదానంలో పోలీస్ శాఖపరమైన క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటి రోజు తొర్రుర్ సబ్ డివిజన్ పోలీస్ టీం మరియు పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఏ.ఆర్ టీం మధ్యలో కొనసాగిన అటలో ఏ.ఆర్ టీం విజయం సాధించినారని, రెండవ రోజు మహబూబాబాద్ సబ్ డివిజన్ అల్ వింగ్స్ టీం తలపడగా అల్ వింగ్స్ టీం విజయం సాధించి, ఫైనల్ మ్యాచ్ ఏ.ఆర్ టీంతో తలపడగా ఫైనల్ మ్యాచ్‌లొ ఏ.ఆర్ టీం విజేతలుగా నిలిచారన్నారు. విజేతలకు ఎస్పీ ట్రోఫీని అందించారు. ఈ పోటీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి : ఎనిమిది మంది అరెస్ట్

విశాలాంధ్ర- పినపాక : పేకాట స్థావరంపై పోలీసులు పక్క సమాచారంతో ఆకస్మిక దాడులు చేశారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేశారు. ఇ.బయ్యారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దాడులు నిర్వహించారు. ఎస్ఐ రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కొందరు వ్యక్తులు పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. 8మందిని అరెస్టుచేసి వారి నుంచి రూ.8 వేల నగదు స్వాధీనం చేసుకొవడం జరిగిందన్నారు. చట్ట విరుద్ధ లేక అసాంఘిక కార్యక్రమాలకు ఎవరు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని ఎంఎల్ఏ డా. మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మెదక్ పట్టణం ఆజంపురలో అర్జున్ పిల్లల, దంత వైద్యశాలను ప్రారంభించారు. మెదక్ పట్టణం చుట్టుప్రక్క గ్రామల నుండి ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందచేయాలని ఎమ్మెల్యే రోహిత్ రావు సూచించారు. డాక్టర్లు తిరుమలేష్, స్వాతి, స్థానిక కౌన్సిలర్లు మేడి కళ్యాణి మధుసూదన్ రావు, జయశ్రీదుర్గాప్రసాద్, నాయకులు మేడి మధుసూధన్ రావు, పరుశరామ్ గౌడ్, రాగిఅశోక్, హఫీజ్, గూడూరి కృష్ణగౌడ్, గంగా ధర్, సిద్దయ్య పాల్గొన్నారు. దాయరలో ధాన్యం కొనుగోలు కేంద్రంను ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు ప్రారంభించారు. మెదక్ మండలం మగ్దుంపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. డిఇఇ సెట్ ద్వారా రెండు సంవత్సరాల డీఎస్ఈ కోర్సును పూర్తి చేసిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఎన్ఈపి-2020 ప్రకారం రెండు సంవత్సరాల కోర్సు చేసిన వారికి ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ టీచర్‌గా ఉద్యోగాలు కల్పించేలా సహకరించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ హామీ ఇచ్చారు.

బీటీ రోడ్డు పనులకు డిప్యూటీ సీఎం భట్టి శంకుస్థాపన

విశాలాంధ్ర - బోనకల్లు : మధిర నియోజకవర్గ ముదిగొండ మండలం చిరుమర్రి, వెంకటాపూర్, ముదిగొండ, యడవల్లి, మాదాపూర్ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం 19.95 కోట్ల రూపాయలతో బీటీ రోడ్డు పనులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు శంకుస్థాపన చేశారు. ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామంలో ఆరు కోట్ల 75 లక్షల రూపాయలతో చిరుమర్రి నుంచి వెంకటాపురం వరకు, ముదిగొండ పోలీస్ స్టేషన్ సమీపంలో కోటి రూపాయలతో ముదిగొండ నుంచి రాఘవపురం వరకు, వెంకటాపురం గ్రామంలో రూ.3.40 కోట్లతో వెంకటాపురం నుంచి లక్ష్మీపురం వై గ్రామం వరకు, యడవెల్లి గ్రామంలో మూడు కోట్ల రూపాయలతో కట్టకూర్ నుంచి యడవల్లి వరకు, మాదాపూరం గ్రామంలో రూ.5.80 కోట్లతో మాదాపూర్ నుంచి యడవల్లి వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు అధికారులు ప్రజలు బ్యాండ్ వాయిద్యాలు మేళతాళాలతో స్వాగతం పలికారు. మంగళ హారతులు ఇచ్చి వెల్కమ్ చెప్పారు. దారి పొడవున పూల వర్షం కుమ్మరిస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా యువత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో సెల్ఫీలు దిగడానికి ఎగబడినారు. జై భట్టి..., భట్టి విక్రమార్క జిందాబాద్ అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలు హోరెత్తాయి. శంకుస్థాపన కార్యక్రమాల సందర్భంగా ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో

విద్యుత్, పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

దీపావళి పండుగకు ఎలాంటి అసౌకర్యం ఉండొద్దు : ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - భద్రాద్రి కొత్తగూడెం : రానున్న దీపావళి పండుగ పర్వదినం నేపథ్యంలో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు, గ్రామాలను విద్యుత్ సౌకర్యంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ విస్తృతంగా చేపట్టణాలని, స్మశానవాటికలో కూడా పారిశుద్ధ్యం నిర్వహించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం మున్సిపల్, గ్రామ పంచాయతి, అగ్నిమాపక శాఖా అధికారులకు ఫోన్ ద్వారా తగు సూచనలు చేశారు. ప్రతి బస్తీలో, గ్రామంలో మరమ్మతులకు గురైన విద్యుత్ దీపాలను గుర్తించి తక్షణమే పునరుద్ధరణ చేపట్టణాలన్నారు. కొత్తగూడెం, మున్సిపల్ ప్రధాన రహదారిలో విద్యుత్ దీపాలు, సెంటర్ లైటింగ్ విధానాన్ని సరిచేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో, గ్రామాల్లోని విధుల్లో విద్యుత్ దీపాలను వెలిగేలా చూడాలన్నారు. అదేవిధంగా మృతుల కుటుంబాలు తమ పెద్దల పండుగ నిర్వహించెందుకు వందలాది మంది స్మశానవాటికలు వెళతారని, వీటిని శుభ్రం చేసి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక అధికారులు ప్రమాదాల నివారణకు అప్రమొత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగిన ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే కూనంనేని హెచ్చరించారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జయప్రదం చేయండి : సాబీర్ పాష

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఏఐటీయూసీ 105 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా మొత్తం ఘనంగా జరపాలని జిల్లా గౌరవ అధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాష కోరారు. ఆదివారం శేషగిరిభవన్ లో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు కంచెర్ల జమలయ్య అధ్యకతన జరిగింది. ఇందులో పాల్గొన్న సాబీర్ పాష మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమం లో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషించిన చరిత్ర ఘనమైనదని చారిత్రక ఘట్టాలు వివరించారు. తొలినాళ్లలొ ఏఐటీయూసీ సంఘంలో దేశంలోనే ప్రముఖులైన లాల లజపతి రాయ్, నెహ్రూ, వివి గిరి, సుభాష్ చంద్ర బోస్, సరోజని దేవి, భగత్ సింగ్, డాంగే, ఇంద్ర జిత్ గుప్తా, బర్ధన్, గురుదస్ దాస్ గుప్తా, లాంటి మహానుభావులు సారధ్యం వహించారని గుర్తు చేశారు. ఈ సమావేశం లో పాల్గొన్న సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31 న ఏర్పాటు జరిగిందన్నారు. అనేక పోరాటాలు ఉద్యమాల ద్వారా కార్మికుల కు అనేక చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలు ఏఐటీయూసీ సాధించి పెట్టిందన్నారు. 104 ఏళ్ళు పూర్తి చేసుకొని 105 ఏళ్ల ఆవిర్భావ వేడుకలు కు సిద్ధం అవుతుందని చెప్పారు. జిల్లాలోని అన్ని కార్మిక అడ్డల వద్ద జెండా ఆవిష్కరణ లు చెయ్యాలి కోరారు. ఈ సమావేశం లో జిల్లా నాయకులు కడారి వెంకటేశ్వర్లు, ఆర్. లక్ష్మి నారాయణ, సలిగంటి శ్రీనివాస్, మల్లికార్జుజన రావు. ఎండి. యూసుఫ్, గోనే మణి, విజయ లక్ష్మి, మల్లికార్జన్, తదితరులు పాల్గొన్నారు.

రామవరం ఖబరస్థాన్, ఈద్గా అధ్యక్షులుగా ఫహీమ్ దాదా

విశాలాంధ్ర - కొత్తగూడెం : రామవరం పట్టణంలో 5 మసీదుల పరిధిలోని ముస్లింల ఖబరస్థాన్ ఈద్గా కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. పట్టణంలోని జామా మజీద్, మదీనా మజీద్, జంజం మజీద్, మజీద్ ఏ రహీం ఖురేషి, మజిదే ఆలీ పరిధిలోని ఈ కమిటీలో 25 మందితొ ఏర్పాటు చేసారు. కమిటీ అధ్యక్షులుగా యువకుడైనా ఎస్ కె. ఫహీమ్ దాదా ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఫహీమ్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఖబరస్తాన్, ఈద్గాలను మరింత అభివృద్ధి చేసే విధంగా తమ కమిటీ పని చేస్తుందన్నారు. సాయంత్రం వేళల్లో ముస్లింల పార్థివ దేహాలను ఖబరస్తాన్ తీసుకెళ్లినప్పుడు ఒక్క లైటు కూడా రామవరం స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అధికారుల దృష్టికి ఇలాంటి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్యలు ఏమున్నా కమిటీ సభ్యులతో కలిసి సమన్వయంతో పనిచేస్తామని చెప్పారు. కమిటీ జనరల్ సెక్రెటరీగా రసూల్ పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శమియుద్దిన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉస్మాన్, ట్రెజరర్‌గా జావిద్ తోపాటు మరో 20 మందితో ఈ కమిటీ ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో, ఖాసీం కురేసి, అజ్మత్ పాషా, ఉస్మాన్, జాకీర్, సత్తార్, అంకుష్, మక్బూల్ బాషా, ఖయ్యుమ్, హనీఫ్, జలీల్, అజీజ్, జానీ పాషా, మైను, రసూల్, షౌకత్, గౌస్, మౌలానా, మసూద్, మునవర్, కమార్, అక్బర్, సలీం, అస్లాం, తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర దేవాలయంపై ఆరోపణలు చేయడం తగదు

విశాలాంధ్ర - కారేపల్లి : సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి శ్రీ కోట మైసమ్మ ఆలయ ట్రస్ట్ చైర్మన్‌తో పాటు ఆలయ అభివృద్ధిపై ఆరోపణలు చేయడం తగదని మండల గిరిజన సంఘం నాయకులు ఇస్లావత్ శంకర్ నాయక్, గుంపిడి నాగేశ్వరరావు, భూక్య మాన్సింగ్, లాకావత్ గోపీనాథ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఉసిరికాయల పల్లిలో వారు విలేకరుల తో మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కోరిన కోరికలు తీర్చే కోట మైసమ్మ అమ్మవారి ఆలయ నిర్వహణ, అభివృద్ధి పట్ల భక్తులు పూర్తి నమ్మకంతో సంతృప్తిగా ఉన్న కారణంగానే ప్రతి సంవత్సరం (దసరా) విజయదశమి రోజున ఐదు రోజులపాటు పెద్ద జాతర జరుగుతుందని లక్షకు పైగా భక్తులు దర్శించుకునే అంతటి ప్రతిష్టాత్మకమైన దేవాలయంపై కొంతమంది కావాలని ఆలయంపై, ఆలయ భూమిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ వ్యక్తిగత ప్రయోజనం పొందదానికి ప్రయత్నించడం సరికాదన్నారు.ఈ ఆలయం పూర్తిగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆధ్వర్యంలో పనులు జరుగుతాయన్నారు. ఈ ఆలయం 2008 సంవత్సరం నాటికి అప్పటి తాసిల్దార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్, విఆర్ఓతో పాటు రెవిన్యూ ల్యాండ్ సర్వేయర్ పర్యవేక్షణలో ఆనాటి సర్పంచ్, దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వరంగల్, అసిస్టెంట్ కమిషనర్ ఖమ్మం, కార్యనిర్వాహణాధికారి, గ్రామస్తుల సమక్షంలో ఆలయానికి ఎనిమిది ఎకరాల భూమిని సరిహద్దులతో ప్రభుత్వానికి అప్పజెప్పడం జరిగిందన్నారు. కాగా గ్రామస్తులు కానీ కొంతమంది వ్యక్తులు ఈ ఆలయంపై దుష్ప్రచారం చేయడం వలన ఊరికి, ఆలయానికి చెడ్డ పేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పునరావృతం అయితే గ్రామస్తులుగా సహించేది లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పొడుగు రమేష్, ఉండం కుమార్, రాందాస్, రమేష్, హథిరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాసిరకంగా ప్లై ఓవర్ బ్రిడ్జ్ పనులు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా ఖానాపూర్ : నిర్మల్‌కు వెళ్లే రహదారిలో నడుస్తున్న ప్లై ఓవర్ బ్రిడ్జి పనుల్లో అధికారుల పర్యవేక్షణ కరువైంది కొమురం భీం చౌరస్తా నుండి మామడ పరిధిలోని రాయదారి వరకు అటవీ అంతరించి ఉన్నందున రోడ్డుకు ఇరువైపులా రిజర్వు ఫారెస్ట్ ఉండటం వలన రోడ్డు వెడల్పులో భాగంగా నేషనల్ హైవే పనుల్లో వన్యప్రాణుల సంరక్షణ కొరకై నేషనల్ హైవే రోడ్డు భవనాల శాఖ నుండి కోట్ల రూపాయల నిధులతో నిర్మల్ టు ఖానాపూర్ రహదారి 19 కిలోమీటర్ల వ్యవధిలో ఐదు చోట్లలో వన్యప్రాణుల సంరక్షణ కొరకై వన్యప్రాణులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తున్న తరుణంలో పర్యవేక్షణ లోపంతో పనులు నాసిరకంగా నడుస్తున్నా పిల్లర్ వర్క్ లో ఎటువంటి హైబ్రేటర్ వాడకుండా తూతూ మంత్రంగా పనులు నడుస్తున్నాయి పార్టీ ఏం ఏం కంగార మట్టి కంకర మిక్సింగ్ ను పుట్టింగ్లో వాడుతూ పిల్లర్ పనుల్లో కూడా ఎటువంటి హైబ్రేటర్ వేయకుండా పనులు పూర్తి చేస్తున్నారు కాంట్రాక్టర్లు పట్టింపు ఉన్న అధికారులు కరువైనారు అని కొందరు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు సంబంధిత శాఖ అధికారిని చేరవాణి ద్వారా వివరణ కోరగా పరవాలేదు కరెక్టే ఉన్నాయి పనులు అని వివరించారు.

బీసీ జనాభా గణనను స్వాగతిస్తున్నాం

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం బీసీ జన గణన పారదర్శకంగా లెక్కించాలని అవకతవకలు లేకుండా సక్రమంగా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున అన్నారు. ఆదివారం నల్లగొండ మండలం జి చెన్నారం గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ మహాసభ కట్ట అంజయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ఎట్టకేలకు ప్రభుత్వం బీసీ జనాభా లెక్కలను కట్టడం హర్షించదగ్గ పరిణామం అన్నారు. జనాభా లెక్కల ఆధారంగా ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించడం ప్రజా ప్రాతినిధ్యలో కూడా రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. సంక్షేమ ఫలాలు ప్రజలకు అండించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి నాలుపరాజు సైదులు నాయకులు కట్ట అంజయ్య, మారగోని అంజయ్య, ఉప్పునుతుల శ్రీను, ఎర్రయ్య, పాండురజు, నర్సింహా, వెంకటయ్య, గిరి, ఆనంద్, శంకరయ్య.తదితరులు పాల్గొన్నారు

పునరుద్ధరించిన వైద్యపరికరాల దిగుమతులపై పరిశ్రమ సంఘాల ఆందోళన

ముంబయి: పునరుద్ధరించిన వైద్యపరికరాల దిగుమతుల అనుమతులకు సంబంధించి పర్యావరణం, అటవీ, శీతోష్ణస్థితి మార్పుల డైరెక్టరేట్ జనరల్, ఆరోగ్యసేవల డైరెక్టరేట్ జనరల్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టరేట్ జనరల్ ఇటీవల జారీచేసిన ఆఫీస్ మెమోరాండంలపై భారతీయ పరిశ్రమ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశాన్ని చర్చించడానికి పిహెచ్‌డి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పిహెచ్‌డిసీసీఐ), అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మెడికల్ డివైజెస్ (ఏఐమెడ్), మాన్యుఫ్యాక్చరర్స్ ఆఫ్ ఇమేజింగ్, థెరపీ అండ్ రేడియాలజీ డివైజెస్ అసోసియేషన్ (మిత్రా), అసోసియేషన్ ఆఫ్ డయాగ్నోస్టిక్ మాన్యుఫ్యాక్చరర్స్ ఆఫ్ ఇండియా (ఏడీఎంఐ) ప్రతినిధులు, మెడ్ టెక్ పరిశ్రమకు చెందిన ముఖ్య వాటాదారులు పిహెచ్‌డి హౌస్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. భారతదేశంలో ఇలాంటి పరికరాలు తయారు చేయబడినప్పటికీ, పునరుద్ధరించబడిన, ప్రి ఓన్డ్ వైద్యపరికరాలను దిగుమతి చేసుకోవడానికి ఆయా ప్రభుత్వ శాఖల నిర్ణయాలు వీలు కల్పిస్తున్నాయి.

సికెల్ సెల్ అవగాహన దినోత్సవం

ముంబయి: అక్టోబర్ నాల్గవ శనివారాన్ని ప్రతి సంవత్సరం సికెల్ సెల్ అవగాహన దినంగా జరుపుతుంటారు. దానిలో భాగంగా అక్టోబర్ 26న తలసేమియా అండ్ సికెల్ సెల్ సొసైటీ (టిఎస్‌సిఎస్), శివరాంపల్లిలోని తమ ప్రాంగణంలో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలతో పాటుగా వైద్య శిబిరం కూడా నిర్వహించింది. 'సికెల్‌సెల్ వ్యాధి బారిన పడిన వారిలో సైకలాజికల్, సామాజిక సమస్యలు, వాటితో పోరాడటం' గురించి ప్రత్యేకంగా డాక్టర్ అజ్రా ఫాతిమా (క్లినికల్ సైకాలజిస్ట్) మాట్లాడారు. దాదాపు 150 మంది సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగీకారం, శ్వాస వ్యాయామాలు, పరధ్యానం, సానుకూల ఆలోచనలు వంటి అంశాలను డా.అజ్రా చర్చించారు. చంద్రకాంత్ అగర్వాల్, డాక్టర్ సుమన్ జైన్, అనితా ఉపాధ్యాయ, ప్రియదర్శిని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనటంతో పాటుగా స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేశారు.

హెచ్‌డిఎఫ్‌సి లైఫ్‌కు అవతార్, సెరామౌంట్ గుర్తింపు

ముంబై: హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, భారతదేశంలోని ప్రముఖ బీమా సంస్థల్లో ఒకటి, భారతదేశంలోని మహిళలకు అత్యుత్తమ కంపెనీగా అవతార్, సెరామౌంట్‌లచే గుర్తింపు పొందింది. ఈ పురస్కారం మహిళలను ప్రోత్సహించే వాతావరణాన్ని పెంపొందించే వ్యాపారాలను గౌరవిస్తుంది. 12 ఇతర బీఎఫ్ఎస్ఐ సంస్థలతో పాటు హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ గుర్తింపు పొందింది. అదనంగా, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ మోస్ట్ ఇన్‌క్లూజివ్ కంపెనీస్ ఇండెక్స్‌లో 'ఎక్స్‌మ్ప్లర్స్ ఆఫ్ ఇన్‌క్లూజన్' గుర్తింపును కూడా పొందింది, ఇది మహిళలకు మాత్రమే కాకుండా వైకల్యాలున్న వ్యక్తులకు, ఎల్‌జీబీటీక్యూ+ కమ్యూనిటీని, విభిన్న తరాలు, సాంస్కృతిక నేపథ్యాలు గల వ్యక్తులను చేర్చడాన్ని ప్రోత్సహించడంలో అద్భుతమైన వ్యాపారాలను గుర్తిస్తుంది. హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ సంస్థాగత సంస్కృతికి వైవిధ్యం, ఈక్విటీ, చేరిక ఎంత కీలకమో ఈ గౌరవాలు హైలైట్ చేస్తాయి. సమస్యలను పరిష్కరించడం ద్వారా సమానత్వ వాతావరణాన్ని పెంపొందించడానికి మరియు నిర్వహించడానికి కంపెనీ కట్టుబడి ఉంది.

ఓపెన్ సోర్స్ ఇన్నోవేషన్ ద్వారా ఏఐ పర్యావరణ వ్యవస్థ

ముంబయి: ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలను ఏఐ మార్చడం కొనసాగిస్తున్నందున, ఓపెన్ సోర్స్ టెక్నాలజీ అనేది ఆవిష్కరణకు ఉత్ప్రేరకంగా నిలుస్తుంది. ముఖ్యంగా, భారతదేశంలో ఈ మిషన్ ముఖ్యమైనది, ఇక్కడ అభివృద్ధి చెందుతున్న డెవలపర్ పర్యావరణ వ్యవస్థ, వేగంగా అభివృద్ధి చెందుతున్న టాలెంట్ పూల్‌తో కలిపి, ఏఐ-ఆధారిత డిజిటల్ పరివర్తనలో విప్లవానికి వేదికను ఏర్పాటు చేస్తోంది. నేడు, బెంగళూరులో 'బిల్డ్ విత్ ఏఐ సమ్మిట్'ను నిర్వహిస్తున్నందున, దేశంలోని డిజిటల్ పర్యావరణ వ్యవస్థ అపారమైన సామర్థ్యాన్ని మేము గుర్తించామని నిర్వాహకులు తెలిపారు. బిల్డ్ విత్ ఏఐ సమ్మిట్‌కి ముందు, మేము డెవలపర్‌లను శక్తివంతం చేయడానికి ఏఐ హ్యాకథాన్‌ను నిర్వహించారు. మెటా లామా ఓపెన్ ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగించి ఆవిష్కరణల భవిష్యత్తును ప్రోత్సహించారు. దేశవ్యాప్తంగా 1,500కి పైగా రిజిస్ట్రేషన్‌లతో, 350 కంటే ఎక్కువ ప్రతిపాదనలు, 90కి పైగా బృందాలు పాల్గొనగా, క్యూర్ ఫార్మా ఏఐ, సివిక్ ఫిక్స్, ఈవీఏఐఎస్‌మెంట్ విజేతలుగా నిలిచాయి, పూర్తిగా మహిళా సభ్యుల బృందంతో కూడిన షీ బిల్డ్స్‌కు ప్రత్యేక ప్రస్తావన లభించింది. పాల్గొన్న అభ్యర్థులకు లామా ఇంపాక్ట్ గ్రాంట్‌ల కోసం తమ ప్రతిపాదనలను సమర్పించే అవకాశం కూడా ఉంది.

జిల్లా స్థాయి కరాటే బెల్ట్ పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : మెదక్ గుల్షన్ క్లబ్‌లో రెంజుకి షాటోకన్ స్పోర్ట్స్ కరాటే అఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కరాటే బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించారు. కరాటే మాస్టర్ దినాకర్, చీఫ్ ఎగ్జామినర్ రెంజుకి షాటోకన్ స్పోర్ట్స్ కరాటే అఫ్ ఇండియా వ్యస్థాపకులు, కరాటే సీనియర్ మాస్టర్ నగేష్, అబ్జర్వర్‌గా విద్యాసాగర్, మల్లేశంలు వ్యవహరించారు. 80 మంది విద్యార్థులు వివిధ మండలాల నుండి పాల్గొన్నారు. ఈ బెల్ట్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పసుపు బెల్ట్ విభాగంలో వేదశ్రీ, మెగావర్ష, మహస్వ, సాయి ఉన్నారు. ఆరంజ్ బెల్ట్ విభాగంలో ధన్వి, అభి నందన్, గ్రీన్ బెల్ట్ విభాగంలో విలాసిని, మనస్విని, దివ్య, శివ సత్య, మోక్షిత్, సుఫియాన్, బ్లూ బెల్ట్ విభాగంలో తణ్మయి, సుమఅయ్యా, అర్షద్, పర్పుల్ బెల్ట్ విభాగంలో అర్షయా, చందన. బ్రౌన్ బెల్ట్ విభాగంలో సాయిచరణ్, ప్రణయ్, శ్రీనివాస్ రాజు, బ్రౌన్ 2బెల్ట్ విభాగంలో జయశ్రీ, శ్రీజ, పృథ్వీక, విహాన్, హనిష్క చారీ, బ్రౌన్ 1బెల్ట్ విభాగంలో సుహానిక, పృథ్వీక, యశ్విత రాజ్, సాన్విక, కార్తీక్‌లు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులను కరాటే మాస్టర్ నగేష్ మాస్టర్ బెల్ట్స్ ప్రాధాన్యం చేశారు. నేటి సమాజంలో కరాటే నేర్చుకోవడం అమ్మాయిలకు ఎంతో అవసరం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూపాల్, గణేష్, సూరజ్, అఖిల్, అబ్దుల్, శ్రీహర్షిత, విశిష్ఠ రాజ్, స్వరూప్, రవళి తదితరులు పాల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే తూడి

విశాలాంధ్ర - వనపర్తి : పెద్దమందడి మండలం అల్వాల గ్రామానికి చెందిన రాజ వర్ధన్ రెడ్డి, అరుణ దంపతులకు కూతురు శ్రావణి నిశ్చితార్థ కార్యక్రమానికి ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన జంటను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్న ఒక వెలుతురు

ప్రశ్న మనిషి మస్తకం
ప్రశ్నే మానవ తృష్ణకు ఆధారం
ప్రశ్నే కదా మానవాళికీ సమస్తం

హృదయంలో ప్రశ్నే కదా
సిద్ధార్థుడిని గౌతముడిని చేసింది
రుధిరంలో ప్రశ్నే కదా
అంబేద్కరుడిని అందరివాడిని చేసింది
మానవ నరాలలో ప్రశ్నలు
ప్రవహించినంత కాలం
నవ నాగరికతలు వర్ధిల్లు

నేను చూశాను కొన్ని చోట్ల
ప్రశ్నలు తెగ నరకటం
ప్రశ్నలు పొరలు పొరలుగా రాలటం
ప్రశ్నలు ముక్కలు ముక్కలు కావటం
నేను చూశాను కొన్నిచోట్ల
ప్రశ్నల గొంతు నులుమడం
నియంతృత్వంతో ప్రశ్నలను
అణచివేయాలనుకోవడం ఎంత మూర్ఖత్వం

ప్రశ్న వెయ్యి చేతుల మర్రిచెట్టు
తెగ నరికినా శాఖోపశాఖలై ఉదయించు

వేల యుద్ధాలు జేసి ప్రశ్నను వెన్నుపొడిచినా
ప్రజల ప్రాణదాహార్తికై పునర్జీవించు
అంతిమ సమరమున విజేతగా నిలుచు

ప్రశ్నించే తత్వాన్ని భావితరాలకివ్వండి
విత్తనంలో మహా వృక్షం దాగున్నట్లు
ప్రశ్నలోనే దాగుంది దినకర ప్రభాతం

ఐ. చిదానందం,
8801444335

సాహితి

కవిత్వంలో వస్తు ప్రాధాన్యత - విశ్లేషణ

ఎస్.ఆర్. పృథ్వి, 9989223245

వర్తమాన కవితారంగాన్ని వచన కవిత ఆక్రమించిన విషయం మనకి తెలిసిందే. వచన కవితా వృక్షానికి శాఖోపశాఖలు విస్తరించి, వృద్ధినొంది, అలరిస్తున్న విషయమూ మనకి తెలిసిందే. అటువంటి వచన కవిత్వం శిష్లా ఉమామహేశ్వరరావుతో ప్రారంభమై, పఠాభి, నారాయణబాబు, ముద్దుకృష్ణ, శ్రీశ్రీ, పురిపండా మొదలగు వారి ప్రమేయంతో చక్కటి రూపాన్ని సంతరించుకుంది. వారు వేసిన దారిలో కుందుర్తి, తిలక్, అరిపిరాల విశ్వం, ఆరుద్ర, సోమసుందర్, దాశరథి, కాళోజీ వంటి వారి అడుగులతో చిక్కబడి, పూల పరిమళాన్ని వెదజల్లుతూ ఉంది.

వచన కవిత్వంలోకి రకరకాల భావాలు ప్రవేశించాయి. కొందరు 'శిల్పానికి' ప్రాధాన్యత నిచ్చారు. కొందరు 'లయ' కి ప్రాధాన్యత నిచ్చారు. కొందరు రసంకి, కొందరు వస్తువుకి ప్రాధాన్యతనివ్వడం జరిగింది. ఏదిఏమైనా వస్తువు కారణంగా ఈనాడు వచన కవిత్వం విస్తృతపడి మహా వృక్షమైంది. రానురాను విప్లవ కవిత్వం, స్త్రీ వాద కవిత్వం, దళిత కవిత్వం, ముస్లిం కవిత్వం వంటివి ఏర్పడ్డాయి. ఆధునిక వ్యవస్థలో వస్తు కొరత లేదు. నిత్య జీవితంలో కోకొల్లలుగా లభిస్తాయి. నా మట్టుకు నాకు, వచన కవిత్వానికి వస్తువు ప్రధానమైన అంశం అని భావిస్తాను. వచన కవిత్వానికి ఆంక్షలు లేకపోవటం మూలాన కవి, ఏ వస్తువునైనా తీసుకుని కవిత్వం రాయవచ్చు.

'కవిత్వానికి భావ నేపథ్యం, సామాజిక సూత్రాలు, భావ చిత్రాలు మొదలైనవి సామగ్రి' అన్నారు డా॥అద్దేపల్లి రామమోహనరావు. ఉత్తమ కవిత్వానికి హృదయము, అవగాహన రెండూ ప్రధానాంశాలే అన్నారాయన. నైతిక విలువలు కూడా కవిత్వంలో వస్తువుగా పరిగణిస్తారు. అసంతృప్తికి అక్షర రూపమే ఆధునిక కవిత్వం, అలాగే ఆగ్రహానికి అభివ్యక్తే ఆధునిక కవిత్వం అన్నారు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి.

ఎప్పటికప్పుడు వర్తమాన సమాజంలో కొత్త కొత్త వస్తువులు కవిని ప్రేరేపిస్తా ఉన్నాయి. అందువల్ల వస్తువును ఎంపిక చేసుకోవటంలోనే కవి సామర్థ్యం వ్యక్తమౌతుంది. వస్తువును బట్టి కవితకు రూపురేఖలు ఏర్పడతాయి. కవి మంచి శిల్పాన్ని నైపుణ్యంగా చెక్కగలుగుతాడు.

1994 ప్రాంతంలో కోనసీమలో బ్లో ఔట్ సంభవించిన సంగతి తెలిసిందే. ఒక కవి 'బ్లో ఔట్'ని వస్తువుగా చేసుకుని రాసిన కవిత ఎలా ప్రారంభమైందో చూడండి.

"సామ్రాజ్యవాద కాలధూమాల నీడల కింద
శిరస్సు తెగి, మొండెంలోంచుబికిన/ నెత్తుటి ధార, ముద్దై,
నింగి కెగురుతున్న శైలంలాగ/రాత్రి సూర్యుడై ప్రజ్వలిస్తోంది గ్యాస్ బావి
పాదాల చెంత పారాడే చిత్తడి/ పోరాటానికి సిద్ధమైన ప్రత్యర్థిలా
వేడి సెగల వాగయింది' అంటాడు. కవి, తను దర్శించిన బ్లోఔట్‌ని ఒక భావ చిత్రంలో బంధించటం జరిగింది.

ప్రముఖ కవి డా॥ఎన్.గోపి తెలియని వారుండరు. ఒక సందర్భంలో వర్షం గురించి తపిస్తూ, వర్షాన్నే వస్తువుగా ఎంచుకుని రాసిన కవిత. నిరంతర కవితాఝురిలో తడుస్తానే ఉంటారీయన.

'వర్షమా!/ నీ కుండపోత ఒక్కటే మాకు అండ
చిత్తడి చిత్తడైన నేలలోంచి/ మెత్తని పద్మాలు లేవాలి
విప్పుకుంటున్న రేకుల్లో /సూర్యుడు చల్లబడాలి' అంటారు.

చాలామంది బతుకుతెరువు కోసం పల్లెలు వీడి, పట్టణాలకు, నగరాలకు వలసలు వెళ్లడం చూస్తానే ఉన్నాం. ఆ నగరాలు ఏ విధంగా ఉంటున్నాయి అనేది చాలామంది కవులు వాళ్లు దర్శించిన అనుభవాలను అక్షరీకృతం చేశారు. వారిలో పొద్దుటూరి మాధవీలత ఒకరు. వారు, ఒక కవితలో-

'ప్రతి క్షణం/ పుట్టగొడుగుల్లా / పుట్టుకొస్తున్న అడ్డుగోడలను
నియంత్రించలేని నగరం/ నేడు అనకొండల్లా
విస్తరిస్తున్న రాతి గోడల మధ్య
నిద్రిస్తున్న సమాధుల గుట్టలా ఉంది' అన్నారు.

దేశభక్తిని వస్తువుగా స్వీకరించి కవిత్వం రాసిన కవులు స్వాతంత్ర్యోద్యమ సమయంలో కోకొల్లలు. అయితే దేశభక్తి కవిత్వంలో గురజాడే అందరికీ ఆదర్శం. వేమన పద్యంలాగా అందరి నోటికి అలవోకగా వచ్చే కవిత నిక్కడ ఉదహరించాలి.

'దేశమును ప్రేమించుమన్న/ మంచి అన్నది పెంచుమన్న
వట్టి మాటలు కట్టిపెట్టోయ్/ గట్టి మేల్ తలపెట్టవోయ్"

ఆధునిక సాహిత్యంలో కూడా అమ్మ, నాన్నలు వస్తువులై అలరించటం విశేషం. సోము సీతారాములు అమ్మనుద్దేశించి ఇలా అంటారొక కవితలో.

'మా అమ్మ లేకుంటే ఆకృతి లేదు
మా అమ్మ లేకుంటే ఆహారము లేదు
ఆత్మీయత, అనుబంధానికి అర్థంలేదు
చెక్క పలకపై తన పేరును రాసి,
నాకూ చదువు వచ్చురా అని మురిసేది'.

గత రెండున్నర దశాబ్దాలుగా కవిత్వంలో తండ్రి రూపం విరివిగా దర్శనం అవుతూ ఉంది. తండ్రిని అక్షరాలలో దర్శించని కవి లేడని చెప్పాలి. తండ్రిది విశ్వరూపం. ఒక్కొక్కరు, ఒక్కొక్క విధంగా దర్శించారు, దర్శిస్తున్నారు. పిడుగు పాపిరెడ్డి దర్శించిన తండ్రి రూపంలో ఒక రేఖ- 'మసక చీకట్లో మంచం మీద లేచి/అంచునున్న నన్ను మధ్యకు జరిపినట్లు/ జీవిత సమరంలో నిబ్బరంగా/ నిలబెట్టిన నగధీరుడు నాన్న' అంటారు.

ఈ కాలంలో రాజకీయం కూడా కవిత్వంలో భాగమైంది. రాజకీయం ఒక వర్గానికి వృత్తిగా మారిపోయింది. వృత్తి అంటే లాభనష్టాలు ఉంటాయి కదా! డా॥అద్దేపల్లి రామమోహనరావు ఒక సందర్భంలో- 'రేపటి రాజకీయం/ ఆకాశం మీద విహరించే మబ్బుల్లోంచి / పూల జల్లులా కురవదు/ శ్రమజీవి చెమటలో/ తడిసిన మట్టిలోంచి/ మానవతావృక్షంలా చీల్చుకొస్తుంది/ ఇవాల్టి బురదలోంచే/ రేపటి అందాల కలువ విచ్చుకుంటుంది.'- బురదలాగున్న నేటి రాజకీయంలోంచి రేపటి రోజున పూజనీయమైన కలువ విచ్చుకుంటుందన్నారు. ఒక ఆశా పుష్పాన్ని మొలకెత్తించారు కవి.

న్యాయం, చట్టం సమాజంలో విలువైనవని. రాజ్యాంగం, ప్రతి మనిషికి సమాన హక్కు కల్పించింది. వాటిని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానిది. అటువంటి చట్టం గురించి అడిగోపుల వెంకటరత్నం ఇలా అంటారు. 'చట్టం తనపని తాను చేసుకుపోతుంది/ రహదార్లు వీడి/ రాచబాటలు నుంచి / సందు గొందుల్లో / చీకటి దారుల్లో ఒకచోట తలవంచి / ఒకచోట తలవంపుగా / నడిచిపోతే చట్టాన్ని చూస్తూ...' అని వాస్తవాన్ని ఎరుకపరుస్తారు.

నిరంతర జీవన చలనంలో తారసపడిన లేదా తన అనుభవంలోకి వచ్చిన ప్రతి వస్తువుని స్వీకరించాడు కవి. కవిత్వం చేసి తిరిగి సమాజానికి అందించాడు. వాటిల్లో 'నిశ్శబ్దం' కూడా ఉంది. కవయిత్రి మొదలి పద్మ- 'నిశ్శబ్దం/ సవ్వడిని అదిమి పెట్టిన నిశ్శబ్దం/ రెండు సంభాషణల నడుమ/ విరామ సంచారం నిశ్శబ్దం/ యాతనలన్నీ చేతనను కోల్పోతే/ మదికి మోయలేని నిశ్శబ్దం' అంటూ ఒక అనుభూతికి చక్కటి రూపమిచ్చారీమె. మనిషి సమూహంలో ఉన్నా ఒక్కోసారి ఒంటరితనాన్ని మోస్తాడు. అదే ఒక కవి స్వీకరించి అక్షరాలతో అలంకరించారు.

'నిజానికి పుట్టేటప్పుడు మనిషి ఒంటరే/ పోయేటప్పుడూ ఒంటరే/ మధ్య జీవితంలో/ సమూహంలోనే జీవిస్తున్న / ఎవరికి వాళ్లమే ఏకాంత దీపాలం!/ ప్రతి వ్యక్తి చుట్టూ ఓ స్వార్థ వలయం!' అని మనిషిలో దాగిన రుచులను బయటపెట్టే ప్రయత్నం చేశారీ కవి.

రైతు దేశానికి జీవగర్ర. రైతు లేనిదే మనిషికి బతుకు లేదు. అటువంటి రైతు నిత్యం ఎన్నో కష్టాలకు, మోసాలకు గురవుతున్నది వాస్తవం. కవి ఈమని వీరేంద్ర రైతుని తన సిరాలో నింపి, జీవాక్షరం చేశారు. చూడండి- 'బాధను దిగమింగుకుని/ బాధ్యత తలకెత్తుకుని/... ... .../వ్యయమేమో ఎక్కువైంది/ సాయమేమో తక్కువైంది/ వ్యవసాయం భారమైంది నిజమేనన్నా/ నీ తల్లి ముసలిదైంది/ నీ పిల్ల పెళ్లికుంది/ నువ్వేగా వాళ్లకుంది కనరా కన్నా'.

ప్రతి మనిషి జీవనయాత్రలో బాల్యం మరువలేని అంశం. బాల్యం మీద చాలామంది కవులు కవిత్వం రాశారు. కొందరు పాటల్ని అల్లితే, అద్దేపల్లి వంటి వారు గజల్‌లో నింపి, మధు తుంపర్లుగా కురిపించారు. ఒక కవితలో ప్రసన్నకుమారి- 'పాలు కారే మోములో/ అందరినీ మోహంలో ముంచేదే బాల్యం/ ఎల్లలంటూ ఎరుగని/ అనురాగాల కావ్యం బాల్యం/ మలయ మారుతంలా / వీచే పవనమే బాల్యం' అందుకే బాల్యంలోని జ్ఞాపకాలు ప్రతివారికి అమూల్యం.

మనుషులు నిరంతరం పూల పరిమళాన్ని ఆశ్వాదించాలనుకుంటారు. కొందరు పూలమాలలతో సన్మానాలందు కోవాలనుకుంటారు. అటువంటి మనుషుల్ని ఆకర్షించి, అలరించే అందమైన పూల గురించి కవిత్వం రాసిన వారెందరో ఉన్నారు. అలాంటి వారిలో పొత్తూరి సుబ్బారావు ఒకరు. వారొక కవితాసంపుటినే వెలువరించారు. వారి అక్షర మాధుర్యంలోంచి నాలుగు పంక్తులు.-

'నలుగురు నడిచే తోవలో/ గడ్డి మొలవక పోవచ్చు
పదిమంది తిరిగే బాటకిరువైపులా/ గడ్డిపై పూలు వికసిస్తుంటాయి
... .../ ప్రకృతిలో ఏదీ అందవిహీనంగా
ఉండదన్న భావన/ మనసులో స్ఫురిస్తుంది
మన చూపుల్లో ఉన్న వ్యత్యాసం/ మనకే అర్థమౌతుంది' సృష్టిలో ఎన్నో పూలు ఉన్నాయి. ఎవ్వరూ పట్టించుకోని గడ్డిపువ్వును కవి మహారాణిని చేశారిక్కడ.

ఒక ప్రాణికి లేదా వ్యక్తికి ఉనికి ముఖ్యం. ఉనికి నిలుపుకోలేకపోతే సృష్టిలోంచి వైదొలగినట్లే. అందుకే చాలామంది ఉనికి కోసం తాపత్రయపడతారు. అటువంటి ఉనికిని కవితా వస్తువు చేసుకున్నారు ప్రముఖ కవి డా॥శివారెడ్డి. ఆయనేమన్నారంటే-

'ఏం చేయనక్కర్లేదు/ ఉంటే చాలు / అతనక్కడుంటే చాలు
ఉండటంలోనే ఉనికి/ ఉనికిలోనే సమస్తార్థాలు
సమస్త వ్యాఖ్యానాలు ఉండటం, లేకపోవటం
సమస్త పదార్థ జ్ఞానాన్ని/ సమస్త జీవ అర్థస్ఫూర్తుల్ని/ నిర్ణయిస్తాయి'

సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించి, ప్రపంచీకరణ ముసుగులో మనిషిని బానిసను చేస్తున్న నేపథ్యాన్ని, కవిత్వంలో శ్రీకారం చుట్టిన కవుల్లో డా॥అద్దేపల్లి ముఖ్యులు. ప్రపంచీకరణను వస్తువుగా స్వీకరించి, రాసిన అనేక కవితలు సమాజం మీద ప్రభావం చూపటం జరిగింది. ఒక సందర్భంలో- 'ఫ్యూడల్ దశలో స్త్రీని బానిస అనుకున్నాను/ క్యాపిటల్ దశలో స్త్రీని మార్కెట్ వస్తువనుకున్నాను/ బానిసైనా అనుబంధాలన్నీ ఉన్నై/ మార్కెట్ వస్తువైనా అనుభవాలన్నీ ఉన్నై/ రాబోయే ఇంటర్‌నెట్ యుగంలో/ స్త్రీ ఒకే ఒక్క అవయవం అవుతుంది' అంటారు.

చివరిగా మరొక్క అంశం చెప్పి ముగిస్తాను. ఒక కవి 'మగ్గం' ను కవితా వస్తువుగా ఎంచుకున్నారు. మగ్గం అంటే, నేత కార్మికుడు అని చెప్పుకోవచ్చు. ఏమన్నాడో చూడండి- 'చీకటి విడిపోక ముందే/ నిద్దుర కళ్లు, మగ్గం కేసి చూస్తాయి/ ఆలోచన, పని భారంతో నిండిపోతుంది/ కాళ్లు రెండూ మగ్గం గోతిలోకి నడిపిస్తాయి/ మనిషి ఆపాద మస్తకం యంత్రమౌతాడు'- చివరిలో ముగింపు వాక్యాలుగా ఇలా అంటాడు కవి. 'నేత కార్మికుడంటే శ్రమ చేతిలో/ మోసగించిన సైనికుడు' సైనికుడితో పోల్చాడు. సైనికుడికి జీవితం మీద ఆశ కంటె విద్యుక్త ధర్మం ముఖ్యం. దేశభక్తి జీవితం.

ఇలా వందల వస్తు సామగ్రి ఈ విశ్వంలో లభిస్తుంది. ఏ కవి మనసు ఏ వస్తువును ఆకర్షిస్తే, ఆ వస్తువు అతని కవిత్వానికి వాహిక అవుతుంది. కవిత్వం ఒక నిరంతర పయనం. ఒక కవి ఎక్కడో ఒకచోట ఆగినా, కవిత్వం మాత్రం నిరంతర ప్రవాహమైన జీవనది. అందుండి తీసుకున్న కొన్ని బిందువులు మాత్రమే ఇందులో చేర్చటం జరిగింది.

లెక్కకు మించిన విషయాలు చెప్పే మంచిప్రయత్నం

'ప్రజాస్వామ్య ప్రస్థానం'

ప్రభుత్వోద్యోగం చేస్తూ అధ్యయనం చేసిన విషయాలను పత్రికల్లో వ్యాసాలు, వ్యాసాలను పుస్తక రూపంలో ప్రచురించే ఆనవాయితీ తెలుగునాట ఈనాటిది కాదు. అదే కోవకు చెందిన రచన ప్రజాస్వామ్య ప్రస్థానం. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారిగా పదవీ విరమణ చేసిన అనిశెట్టి శాయికుమార్ ఉద్యోగ నిర్వహణలో భాగంగా ఆర్జించిన జ్ఞానాన్ని సమాచార రూపంలో ఇచ్చే ప్రయత్నమే ప్రజాస్వామ్య ప్రస్థానం. ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఆధునిక ప్రజాస్వామ్యం అది అధ్యక్ష తరహా కావచ్చు లేదా పార్లమెంటరీ తరహా కావచ్చు ఎలా ప్రస్తుత దశకు చేరుకుందో రచయిత చక్కగా వివరించారు.



గ్రీకు ప్రజాస్వామ్యం నుంచి ఇంగ్లండ్‌లో రాజరిక వ్యవస్థ ఉండగానే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎలా వేళ్లూనుకుందో చెప్పిన తీరు బాగుంది. అలాగే, ప్రపంచంలోని అత్యున్నత ప్రజాస్వామ్యానికి వేదికగా అనేకమంది కీర్తించే అమెరికాలో లండన్ నుంచి సాగిన బ్రిటిష్ పరిపాలనలో పన్ను వసూళ్లు, దాని పర్యవసానంగా వచ్చిన అమెరికా విప్లవం, దాని స్ఫూర్తితో ఐరోపా దేశమైన ఫ్రాన్స్‌లో ఫ్రెంచి విప్లవం వరకూ ప్రపంచాన్ని కుదిపేసి, ఎనలేని తీరులో ప్రభావితం చేసిన అంతర్జాతీయ పరిణామాలు ఈ చిన్న పుస్తకంలో పూసగుచ్చినట్టు రాశారు శాయికుమార్.

రోజూ దినపత్రికలు చదవడంసహా మీడియాద్వారా ప్రపంచ పరిణామాలను ఎప్పటికప్పుడు గమనించే ప్రజాస్వామ్య ప్రియులకు ఈ పుస్తకం రిఫరెన్స్ బుక్‌గా ఉపకరిస్తోంది. అయితే, అన్ని విషయాలనూ లోతుగా చర్చించే అవకాశం లేకున్నా ఈ గ్రంథం తిరగేశాక ఇన్ని అంశాలను ఎలా ఒకేచోట చేర్చారు? అనే ప్రశ్న ఎదురవుతుంది. ప్రపంచానికి ముఖ్యంగా శ్రామిక వర్గానికి మెరుగైన ప్రత్యామ్నాయం చూపించిన మహామహోపాధ్యాయులు కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగిల్స్ రాసిన 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' నుంచి పెరియార్ ఈవీ రామస్వామి, బీఆర్ అంబేద్కర్, ఎంకే గాంధీ వంటి చరిత్ర గతిని మార్చిన రచనలు, గొప్ప వ్యక్తుల గురించే గాక 2019 -2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో పూర్వపు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాలంటీర్ల వ్యవస్థ వరకూ శాయికుమార్ అనేకానేక విషయాలపై క్లుప్తంగా, సూటిగా పాఠకులకు చెప్పిన తీరు ఆసక్తికరంగా ఉంది. అయితే, వ్యాసాలను ఈ పుస్తక రూపంలోకి తీసుకురావడం వల్ల వివిధ భాగాలను ఒక వరుసలో పెట్టిన తీరులో కాస్త గందరగోళంగా కనిపిస్తోంది. ఈ గ్రంథం మలి ప్రచురణలో ఇలాంటి అంశాలను మరింత మెరుగ్గా తీర్చిదిద్దితే బాగుంటుంది. కొన్ని అంశాలు కాలం, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ఈ పుస్తకంలో అమర్చకపోవడమే కొట్టొచ్చినట్టు కనిపించే విషయం. అయితే, ప్రజాస్వామ్యం రోజురోజుకు బలోపేతమౌతూ అదే సమయంలో కొత్తకొత్త సమస్యలతో సతమతమౌతున్న ప్రస్తుత తరుణంలో 'ప్రజాస్వామ్య ప్రస్థానం' వంటి పరిచయ గ్రంథాలు తెలుగు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ పుస్తకం చదువుతున్నంతసేపూ రచయిత అవగాహన, అభిప్రాయాలతోపాటు అందరూ అంగీకరించే విలువైన సమాచారం సెలయేరు ప్రవాహంలా పాఠకులను నెమ్మదిగా ఆకట్టుకుంటుంది.

నాంచారయ్య మెరుగుమాల

ఆనందాల కొలువు.. ఉమ్మడి కుటుంబాల నెలవు

అన్నదమ్ములు, తోటికోడళ్ళు
మనవళ్లు, మనవరాళ్ళతో
కళకళలాడే ఉమ్మడి కుటుంబాలు
సూర్యచంద్రులు కోటి తారలతో
కాంతిని వెదజల్లే ఆనందాల హరివిల్లు
అదే రేపటి తరాలకు నేర్పేటి
చక్కటి సంస్కారాల కొలువు

సఖ్యతతో కూడిన అనుబంధాలు
ఆప్యాయత అనురాగాలని పంచుతూ
అమ్మ ఒడిలా ఆదరించే పొత్తిళ్ళు

'ఇంటి పెద్ద' తరతరాల చరిత్రకు
వారధిగా ఉంటూ.. రేపటితరాలకు
దిశా నిర్దేశం చేసే పట్టుకొమ్మ కాదా...!
నానమ్మ- తాతయ్య, అత్త-మామ
అనే రక్త సంబంధాలు కష్టాల్లో
వెన్నంటి నిలిచి భరోసానిచ్చే
బాధ్యతగల బాంధవ్యాలు

నాగరికత నేర్చుకున్న నేటి మనిషికి
బంధాలే భారమయ్యాయ్

'నేను నాది' అంటూ.. స్వార్థమనే
సుడిగుండంలో చిక్కుకుని
డబ్బు కోసమే జీవిస్తూ...
అనుబంధాలను కాలరాస్తూ..
తన పిల్లలకు నానమ్మ, తాతయ్య అనే
కమ్మని పిలుపుకి దూరం చేసే
కాల యముడయ్యాడు

మనవలు మనవరాళ్ల ప్రేమకు దూరమై

వృద్ధాశ్రమాల్లో తన వాళ్ళ మాటకూడా
నోచుకోని పండుటాకులు
హృదయ విదారకంగా నేలకొరుగుతూ ...
రేపటి నీ గతి కూడా ఇంతే అంటూ
అపహాస్యం చేస్తున్నాయి

మేలుకో ఇకనైనా.. తెలుసుకో
జీవిత పరమార్థం
బతుకు ముగిసేలోపు
ఎటు పోతుంది ఈ వ్యవస్థ...?
ఏమి సాధించింది..నేటి యువత?
కనీసం ఇప్పటికైనా కళ్ళు తెరిచి
ఆలోచించండి...రేపటి తరాల భవిత

నీ వాళ్లే.. నీ వెన్నంటి తోడుగ ఉంటే
ఎంతటి కష్టమైనా వెన్నలా
కరిగిపోదా...
'నా అనే' వాళ్ళు తోడుగ ఉంటే
జీవితం వేడుకలా ముందుకు సాగుతూ
బతుకున వెన్నెలే విరబూయిదా

(సాహిత్య చైతన్య వేదిక నిర్వహించిన దృశ్య కవితల పోటీలో ద్వితీయ బహుమతి పొందినది)

పేలూరి వెంకట మీనాక్షి
9912601765

గ్రంథ సమీక్ష

కర్షక జీవనయానం ఈ బతుకువర్ణం

సగం చచ్చిన అమ్మ/ దరిదాపులో కానరాని/ కన్నబిడ్డల కనికరం/ వృద్ధాశ్రమాల చిరునామా మాత్రం/ కన్నబిడ్డలకు చటుక్కున గుర్తొస్తుంది (తరతరాల వారధి).

అమ్మను చూచే బిడ్డలు గోడకు కొట్టిన బొమ్మలయ్యారు. పేగు తెంచుకొని పుట్టిన బిడ్డలు అమ్మకన్నం పెట్టలేక చేతులు దులుపు కొంటున్నారు. ఇదేనా కన్నతల్లిపై చూపించే కరుణ?

'లాంతరు' కరంటు రాకకు పూర్వం దీపంబుడ్లు, లాంతర్లు వచ్చాయి. ఇవి వెలుగునిచ్చి దారిచూపేవి. గృహకృత్యాలు తీర్చుకోవటాని కుపయోగించేవి. 'చావిట్లో గేదె ఈనినా, ఇళ్లల్లో పురుడు పోసినా, రాత్రిపూట అడుగు తీసి అడుగువెయ్యాలన్నా ఈ లాంతరు కావల్సిందే. దీని రుణం తీర్చుకోలేనిదే.

ఒక్కోసారి విత్తనం/ నిరాశపరుస్తుంది/ మొలకెత్తినా పూత పూయదు/ కాయ కాయదు/ (విత్తుపై పెత్తనం). పంటలు పండించే అన్నదాత గుండెకోతే. విత్తిన విత్తనం మొలకెత్తకపోతే రైతే నష్టపడుతున్నాడు. ఇదంతా వ్యాపారి మోసమే. దీన్ని అరికడితేగాని రైతు జీవితం మూడుపువ్వులారుకాయలు కాస్తాయి.

'ఇప్పుడు/ హలో హాయ్‌లను బోరు/ సెల్‌ఫోన్ మెయిల్సుది కీలక పాత్ర/ అంతా మౌనఘోష/ (ఉభయకుశలోపరి). ఈనాడు ప్రతి వ్యక్తి చేతిలో సెల్‌ఫోన్ ఉండవలసిందే. ఇది రాయబారి. ఈ రాయబారికి పగలు రాత్రి తెలియదు. ఒకటే దూకుడు. ఈనాడు సెల్‌ఫోన్ ఫ్యాషనయ్యింది.



బతుకు వర్ణం,
- బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి,
మూల్యం: రూ.100/-,
కాపీలకు రచయిత పేరున-
సన్ ఆఫ్ బి.రామిరెడ్డి,
వేణుగోపాలస్వామి గుడి ఎదురు, ఆత్మకూరు,
మంగళగిరి మండలం- గుంటూరు జిల్లా.

కీసు కీసుశబ్దంతో/ గగనంలో విహరించి/ ప్రకృతి సంపదను పులకరింపజేసే/ పిచ్చుకల జాడ ఇప్పుడేది? (గుబులు గూళ్లు) ఒకప్పుడు పిచ్చుకలు రివ్వున వసారాలోకి వస్తాయి. వేలాడగట్టిన వడ్లకంకుల గుత్తిపై వాలి ఒక్కొక్క గింజను తింటూ రెక్కలార్చుకొంటూ వెళ్లిపోయేవి. ఇప్పుడిక వీటి జాడ కనుమరుగయ్యింది. ఈ చిన్నపిట్టల ఆచూకీ ఈ తరానికి సాధ్యం కావటంలేదు. మరోతరంలో చూద్దామంటే నోరు పెగిలిరాదు.

'బతుకువర్ణం' లోని ఇరవైఅయిదు గీతాలు చెంగుచెంగున పరుగెత్తుతున్నాయి. మట్టి మనుష్యుల జీవితాల కద్దంపడుతున్నాయి. తెలుగు భాషాపదాలు కొత్తపుంతల్లో ఉన్నాయి. కర్షక జీవన యానం కంటికి కనబడుతూనే ఉన్నది. ఈ 'బతుకు వర్ణం భాగ్యోదయం కావాలి రెడ్డిగారూ!' మీరు కలాన్ని కదిలించి మరిన్ని కవితలు రాస్తారని ఆశిస్తాను.

- గెల్లి రామమోహనరావు, 2357514

'ఫూల్ వాలోంకి సైర్' దిల్లీ సమగ్రతకు చిహ్నం: ఆతిశి

న్యూదిల్లీ: 'ఫూల్ వాలోన్ కి సైర్' పండుగ కేవలం వేడుక కాదని... ఇది శతాబ్దాల నాటి గంగా-జమున తెహజీబ్ సంప్రదాయాన్ని సంరక్షిస్తుందని దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశి అన్నారు. శనివారం మెహ్రౌలీలోని చారిత్రాత్మక జహాజ్ మహల్‌లో జరిగిన 'ఫూల్ వాలోన్ కి సైర్' ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'ఫూల్ వాలోంకి సైర్' వేడుక మాత్రమే కాదని... దిల్లీ సమగ్రతకు చిహ్నంగా ఉందని, భిన్నత్వంలోని ఏకత్వాన్ని పెంపొందించడంతో పాటు మానవత్వ సందేశాన్ని వ్యాప్తి చేస్తుందన్నారు. "చాలా కాలంగా, ఏ పండుగ ఏ మతానికి చెందినదో కూడా నాకు తెలియదు' అని ఆమె చెబుతూ... సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో ఈ పండుగకకు ఎంతో ప్రాముఖ్యముందన్నారు. రాజకీయ నాయకులు విద్య, వైద్యం మరియు ఉపాధిని అందించడంపై దృష్టి పెట్టాలని ఆమె కోరారు. గత దశాబ్దంలో దిల్లీ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ... వెనుకబడిన పిల్లలకు నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రస్తావించారు. 'మేము దిల్లీ ప్రజలకు సేవ చేయడానికి ప్రయత్నిస్తున్నాము. వారి ప్రేమ ఆశీర్వాదాలు మాకు గొప్ప బహుమతి" అని ఆతిశి అన్నారు.

సర్జరీ విఫలమైతే వైద్యుడు బాధ్యుడు కాదు

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూదిల్లీ: చికిత్సకు, సర్జరీకి రోగి సానుకూలంగా స్పందించకపోయినా, శస్త్ర చికిత్స విఫలమైనా వైద్యపరమైన నిర్లక్ష్యం చూపారని వైద్యుడిని నేరుగా బాధ్యుడిని చేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తనకు నిర్లక్ష్యంగా వైద్యం అందించారని జస్విందర్ సింగ్ అనే వ్యక్తి ఛండీగఢ్‌కు చెందిన డాక్టర్ నీరజ్ సుద్‌పై జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్(ఎన్సీడీఆర్సీ)ను ఆశ్రయించారు. దీంతో బాధితుడికి రూ.మూడు లక్షల పరిహారం చెల్లించాలని వైద్యుడిని కమిషన్ ఆదేశించింది. మరో రూ.50 వేల జరిమానా విధించింది. ఈ ఆదేశాలను వైద్యుడు నీరజ్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిట్టల్ ధర్మాసనం విచారించింది. 'వైద్యుడు తన నైపుణ్యాన్ని సరిగ్గా వినియోగించడంలో, విధులు నిర్వర్తించడంలో విఫలమయ్యాడనే కచ్చితమైన ఆధారం లేనిదే వైద్యపరమైన నిర్లక్ష్యానికి బాధ్యుడిని చేయలేం. వైద్యుడి నిర్లక్ష్యాన్ని నిరూపించేలా ఆధారాలు ఉండాలి. కేవలం సరైన చికిత్స ఇవ్వలేదనడం, చికిత్సకు సంబంధించి వైద్యుడి నిర్ణయ లోపం వంటివి వైద్య నిర్లక్ష్యాన్ని నిరూపించేందుకు ఆధారాలుగా సరిపోవు. సర్జరీకి, చికిత్సకు సానుకూలంగా స్పందించలేదనో, సర్జరీ విఫలమైందనో వైద్యుడిని నేరుగా బాధ్యుడిని చేయలేం. సర్జరీ, చికిత్స తీసుకున్న ప్రతి కేసులో రోగి పరిస్థితి అతడి సంతృప్తి స్థాయిలో మెరుగవ్వాలని లేదు' అని కోర్టు స్పష్టం చేసింది. వైద్యుడి నిర్లక్ష్యానికి సరైన ఆధారాలు చూపలేదని పేర్కొంటూ ఎన్సీడీఆర్సీ ఆదేశాలను కోర్టు కొట్టివేసింది.

ఆప్ వల్లే అన్నదాతల ఆందోళన

కేంద్ర మంత్రి

చండీగఢ్: అన్నదాతల ఆందోళనకు అధికారంలో ఉన్న ఆప్ ప్రభుత్వమే కారణమని కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ అన్నారు. రైతుల సమస్యలు పరిష్కారం కాకపోవడానికి సీఎం భగవంత్ మాన్ రాజీనామాను సాకుగా చూపారు. ఆయన రాజీనామా చేస్తే రైతుల సమస్యలు రెండు రోజుల్లో పరిష్కారమవుతాయని అన్నారు. ఏఎన్ఐతో కేంద్ర మంత్రి మాట్లాడుతూ... సమస్య రైతులు లేదా కేంద్ర ప్రభుత్వం నుంచి కాదని అన్నారు. ఆప్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రైతుల సమస్యను సృష్టించిందని ధ్వజమెత్తారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు పంటలు సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు నెలల కిందటే రూ.44 వేల కోట్లు విడుదల చేసిందని బిట్టూ తెలిపారు. అయితే పంజాబ్‌కు శత్రువులైన అరవింద్ కేజ్రీవాల్, రాఘవ్ చద్దా అక్కడ పట్టు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. పంటలు సేకరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేయడం లేదని మండి పడ్డారు. 'గవర్నర్‌ను కలుస్తాం. ముఖ్యమంత్రి రాజీనామా చేస్తే, ఈ సమస్య రెండు రోజుల్లో పరిష్కారమ వుతుంది' అని అన్నారు. మరోవైపు సకాలంలో వరి సేకరణతో సహా పలు డిమాండ్ల కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తమ నిరసనలు కొనసాగుతాయని పంజాబ్ రైతులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సంగ్రూర్, భటిండా, మోగా, బటాలా, ఫగ్వారాలో రోడ్ల దిగ్బంధం నిర్వహిస్తామని చెప్పారు. పంట వ్యర్థాలు తగులబెట్టిన రైతులపై పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తామన్నారు. రోడ్ల దిగ్బంధం వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఉండేం దుకు పంజాబ్, కేంద్ర ప్రభుత్వాలు పరిష్కారాన్ని కనుగొని సమస్యను సకాలంలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వయనాడ్ బాధితులకు సాయమేది?

- లోక్‌సభ ఉప ఎన్నికల్లో పునరావాసమే ప్రధానాంశం
- కేంద్రం స్పందించకపోవడాన్ని నిలదీసిన సీపీఐ అభ్యర్థి
- నిరసనలతో సమస్యల వినతికి బాధితులు సన్నద్ధం

వయనాడ్ (కేరళ) : వయనాడ్‌లో వచ్చే నెల లోక్‌సభ ఉప ఎన్నికలకు ముందు జులై 30న కొండచరియలు విరిగిపడటంతో ప్రాణాలతో బయటపడిన వారికి పునరావాసం కల్పించే విషయం ప్రధానాంశంగా మారింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందకపోవడంపై అధికార ఎల్‌డీఎఫ్ నాయకులు నిలదీస్తున్నారు. బాధిత కుటుంబాలకు ప్రతిస్పందనగా కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్, సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ఈ విషయాన్ని లేవనెత్తాయి. ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, ఘోరమైన విపత్తులో 231 మంది ప్రాణాలు కోల్పోగా, 47 మంది గల్లంతయ్యారు. వయనాడ్ నియోజకవర్గానికి నవంబరు 13న ఉప ఎన్నిక జరగనుంది. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి కూడా విజయం సాధించడంతో స్థానిక ఎంపీ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వయనాడ్ స్థానానికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. పునరావాసం కోసం భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని స్థానిక నివాసితులు డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే ఎస్టేట్ యజమానులు కేరళ హైకోర్టులో దీనిని సవాలు చేయడంతో ఆలస్యం అయింది. విపత్తు నిర్వహణ చట్టం ప్రకారం కొత్త టౌన్‌షిప్‌ల కోసం ఉద్దేశించిన భూమిలో నెడుంబలలోని హారిసన్ మలయాళం ఎస్టేట్, మెప్పాడి గ్రామ పంచాయతీ, కల్పేటలోని ఎల్‌స్టన్ ఎస్టేట్ ఉన్నాయి. ఇవన్నీ గృహాలు కోల్పోయిన వారి కోసం కేటాయించారు. అంతేకాకుండా రుణమాఫీ, తక్షణ ఉపశమన సహాయం, స్థానభ్రంశం చెందిన, అద్దె నివాసాలలో నివసించే వారికి పెరిగిన అద్దె మద్దతు కోసం డిమాండ్లు నెరవేరలేదని వారు తెలిపారు. ఎల్‌డీఎఫ్ అభ్యర్థి సత్యన్ మొకేరి శనివారం కొండచరియలు విరిగిపడి ప్రాణాలు కోల్పోయి అద్దె ఇళ్లలో ఉంటున్న బాధిత ప్రజలను పరామర్శించారు. రాష్ట్రంలోని అధికార వామపక్ష ప్రభుత్వం చేస్తున్న పునరావాస ప్రయత్నాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. కొండ చరియలు విరిగిపడిన జిల్లా ప్రజల పునరావాసం కోసం బీజేపీ పాలిత కేంద్రం ప్రభుత్వం ఎటువంటి సహాయం అందించకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. యూడీఎఫ్ అభ్యర్థి అయిన కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ భావోద్వేగ బహిరంగ లేఖలో, తన సోదరుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో కలిసి చూరల్‌మల, ముండక్కై పర్యటనను గుర్తు చేసుకున్నారు. అసెంబ్లీలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టిన వయనాడ్‌లోని కల్పేట కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.సిద్దిఖీ మాట్లాడుతూ కొండచరియలు విరిగిపడిన వయనాడ్ ప్రజల సహాయానికి, పునరావాసం కోసం ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చినప్పటికీ ఒక్క పైసా కూడా కేంద్రం ఇవ్వలేదని అన్నారు. బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్ తెలిపిన వివరాల ప్రకారం... కొండచరియలు విరిగిపడిన వారిని ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఓదార్చారు. బాధితులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సహాయాన్ని కూడా కేరళ ప్రభుత్వం ఇంతవరకు అందించలేదని ఆమె ఆరోపించారు. పునరావాస ప్రయత్నాలకు సహాయం అందించడంలో కేంద్ర ప్రభుత్వ 'ప్రతికూల విధానం' పై కేరళ రెవెన్యూ మంత్రి కె.రాజన్ నిరాశ వ్యక్తం చేశారు. విపత్తు సంభవించి 100 రోజులు అవుతున్నాయని, ఇంకా ప్రత్యేక సహాయ ప్యాకేజీ కోసం ఎదురుచూస్తున్నామని ఆయన చెప్పారు. ఆదుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం విపత్తు నిర్వహణ చట్టం కింద కేంద్రానికి వినతి సమర్పించిద న్నారు. ఇదిలాఉండగా, రాజకీయ నిందలు, నాయకుల మద్దతు నడుమ ప్రాణాలతో బయటపడిన వారు తమ పునరావాసం విషయాన్ని అభ్యర్థులందరి దృష్టికి తీసుకువెళ్లేందుకు నిరసనలు చేయడానికి సిద్ధమవుతున్నారు. 'మా సమస్యలను రాజకీయ పార్టీల దృష్టికి తీసుకురావడానికి కల్పేట లేదా మెప్పాడిలో నిరాహార దీక్షలు చేపట్టనున్నామని, ప్రియాంకగాంధీ ప్రచార పర్యటనతో పాటు ఇది మరింత ప్రభావం చూపుతుందని భావిస్తున్నామని జనసభ కార్యాచరణ కమిటీ చైర్మన్ నసీర్ అలక్కల్ పీటీఐకి తెలిపారు. విధ్వంసకర కొండచరియలు విరిగిపడిన మెప్పాడి గ్రామ పంచాయతీలోని 10, 11, 12 వార్డుల నుంచి ప్రాణాలతో బయటపడిన వారికి కమిటీ ప్రాతినిధ్యం వహిస్తుంది. 'పరిస్థితి చాలా తీవ్రంగా ఉంది. ఈ మూడు వార్డులలో ప్రాణాలతో బయటపడిన వారికి ప్రభుత్వం రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు తక్షణ సహాయాన్ని ప్రకటించింది. కానీ 132 మందికి ఇంకా అందలేదు. ప్రభుత్వం గత మూడు నెలల నుంచి నెలవారీ అద్దెకు నిధులు మంజూరు చేస్తోంది. మొదట ఆరు నెలల పాటు హామీ ఇచ్చారు' అని తెలిపారు. 'అయితే ఈ లోపు పునరావాసం పూర్తయ్యే అవకాశం లేనందున ఆ తర్వాత అద్దె ఎవరు భరిస్తారు' అని ప్రస్తుతం తన కుటుంబంతో కల్పేటలో అద్దె ఇంట్లో ఉంటున్న నసీర్ ప్రశ్నించాడు. విపత్తులో మరణించిన వారి, గల్లంతయిన వారి అధికారిక జాబితాను విడుదల చేయడం మరో ప్రధాన డిమాండ్. అధికారిక రికార్డుల ప్రకారం 47 మంది ఆచూకీ తెలియడం లేదని, వారి బంధువులకు మరణ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని స్థానికులు అధికారులను వేడుకుంటున్నారు. విపత్తు తర్వాత ఒంటరిగా ఉన్న చూరల్‌మల ప్రాంతంలో ఇప్పటికీ నివసిస్తున్న వారికి తగిన చికిత్స సౌకర్యాలు కల్పించాలని బాధిత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. విపత్తు నుంచి ప్రాణాలతో బయటపడిన జేఎంజే మనోజ్ మాట్లాడుతూ ప్రభుత్వం నెలవారీ అద్దె సాయంగా రూ.6 వేలు అందజేస్తుండగా, ఎక్కువ అద్దెతో ఇళ్లలో నివసిస్తున్నందున చాలా కుటుంబాలకు మరింత అవసరమని సూచించారు. నెలవారీ అద్దె సహాయాన్ని రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నామని జనకీయ సమితి కన్వీనర్ మనోజ్ తెలిపారు. ప్రస్తుతం విపత్తు కారణంగా దాదాపు 800 మంది నిర్వాసిత కుటుంబాలు అద్దె ఇళ్లలో నివసిస్తున్నారు. కేరళ ప్రభుత్వం కేంద్ర సహాయంగా రూ.2 వేల కోట్లు కోరింది. అయితే రెండు విడతలుగా రూ.145.6 కోట్ల చొప్పున పంపిణీ చేయగా ఇప్పటి వరకు రూ.291.2 కోట్లు మాత్రమే వచ్చాయి. దాని పునరావాస ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాణాలతో బయటపడిన వారి కోసం ఒకటి లేదా రెండు టౌన్‌షిప్‌లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో దాదాపు 1,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒకే అంతస్తుల ఇళ్లు, భవిష్యత్‌లో రెండు అంతస్తులకు విస్తరించే అవకాశం ఉంది. జులై 30న సంభవించిన ఈ విపత్తు వయనాడ్‌లోని అట్టమాల డివిజన్‌లోని మూడు గ్రామాలయిన పుంఛిరిమట్టం, చూరల్‌మల, ముండక్కైలోని పెద్ద ప్రాంతాలను ధ్వంసం చేసింది.

డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన అవసరం

ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాలను నియంత్రించాలంటే... వాటిపై ప్రజలకు అవగాహన అవసరమని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. 'మన్ కీ బాత్' 115వ ఎపిసోడ్‌లో ఆయన ప్రసంగించారు. దేశప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. యానిమేషన్, గేమింగ్ పరిశ్రమలపై ప్రధాని ప్రశంసలు కురిపించారు. డిజిటల్ అరెస్టుల పేరుతో అమాయకుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న సైబర్ నేరస్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని సూచించారు. ఏ దర్యాప్తు సంస్థా ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా విచారణ చేపట్టదని ప్రధాని స్పష్టం చేశారు. కాబట్టి పోలీసుల పేరుతో డిజిటల్ నేరస్తులు చేస్తున్న సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. డిజిటల్ అరెస్టుల పేరుతో ఎవరైనా భయపెడితే నేషనల్ సైబర్ హెల్ప్ లైన్ 1930కు ఫోన్ చేయాలని కోరారు. సైబర్ క్రైమ్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. 'మళ్లీ చెబుతున్నాను. డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలో లేదు. ఇది ఒక మోసం, కపటం, అబద్ధం. నేరస్తులు చేసే పని. డిజిటల్ అరెస్టు పేరుతో జరిగే మోసాలను అరికట్టడానికి అన్ని దర్యాప్తు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నాయి. దర్యాప్తు సంస్థలు మోసగాళ్ల వేలాది వీడియో కాలింగ్ ఐడీలను బ్లాక్ చేశాయి. లక్షలాది సిమ్ కార్డులు, మొబైల్ ఫోన్లు, బ్యాంక్ ఖాతాలను బ్లాక్ చేశాయి. దర్యాప్తు సంస్థలు వాటి పని చేస్తున్నాయి. అయినప్పటికీ డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న మోసాల నుంచి మనల్ని మనం కాపాడుకోవడం అత్యావశ్యకం. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి. ప్రతి పౌరుడూ అప్రమత్తంగా ఉండాలి.' అన్నారు. కల్పనా శక్తితో కూడిన గాలి దేశవ్యాప్తంగా వీస్తున్నదని కొనియాడారు. యానిమేషన్ రంగంలో మేడ్ ఇన్ ఇండియా ప్రతిభ మెరుస్తోందన్నారు. చోటా భీమ్, కృష్ణ, మోటా పెట్ వంటి కార్టూన్ పాత్రలు బాగా పాపులర్ అయ్యాయని ప్రధాని గుర్తు చేశారు. భారతీయ గేమ్‌లకు ప్రాచుర్యం పెరుగుతోందన్నారు. అన్ని రంగాల్లో ఆత్మ నిర్భర్ భారత్ కనిపిస్తుందన్నారు. వర్చువల్ రియాలిటీ టూరిజం నేడు ప్రసిద్ధి చెందుతోందని తెలిపారు. అక్టోబర్ 28న 'వరల్డ్ యానిమేషన్ డే' జరుపుకోనున్నాం. భారత్‌ను గ్లోబల్ యానిమేషన్ పవర్ హౌస్‌గా మార్చడానికి సంకల్పించాలని ప్రధాని కోరారు. భారత్ 80 దేశాలకు రక్షణ ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు.

ఒడిశాలో 14 జిల్లాలో 'దానా' ప్రభావం

భువనేశ్వర్: దానా తుపాను కారణంగా ఒడిశాలో మొత్తం 14 జిల్లాల్లో వరదలు సంభవించాయని... 35.95 లక్షల మంది ప్రజలు ప్రభావితమయ్యారని ఆ రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ మంత్రి సురేశ్ పూజారి ఆదివారం తెలిపారు. కాగా 8,10,896 మందిని 6,210 తుపాను సహాయ కేంద్రాలకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాల్లో కేంద్రపారా, బాలాసోర్ మరియు భద్రక్ ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. అయితే ఎటువంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. నిరాశ్రయులు 1,178 తుఫాను సహాయ కేంద్రాలలో ఆశ్రయం పొందారని... వారికి ఆహారంతోపాటు ఇతర అవసరమైన వస్తువులను అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా విపత్తులో ఇళ్లు కోల్పోయిన వారికి పాలిథిన్ షీట్లు అందజేస్తున్నట్లు పూజారీ చెప్పారు. 14 జిల్లాల్లో విస్తరించి ఉన్న 108 బ్లాకుల పరిధిలోని 1,671 గ్రామ పంచాయతీల్లోని ప్రజలను దానా తుపాను ప్రభావితం చేసిందన్నారు. ప్రాథమిక నివేదికల ప్రకారం తుపాను, తదుపరి వరదల కారణంగా దాదాపు 5,840 ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. 'విపత్తు సంభవించినప్పుడల్లా, ప్రజలు తమ ఇళ్లను కోల్పోతారు. పరిహారం పొందుతారు. ఈసారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి దశలవారీగా వారికి పక్కా గృహాలు మంజూరు చేస్తాం' అని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని తుపాను, వరద పీడిత ప్రాంతాల్లో ఉన్న కచ్చా ఇళ్ల సర్వే చేపట్టాలని ఒడిశా ప్రభుత్వం యోచిస్తోంది. తుపాను కారణంగా భారీ పంట నష్టం జరిగిందని పూజారి చెప్పారు. నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం ఒడిశాకు వస్తుందన్నారు. తెలిపారు.

కార్పొరేట్ల ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగం

మహాయుతి సర్కార్‌పై కాంగ్రెస్ మండిపాటు

న్యూదిల్లీ: మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం రాష్ట్రప్రజల శ్రేయస్సు, పర్యావరణ పరిరక్షణను గాలికొదిలేసి కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. నవంబర్ 2023లో, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్)కి చెందిన ఒక ప్రధాన సలహాదారుని కేంద్రంలోని నిపుణుల అంచనాల కమిటీ (ఈఏసీ))లో నియమించారని... ఫలితంగా ఆ కమిటీ ఏజీఈఎల్ తయారు చేసిన జల విద్యుత్ ప్రాజెక్టు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిందని జైరాం పేర్కొన్నారు. ఆ వెంటనే, డిసెంబర్ 2023లో కొల్హాపూర్‌లోని 100 కంటే ఎక్కువ గ్రామాల నివాసితులు ఏజీఈఎల్‌కు చెందిన రూ. 7,000 కోట్ల పట్గావ్ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేశారని వెల్లడించారు. కొల్హాపూర్‌లో తక్కువ వర్షపాతం కారణంగా నీటి లభ్యత తక్కువగా ఉండడంతో కొత్త ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే అధ్వాన్నంగా మారుతున్న నీటి పరిస్థితిపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వడానికి ముందు ప్రజాభిప్రాయం కోసం ఎలాంటి గ్రామ సభలు నిర్వహించలేదని జైరాం రమేశ్ 'ఎక్స్'లో తెలిపారు. 'ఆందోళన కలిగించే విషయమేమిటంటే, పశ్చిమ కనుమలలోని పర్యావరణ సున్నిత ప్రాంతాలలో ఆమోదం పొందిన మూడు అదానీ ప్రాజెక్టులలో ఇది ఒకటి' అని చెప్పారు. సున్నిత ప్రాంతాల్లో ఈ "రెడ్ కేటగిరీ" ప్రాజెక్టులను అనుమతించడానికి పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారులు చట్టాన్ని 'ఎంపికగా అర్థం చేసుకున్నారు' అని మండిపడ్డారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అడవులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతుందని అదానీ సొంత పర్యావరణ అంచనాలే హెచ్చరించాయన్నారు. ఏదిఏమైనా ప్రాజెక్టులు మాత్రం ఆమోదం పొందాయని రమేశ్ పేర్కొన్నారు. మహాయుతి ప్రభుత్వం చట్టపరమైన ప్రక్రియలో అవకతవకలు చేయడం వల్ల స్థానిక ప్రజలు, స్థానిక పర్యావరణంపై తీవ్ర పడనుందని ఆయన అన్నారు. మహారాష్ట్ర ప్రజలు, పర్యావరణ పరిరక్షణకంటే కార్పొరేట్ ఆశ్రితుల ప్రయోజనాలు నెరవేర్చేందుకు అధికార దుర్వినియోగం చేస్తున్నారనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలని జైరాం రమేశ్ ప్రశ్నించారు.

ఉదయనిధి 'దీపావళి' శుభాకాంక్షలు

చెన్నై : డీఎంకే సంప్రదాయాల నుంచి అరుదైన చర్యగా... ఆ పార్టీ నాయకుడు, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ 'విశ్వాసం ఉన్నవారికి' దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్ష బీజేపీ నుంచి వ్యంగ్య స్పందన వచ్చింది. దీపావళి, వినాయక చవితి సహా హిందువుల పండుగల సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలపడం లేదని డీఎంకేను బీజేపీ లక్ష్యంగా చేసుకుంది. డీఎంకే దివంగత అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎం.కరుణానిధి సహా డీఎంకే నాయకులు తమ హేతువాద విశ్వాసాలకు అనుగుణంగా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు చెప్పలేదు. అయితే శనివారం ఇక్కడ జరిగిన ఒక పార్టీ కార్యక్రమంలో పార్టీ ప్లాటినం జూబ్లీ వేడుకల కోసం మద్దతుదారులకు తన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉదయనిధి కూడా 'దీపా ఒలి తిరునాళ్' కోసం ప్రజలను పలకరించడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది.

'మా (డీఎంకే) ప్లాటినమ్ జూబ్లీ వేడుకలకు నేను నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. విశ్వాసం, దానిని జరుపుకునే వారికి దీప ఒలి తిరునాళ్ శుభాకాంక్షలు' అని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలపై టీఎన్ బీజేపీ నేత నారాయణన్ తిరుపతి ఉదయనిధిపై మండిపడ్డారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' పై ఒక పోస్టులో, ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, 'నమ్మకం లేనివారికి, నరకాసురుడిలా జీవించడానికి శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. ఇదిలాఉండగా, తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవిపై ఉదయనిధి విమర్శల దాడి చేస్తూ, ఆయన 'ద్రవిడమ్' అనే పదం తనకు 'అలెర్జీ' అని, దాని పేరు తీసుకోకుండానే దాన్ని ముగించవచ్చని భావిస్తున్నాడని చెప్పారు. తమిళనాడు పేరు విషయంలో గవర్నర్‌కు కూడా సమస్య ఉందని ఆయన పేర్కొన్నారు.

చొరబాట్లు ఆగితేనే బెంగాల్‌లో శాంతి

హోంమంత్రి అమిత్‌షా

కోల్‌కతా: బంగ్లాదేశ్ నుంచి సరిహద్దు చొరబాట్లు ఆగినప్పుడే పశ్చిమ బెంగాల్‌లో శాంతి నెలకొంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. 2026లో పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే పొరుగు దేశం నుంచి అక్రమ వలసలను అరికడతామన్నారు. బెంగాల్‌లోని భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో పెట్రాపోల్ ల్యాండ్ పోర్ట్‌లో కొత్త ప్యాసింజర్ టెర్మినల్ భవనం, కార్గో గేట్ ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ... అవినీతి సమస్యపై టీఎంసీ ప్రభుత్వాన్ని నిందించారు. 2026లో రాజకీయ మార్పు తీసుకురావాలని రాష్ట్ర ప్రజలకు ఉద్బోధించారు. 'ఈ ప్రాంతంలో శాంతి నెలకొల్పడంలో, ల్యాండ్ పోర్ట్‌లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. సరిహద్దుల గుండా ప్రజల చట్టపరమైన కదలికలకు అవకాశం లేనప్పుడు చట్టవిరుద్ధ కదలికలు తలెత్తుతాయి. ఇది దేశ శాంతిని ప్రభావితం చేస్తుంది. 2026లో మార్పు తీసుకురావాలని నేను బెంగాల్ ప్రజలను కోరుతున్నాను. చొరబాట్లను ఆపివేస్తాం. శాంతి వస్తుంది" అని ఆయన అన్నారు. కాగా బీజేపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతూ... పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే తమ ముందున్న పెద్ద టార్గెట్ అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం చొరబాట్లను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. వీటిని తక్షణమే ఆపాలన్నారు. బెంగాల్‌లో మహిళలకు భద్రత లేదని చెప్పడానికి సందేశ్ ఖాలీ హింస, ఆర్జీ కర్ ఆస్పత్రి ఉదంతాలే నిదర్శనమని చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు అక్రమ వలసలు పెరగడం వల్ల దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోందని అమిత్ షా ఆందోళన వ్యక్తంచేశారు. అక్రమ చొరబాట్లను ఆపినప్పుడే పశ్చిమ బెంగాల్‌లో శాంతి నెలకొంటుందన్నారు.

బాంద్రా రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట

10 మందికి గాయాలు... ఇద్దరి పరిస్థితి విషమం

ముంబై : పండుగ వేళ విపరీతమైన రద్దీ కారణంగా ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆదివారం ముంబైలోని బాంద్రా రైల్వే స్టేషన్‌లో గోరఖ్‌పూర్‌కు వెళ్లే రైలు ఎక్కేందుకు తొందరపడి... తొక్కిసలాట జరిగి 10 మంది గాయపడ్డారని పౌర, విపత్తు నియంత్రణ అధికారులు తెలిపారు. మరోవైపు ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని పశ్చిమ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. రాబోయే దీపావళి, ఛత్ పండుగల దృష్ట్యా పెద్ద సంఖ్యలో ప్రజలు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు బాంద్రా టెర్మినస్‌కు చేరుకున్నారు. అక్కడ రైలు ప్లాట్‌ఫాం పైకి వస్తున్నప్పుడు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు అన్‌రిజర్వ్‌డ్ రైలు ఎక్కేందుకు పరుగులు తీసినట్లు వారు వివరించారు. తెల్లవారు జామున 2.45 గంటల సమయంలో 22921 బాంద్రా-గోరఖ్‌పూర్ అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ ఒకటో నంబరు ప్లాట్‌ఫాం పైకి వస్తున్నప్పుడు ఈ ఘటన జరిగింది. 'ఈ సమయంలో కొంతమంది ప్రయాణికులు ప్లాట్‌ఫాం పై నుంచి నడుస్తున్న రైలును ఎక్కేందుకు ప్రయత్నించారు. దీంతో ప్రమాదం సంభవించింది. ఇద్దరు ప్రయాణికులు కింద పడిపోవడంతో గాయపడ్డారు' అని పశ్చిమ రైల్వే ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. దీంతో విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, హోం గార్డులు వెంటనే స్పందించి గాయపడిన ప్రయాణికులను సమీపంలోని బాబా ప్రభుత్వాస్పత్రికి తరలించారు' అని ఆ ప్రకటన వివరించింది.

గాయపడిన ప్రయాణికుల ఆరోగ్యం పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు తెలిపింది. అయితే ముంబై విపత్తు నియంత్రణ విభాగం, ఒక పౌర అధికారి మాత్రం... అన్‌రిజర్వ్‌డ్ రైలు ఎక్కేందుకు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ప్రయత్నించినపుడు బాంద్రా రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 10 మంది గాయపడినట్లు వెల్లడించారు. వారిలో షాహనీ, నూర్ మహమ్మద్ షేక్ పరిస్థితి విషమంగా ఉందని, బాబా ప్రభుత్వాస్పత్రిలో వారికి చికిత్స కొనసాగుతున్నట్లు పోలీసు అధికారి ఒకరు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

దేశంలోనే అత్యుత్తమ బ్యాంక్ ఎస్‌బీఐ

న్యూదిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ అరుదైన ఘనత సాధించింది. దేశంలోనే అత్యుత్తమ బ్యాంక్‌గా నిలిచింది. అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ ఎస్‌బీఐను బెస్ట్ బ్యాంక్‌గా ఎంపిక చేసింది. వాషింగ్టన్‌లో జరిగిన ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు సమావేశంలో భాగంగా 31వ వార్షిక ఉత్తమ బ్యాంక్ అవార్డుల కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అసాధారణ సేవలు అందించి కస్టమర్ల నమ్మకాన్ని గెలుచుకోవడంలో తమ బ్యాంక్ ముందంజలో ఉందని ఎస్‌బీఐ పేర్కొంది. ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ఈ అవార్డును అందుకున్నారని బ్యాంక్ ఓ ప్రకటనలో తెలిపింది.

విశాలాంధ్ర హైదరాబాద్

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్‌కు సన్మానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాల మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుంబవన్‌లో హైదరాబాద్ పాత నగరానికి చెందిన మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రస్తుతం అడ్వకేట్స్‌గా పని చేస్తున్న ఏ.యాదగిరి, ఎస్.ఆర్.శ్రీనివాస్, బాలయ్య యాదవుల ఆధ్వర్యంలో ఎన్.బాల మల్లేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్.బాలమల్లేష్ ప్రసంగిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఉధృతమైన పోరాటాలను కొనసాగించాలని అన్నారు. మూసి సుందరీకరణ బ్యూటిషన్ పేరుతో పేద ప్రజల ఇండ్లను కూల్చివేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. పేదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూసీ నది ప్రాంతంలో కార్పొరేట్ సంస్థలు, మాల్స్ అక్రమంగా కబ్జాలు చేశారని, వాటిని కూల్చి వేయకుండా పేదల ఇండ్లను కూల్చివేయడం అన్యాయమని అన్నారు. పేదలకు ప్రత్యామ్నయం చూపకుండా ఇండ్లను కూల్చివేయడం మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్టోబర్ 28న బషీర్బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జనాభా లెక్కల్లో భాగంగా బీసీ కుల గణన చేపట్టాలని జరుగుతున్న సెమినార్‌లో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సెమినార్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, ఉస్మానియా ప్రొఫెసర్ ప్రభంజనం యాదవ్ తదితరులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్, సిపిఐ జిల్లా నాయకులు డి.జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వివాహానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు.

ఉపాధ్యాయ, ఉద్యోగులను నిరాశకు గురి చేసిన ప్రభుత్వం : ఎస్.టీ.యు.టీ.ఎస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పెండింగులో ఉన్న ఐదు డి.ఎ లలో రాష్ట్ర ప్రభుత్వం ఒకటి మాత్రమే విడుదల చేయడం పట్ల ఉపాధ్యాయ, ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారని ఎస్.టి.యు.టి.ఎస్. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.పర్వత్ రెడ్డి, జి. సదానందం గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆరు నెలలకు ఒక సారి కేంద్ర ప్రభుత్వం కరువు భత్యం (డి.ఎ) విడుదల చేస్తుందని, తదనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఐదు డి.ఎ లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం ఒకటి మాత్రమే విడుదల చేయడం సరి కాదని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులందరికి పెండింగ్‌లో ఉన్న అన్ని డి.ఎ లను తక్షణమే చెల్లిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని గత పది నెలలుగా ఉపాధ్యాయ, ఉద్యోగులు ఓపిక పట్టారని అన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల జెఏసితో సిఎం జరిపిన చర్చల అనంతరం కనీసం రెండు లేదా మూడు డి.ఎలు విడుదల చేస్తారని ఉపాధ్యాయ, ఉద్యోగులు భావించారు. మంత్రివర్గం నిర్ణయం కోసం ఆశగా ఎదురు చూశారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునః సమీక్షించి, వెంటనే మూడు పెండింగ్ డి.ఎలను విడుదల చేయాలని ఎస్.టి.యు.టి.ఎస్. డిమాండ్ చేస్తోంది.

లింగంపల్లి రైల్వే బ్రిడ్జి వరదనీటి

నాలా సమస్యపై జోనల్ కమిషనర్‌తో భేటీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : గత కొన్నేళ్లుగా వర్షం పడిన ప్రతిసారి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్న లింగంపల్లి రైల్వే బ్రిడ్జి వర్షపు నీటి నాలా సమస్యపై లింగంపల్లి కంటెస్టెడ్ కార్పొరేటర్ ఎల్లేష్, స్థానిక కాలనీ వాసులతో కలిసి వెళ్ళి జోనల్ కమిషనర్‌ని కలిశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అలాగే కాలనీ వాసుల నిర్ణయాలను పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలని కోరారు. నాలా విస్తరణ చేయకుండా డ్రెయిన్ మళ్లింపు పనుల వల్ల స్థానిక కాలనీ ప్రజలు ఇబ్బంది పడతారని సరైన ప్రణాళికతో పనులు చేపట్టాలన్నారు. జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి స్పందిస్తూ తప్పకుండా శాశ్వత పరిష్కారం దిశగా కాలనీ వాసుల నిర్ణయాలను పరిగణనలోకి తీసుకుని, ఈ పనులు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా రెడ్డి, సుదర్శన్‌రావు, రాజిరెడ్డి వెంకటేశ్వరరావు మొదలగు వారు పాల్గొన్నారు.

కంపెనీలు సామాజిక కర్తవ్యాన్ని నిర్వర్తించాలి

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : పలు కార్పొరేట్ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలతో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రజాభవన్‌లో ఆదివారం భేటి అయ్యారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కంపెనీలు తమ వంతు చేయూతనివ్వాలి విజ్ఞప్తి చేశారు. ఒక్కో కంపెనీ ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోవాలని సూచించారు. ఆదిలాబాద్, ములుగు వంటి అటవీ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని సూచించారు. కంపెనీలు పే బ్యాక్ టు సొసైటీ నినాదంతో తమ సామాజిక బాధ్యతను, కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరారు. ఒక లక్ష్యంతో సి ఎస్ ఆర్ నిధులను వెచ్చిస్తే మార్పు తధ్యమన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న అవకాశాలను, వనరులను, అవసరాలను కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలకు తెలియ చెప్పేందుకు వారితో కలిసి త్వరలో బస్సు యాత్ర చేపట్టనున్నట్టు మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, ములుగు, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు దివాకర్ టిఎస్, రాజర్షి షా, పలు కంపెనీలు ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం సమరానికి సిద్ధంకండి

మద్యం పాలసీ రద్దు చేయాలి : ఉస్తెల సృజన

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళల హక్కుల సాధనకై మహిళా లోకం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన పిలుపునిచ్చారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) మహబూబ్ నగర్ జిల్లా మహిళల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉస్తెల సృజన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతుందని అబ్బుర పడుతున్న నేటి సమాజంలో మహిళలపై వికృత రూపంతో కొత్త పుంతలు తొక్కుతూ మహిళల మన ప్రాణాలకు రక్షణ లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు అనుసరిస్తున్న మద్యం విధానంతో పచ్చని కుటుంబ వ్యవస్థ విధ్వంసం అవుతూ యువతను చెడు వ్యసనాలకు ప్రేరేపితం అవుతున్నారని అన్నారు. మహిళలపై రోజురోజుకు హింస దాడులు అత్యాచారాలు లైంగిక వేధింపులు పెరిగిపోతున్నాయని మహిళల మాన ప్రాణాల రక్షణకు ఎన్ని చట్టాలు వచ్చినా స్త్రీలపై అఘాయిత్యాల పరంపర ఆగడం లేదని అన్నారు. మహిళ కుటుంబంలో సమాజంలో రాజకీయ పాలన రంగాల్లో తీవ్రమైన వివక్షకు గురవుతుందని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్స్ అంశం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే ఉపయోగపడుతుందని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు మహిళా లోకానికి ఇచ్చిన వాగ్దానాలను అన్నిటిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్ఎఫ్ఐడబ్ల్యు నూతన జిల్లా కమిటీ ఎన్నిక

భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన నేతృత్వంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షురాలుగా జి.భార్గవి, ప్రధాన కార్యదర్శి కొండికంటి పద్మావతి, ఉపాధ్యక్షురాలుగా ఇందిరా, సహాయ కార్యదర్శిగా సత్యమ్మ, కోశాధికారిగా కృష్ణవేణి, కార్యవర్గ సభ్యులుగా కోట శ్రీలత,మాధవి, కమిటీ సభ్యులుగా జ్యోతి ఎం పద్మలతో పాటు మరో పదకొండు మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ ఎన్ఎఫ్ఐ డబ్ల్యు రాష్ట్ర నాయకురాలు ఇందిరా, జిల్లా నాయకులు కొండి కంటి పద్మావతి, గాయని కే.శ్యామల,సుగుణ,శశికళ, లక్ష్మి, గీతమ్మ, రాధ, అరుణ, శేషికళ, జాహిదబేగం, వెంకటమ్మ, శిరీష, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంలోని పీర్లమసీద్ కాలనీలోని మహబూబ్ సుభానీ చిల్లా వద్ద ఆదివారం గ్యార్మీ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక గులామ్ మునఫా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు పట్టణ ముస్లింలు యువకులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహబూబ్ సుభానీ దర్గా వద్దనుండి జెండాతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో గ్యార్మీ జెండాను ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు, సలామ్, దువా మతగురువు మౌలానా వాహెద్ ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం అంజుమన్ గులాయే ముస్తఫా ఆధ్వర్యంలో ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జామియా మజీద్ అధ్యక్షులు మహమ్మద్ మాసూమ్, రజాక్, ఖాదర్, అజీమ్, కలీం, ఇమ్రాన్, అంజుమనే గులామే ముస్తఫా కమిటీ సభ్యులు అక్రమ్, అక్సిర్, బాబా, అజహర్, అబ్బాస్, ఆరిఫ్, అమీర్ పాషా, అసద్, అంజద్, సోహెబ్, గౌస్, రావుఫ్, గౌస్ బాషా, ముధసిర్, ముజంమిల్, ఆబేద్, ముబాషిర్, తదితరులు ఉన్నారు.

ఆంధ్రనాట్య అభివృద్ధికి పద్మ మోహన్ కృషి అభినందనీయం

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ఆంధ్ర అన్న పదం ఆంధ్రనాట్యంలో ఉండడంతో మరల ఆదరణ కోల్పోతున్న సమయంలో ప్రముఖ ఆంధ్రనాట్య కళాకారిణి దెందులూరి పద్మ మోహన్ (స్వర నర్తన) అనే సంస్థను స్థాపించి ప్రత్యేకంగా ఆంధ్రనాట్య అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని కళాకారులను ప్రోత్సహిస్తూ ఎన్నో నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత గురు కళా కృష్ణ కొనియాడారు. శనివారం తెలుగు యూనివర్సిటీలో ఆంధ్ర నాట్య సంగమం నృత్య పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత గురు కళా కృష్ణ, ఉమామహేశ్వరి దంపతులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారుల కుంభహారతి ప్రదర్శన వీక్షకులను మైమరిపింపజేసింది. ఈ సందర్భంగా పద్మా మోహన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 70 మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో ఆనందంగా ఉందని మళ్లీ ఆంధ్రానాట్యనికి మంచి గుర్తింపు లభిస్తుంది ఆశ కనపడుతోందని పేర్కొన్నారు. నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు మెమొంటో సర్టిఫికెట్లను అతిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు నవతా, సునీలా, స్రవంతి, సంధ్యా, పవన్ కుమార్, ధర్మ, కల్పనా, సాయినాథ్‌లు పాల్గొన్నారు.

దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మన్నెబోయిన

విశాలాంధ్ర - : హైదరాబాద్‌లో ఏకేవై ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఐపీఎస్ రాహుల్ హెడ్గేని తెలంగాణ యాదవ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షుడు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మన్నెబోయిన కృష్ణ యాదవ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఉన్న యాదవులందరికీ రాబోయే దీపావళి, సదర్ సమ్మేళనం శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్టీఐ కమిషనర్లను వెంటనే నియమించాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : దేశంలో అవినీతి అంతం కావాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలనీ సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో సమాచార హక్కు చట్టం-2005 అక్టోబర్ 12 న అమలోకి వచ్చిన రోజు సందర్భంగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు ఆధ్వర్యంలో నిర్వహించగా. ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, అవగాహన సదస్సుకు స.హ చట్టం పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆర్టిఐ కమిషనర్ ఆఫీస్‌లో కమిషనర్‌లు లేక వేల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయన్నారు. కావున ప్రభుత్వం వెంటనే ఆర్టిఐ కమిషనర్లను నియమించాలని అన్నారు. స.హ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆవిర్భావ దినోత్సవాలను అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఆర్టీఐ కమిషనర్లను వెంటనే నియమించకపోతే సెక్రటేరియేట్ ను వేలాదిమంది ఆర్టిఐ కార్యకర్తలతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రజల చేత ఎన్నుకోబడ్డ నాయకులను సమాచార చట్టం క్రిందికి తీసుకురావాలన్నారు.

ఈ సదస్సులో రాష్ట్ర అధ్యక్షులు ఎలిగేండ్ల వెంకటేష్, తెలుగు సినిమా హీరో కిరణ్, ఫిలిం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జివిఆర్, బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు చింతల రాఘవేందర్ ముదిరాజ్, గంగా ప్రియ రెడ్డి, ఎడ్ల అనిత రెడ్డి, ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర యూత్ అధ్యక్షులు పడిగే ప్రశాంత్, సిరిసిల్లా జిల్లా అధ్యక్షులు గౌరవేని సుమన్, గాజుల వినయ్ కుమార్, గుండెల భాను ప్రసాద్, రాసునూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ఏర్పాటుతో

సేవలకు స్వస్తి..!

ప్రత్యేక నిపుణుల కొరత

అందుబాటులో ఉండని ఉన్నతాధికారులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరిలో మెడికల్ కళాశాల ఏర్పాటు అయిన నాటి నుండి రోగులకు సేవలకు స్వస్తి పలికినట్లు అయిందని, ప్రత్యేక నిపుణుల కొరతతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. మల్కాజిగిరిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కాస్తా ప్రభుత్వ జనరల్ ఆసుత్రి, మెడికల్ కళాశాలగా రూపాంతరం చెందింది. దీనిలో వైద్య విధాన పరిషత్ క్రింద పనిచేయాల్సిన డాక్టర్‌లను మొత్తం జిల్లాలోని ఇతర ఆసుపత్రులకు పంపిస్తూ మెడికల్ కళాశాల సిబ్బందే ఇక్కడ ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. అయితే ఇక్కడ గతంలో ఉన్న సేవల ఏవి కూడ అందని పరిస్థితి దాపురించిందని పలువురు పేర్కొంటున్నారు. మెడికల్ కళాశాలకు సంబంధించిన ఉన్నతాధికారులు ఎవరు అందుబాటులో ఉండని పరిస్థితి నెలకొంటుంది. అన్ని రకాల జబ్బులకు ప్రత్యేక నిపుణులు గతంలో ఉన్నప్పటికి మెడికల్ కళాశాల ఏర్పాటు అయిన తరువాత ప్రత్యేక నిపులు ఎవరు రోగులకు అందుబాటులో ఉండని పరిస్థితి నెలకొందని ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. మెడికల్ కళాశాలలో పని చేసే అధికారులలో జవాబుతనం లేకుండా పోతోంది. ఇక్కడ పని చేసే సూపరింటెండెంట్ ఎప్పుడు ఎక్కడ ఉంటారో క్రింది స్థాయి సిబ్బందికి కనీసం ఆర్ఎంఓ కూడ తెలియ పరిస్థితి ఉందంటే అధికారుల పని తీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రోగుల పరిస్థితులపై దృష్టి సారించాల్సిన సూపరింటెండెంట్ అడ్రస్సె ఉండకపోవడం గమనార్హం.

అత్యవసర పరిస్థితిలో ఇక్కడికి వచ్చే రోగులను, గర్భిణీలను ఇక్కడ చేర్పించుకోకుండా గాంధీ ఆసుపత్రికి పంపించడం పరిపాటిగా మారిందని, గతంలో ఈ పరిస్థితి లేకుండేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు రోగుల పట్ల కనీస కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. వైద్య విద్యను బోధించే అద్యాపకులు మరి విద్యార్ధులకు ఏ విధమైన విద్యాబోధనలు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాలగా మారిన తరువాత సిబ్బంది సమయపాలన అంతంత మాత్రంగానే ఉందని 10-30, 11 గంటలకు విధులకు రావడం, మధ్యాహ్నం ఒంటి గంట లోపు వెళ్ళిపోవడం జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై దృష్టి సారించాల్సిన ఉన్నతాధికారులు అంతంత మాత్రంగానే వ్యవహరిస్తూ రోగులకు అందించాల్సిన సేవలకు స్వస్తి పలుకుతున్నారనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాల ఉన్నతాధికారులు రోగులకు అందాల్సిన సేవలపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థులకు రోగుల పట్ల వ్యవహరించే తీరును నేర్పించాలని, దీనిపై మెడికల్ విద్య ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఫీజు బకాయిల విడుదల చేసే వరకు పోరాటాలు ఆగవు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థుల చదువులు కొనసాగేది ఎట్లా అని గతంలో ఫీజు బకాయిలపై ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు నేడు చేస్తున్న వాటికి ఎటువంటి పొంతన లేదని, సమస్యల పరిష్కారంలో జరుగుతున్న జాప్యం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి భవిష్యత్తుతో ఆటలాడకూడదని, వారిపట్ల వివక్ష చూపకుండా తక్షణమే విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలనీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్, హిమాయత్ నగర్ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్న చందంగా తయారయ్యిందని, గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ పాలనలో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టించింది. విద్యార్థుల సమస్యల పరిష్కారం చేయడంలో వైఫల్యం చెందిన విషయాలను కాంగ్రెస్ పార్టీ ఆసరాగా తీసుకొని ఎన్నికల సమయంలో మరియు వివిధ సందర్భాల్లో మేము అధికారంలోకి వస్తే సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తాం అని కాంగ్రెస్ నాయకులు చెప్పడం జరిగింది. విద్యార్థి, యువత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తీవ్రమైన కృషి చేసారు. విద్యాశాఖ కూడా ముఖ్యమంత్రి దగ్గరే పెట్టుకున్నాడు. కానీ అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తి అవుతున్న కూడా విద్యారంగంలో ఉన్న సమస్యలపై ఇంతవరకు ఒక్క సమీక్ష సమావేశం కూడా నిర్వహించని పరిస్థితిలో ఉన్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్న అధికారుల్లో చలనం కూడా లేదని, సాంఘిక, సంక్షేమ హాస్టల్లో ఉన్న సమస్యలు పరిష్కారం చూపకపోవడం, నాణ్యతతో కూడిన భోజనం పెట్టకపోవడంతో అనేక మంది విద్యార్థులు అనారోగ్యబారిన పడటం, ఇవన్ని సమస్యలు పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు 7,800 కోట్లు బకాయిలు మూడు సంవత్సరాలుగా విడుదల చేయకపోవడంతో దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. తమ కోర్సులు పూర్తి అయినా కూడా కళాశాల యాజమాన్యాలు తమ ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో వారు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. కావున రేవంత్ రెడ్డి తక్షణమే విద్యారంగం సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కారం చేయాలని తెలియజేయడం జరిగింది. లేని పక్షంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటాలు కొనసాగిస్తామని తెలియజేయడం జరిగింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటికాల రామక్రిష్ణ, బానోత్ రాఘురాం, గ్యార నరేష్, నాగ జ్యోతి, లెనిన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మర్రి కుమార్తె వివాహానికి హాజరైన ప్రముఖులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి కుమార్తె అను శ్రేయా ఆదిత్యల వివాహం శంషాబాద్‌లోని జిఎంఆర్ అలెనలో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ మంత్రులు మల్లా రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్వర్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి దంపతులు, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యేలు సునీత లక్ష్మా రెడ్డి, మాధవరం కృష్ణా రావు, కే.పి. వివేకానంద గౌడ్, లక్ష్మా రెడ్డి, సుధీర్ రెడ్డి , కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, మాగంటి గోపీ నాథ్, వెన్నెం శ్రీనివాస్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రాజ్ గోపాల్ రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకట స్వామి, ముఖ్యమంత్రి సలహాదారులు నరేందర్ రెడ్డి, పార్కమెంట్ సభ్యులు చామల కిరణ్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీలు శంబీపూర్‌రాజు, నవీన్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

మూసీ పునరుజ్జీవనం ఎవరికోసం

విశాలాంధ్ర - కాప్రా : గతంలోనే రూ. 3800 కోట్ల ఖర్చుతో ఎస్టీపీలను నిర్మించాలని మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ పునరుజ్జీవనాన్నిఎవరి కోసం చేస్తుందో చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఎప్పుడో మూసీ ప్రక్షాళన మొదలు పెట్టారని, సుమారు రూ.3800 కోట్లు ఖర్చు చేసి ఎస్టీపీలను నిర్మించారని కేటీఆర్ అన్నారు. మూసీపేరు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీ చేస్తుందని ఆయన ఆరోపించారు. నాచారంలోని ఎస్టీపీని బీఆర్ఎస్ నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసి న సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎస్టీపీల వల్లనే మురుగు నీరు శుద్ధి జరుగుతుందన్నారు. మురికి కూపంలా ఉన్న మూసి నీ స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం సుందరీకరణ చేపట్టింది అన్నారు. ఎస్టీపీలను సక్రమంగా నడిపితే నల్లగొండ జిల్లాకు పరిశుభ్రమైన నీరు వెళ్తుంది.వంద శాతం మురుగునీటిని శుద్ధి చేసిన నగరంగా హైదరాబాద్ నిలిచిందన్నారు. దీనికి 2023లోనే రూ. 1100 కోట్లతో మూసీ అనుసంధాన ప నులు చేపట్టినట్టుగా చెప్పారు. ఇక ఎస్టీపీలు, బ్రిడ్జిలు, గోదావరి అనుసంధానంతో మూసీకి పునరుజ్జీవం పోసిందే బీఆర్ఎస్ అని మరోసా రి స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలోనే రూ.4 వేల కోట్లను కేటాయించామన్నారు. అందుకు తగిన నులు ఎప్పుడో మొదలుపెట్టారని, కాంగ్రెస్ వారు ఇప్పుడు కొత్తగా చేయాల్సిందేమీ లేదన్నారు. రుణమాఫీకి, రైతు బంధుకు ప్రభుత్వం వద్ద పైసలు లేవన్నారు. ఒక్క రుణమాఫీకే కాదు, ఏ పథకం అమలు చేయాలన్నా పైసలు లేవని మంత్రులు అంటున్నారన్నారు. మూసీ పేరు చెప్పి ప్రభుత్వం దోచుకుంటోందన్నారు. మూసీ బ్యూటీఫికేషన్కు తాము వ్యతిరేకం కాదని, లూటీఫికేషన్కు మాత్రమే వ్యతిరేకమని, ఇక్కడి నిర్వాసితుకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అంగగా ఉంటుందన్నారు.

తుర్కయంజాల్‌లో అక్రమ నిర్మాణాలు

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ షెడ్‌ల నిర్మాణాలు విచ్చలవిడిగా చేపడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు ఉపేక్షించేది లేదని చెప్పే కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారుల కళ్ళ ముందే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా నిర్మాణదారులకు తలొగ్గి చర్యలు తీసుకోలేని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో ఇంజాపూర్ గ్రామం నుండి హయత్ నగర్ వెళ్లే రహదారిలో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్‌ను నిర్మిస్తున్నారు. షెడ్ నిర్మాణాలకు హెచ్ఎండిఏ, మున్సిపల్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అక్రమ నిర్మాణదారులు హెచ్ఎండిఏ అనుమతుల కోసం లక్షల రూపాయలు చెల్లించాల్సి వస్తుందనీ టౌన్ ప్లానింగ్ అధికారులను మేనేజ్ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. అధికారులకు అక్రమ నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు అందినా, అధికారులు మాత్రం తూ.. తూ.. మంత్రంగా నోటీసులు ఇచ్చి అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోయి యదేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు అధికారులు తీసుకొని మున్సిపాలిటీకి ఆదాయాన్ని పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నత విద్యతోనే అభివృద్ధి

విశాలాంధ్ర - పటాన్ చెరువు : సమాజంలో యాదవులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడానికి ఉన్నత విద్య ఒక్కటే మార్గమని యాదవ యువతి యువకులందరూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సక్రమంగా వినియోగించుకుని యువతి యువకులందరూ అన్ని రంగాలలో రాణించడానికి కృషి చేయాలని అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్రం యోజన విభాగం ప్రధాన కార్యదర్శి యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో రాజ్యసభ సభ్యులు మందాడి అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సదర్ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదర్ సమ్మేళనానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు ఈ సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రాజ బోయిన సంతోష్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రతి సంవత్సరం దీపావళి దీపావళి పండుగా పురస్కరించుకొని యాదవులు తమ వృత్తి ధర్మాన్ని కాపాడుకునేందుకు గోవులను గేదెలను దున్నపోతులను ప్రత్యేకంగా అలంకరించి పూజిస్తారని అన్నారు. దేశంలో ఎక్కడ ఉన్న సరే దీపావళి సదరసమ్మేళనానికి ప్రతి యాదవులు తమ ఇళ్లకు చేరుకొని తాము పెంచుకున్న దున్నపోతులను అందంగా అలంకరించి సదర్ సమ్మేళనానికి ముస్తాబు చేసుకుని పరిశ్రమకు ఆద్యులైన దున్నపోతులను పూజించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయమని పేర్కొన్నారు. దీపావళికి మూడు రోజుల ముందే రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ కీలక నేత మందాడి అనిల్ కుమార్ యాదవ్ నేతృత్వంలో నగరంలో సుమారు 15 వేల మంది యాదవులతో సదర్ సమ్మేళనాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం సంతోషిదాయకమని స్పష్టం చేశారు. యాదవులలో పేదవారుగా ఉన్న వారందరినీ అఖిల భారత యాదవ మహాసభ గుర్తించి అలాంటి యువతీ యువకులకు ఉన్నత చదువులు చదువుకునేందుకు తగిన సహాయ సహకారాలు అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు నిర్వహిస్తున్నామని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను అన్నింటిని యాదవ యువతి యువకులు అందిపుచ్చుకునేందుకు అఖిల భారత యాదవ మహాసభ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి యువతీ యువకులను చైతన్యం చేసేందుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. పటాన్ చేరు యాదవ సంఘం నాయకులు దండు రాజు యాదవ్, దండు సురేష్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, రాజబోయిన చరణ్ యాదవ్ పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో పోలీసుల సైకిల్ ర్యాలీ

విశాలాంధ్ర - జవహర్‌నగర్ : రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జవహర్ నగర్ పోలీసుల ఆధ్వర్యంలో, పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుండి ఫైరింగ్ కట్ట వరకు పెద్ద ఎత్తున సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమరవీరులకు నివాళులర్పించి జోహార్లు లంటూ ర్యాలీని కొనసాగించారు. జవహర్ నగర్ సీఐ సైదయ్య మాట్లాడుతూ రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరులు వారి సేవలను స్మరించుకుంటూ అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని పోలీస్ అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ ఈ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. వరుసగా మూడు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్ : భారతీయ జనతా పార్టీతోనే రామరాజ్యం సిద్ధిస్తుందని తెలంగాణలో రాబోయే కాలంలో బిజెపి క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని బిజెపి రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్ గుప్తా, లీగల్ సెల్ నాయకులు చెంది మహేందర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఆదివారం సాయంత్రం బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా ప్రజలు కోరుకుంటున్నారని ఇది ఎంతో శుభసూచకమని వారు పేర్కొన్నారు. కాసోజు శివ, వసంతరావు, సందీప్ పద్మ కృష్ణయ్య గట్టోజి విజయ్ సాయిరాం పాల్గొన్నారు.

బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన నడక

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : అక్టోబర్ మాసాన్ని ప్రపంచ రొమ్ము క్యాన్సర్ మాసంగా ప్రపంచ వ్యాప్తంగా పాటిస్తారు. రొమ్ము క్యాన్సర్ పై ప్రజలలో పెద్ద ఎత్తున్న అవగాహన కలిపించడమే ప్రధాన లక్ష్యంగా సంస్థలు పలు కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ కోవలోనే బసవతారకం ఇండో అమెరికన క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చి ఇన్సిస్టిట్యూట్, ఆదివారం ఉదయం బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగ జెయస్ ఆర్ ప్రసాద్, ట్రస్టు బోర్డు సభ్యులు, విశిష్ట అతిథులుగా సినీ తారలు కుమారి సంయుక్త మీనన్, కుమారి మీనాక్షి చౌదరి లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా హాస్పిటల్ ఆవరణలో ఉన్న స్వర్గీయ నందమూరి బసవతారకం, స్వర్గీయ నందమూరి తారక రామారావుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కుమారి సంయుక్త మీనన్ మాట్లాడుతూ క్యాన్సర్ తో పోరాడడం అంత సులభం కాదన్నారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక వైద్యం కారణంగా చికిత్స అందుబాటులోనికి వచ్చిందని చెప్పారు. కుమారి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ తన తండ్రి క్యాన్సర్‌తో భాదపడి ఎలా మరణించారో స్వయంగా చూశానని అందుకే వ్యాధి వచ్చిన పోరాడడం కన్నా రాకుండా చూసుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. క్రమం తప్పకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం ముఖ్యంగా ఒక వయస్సు తర్వాత ఇలాంటి జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వ్యాధి వచ్చిన తర్వాత మనోధైర్యంతో ఎదుర్కోవడం కూడా ఎంతో అవసరమని చెప్పారు. అనంతరం ఇరువురూ సినీ తారలు రొమ్ము క్యాన్సర్ అవగాహన నడకను జెండా ఊపి ప్రారంభించారు. పలు సాఫ్ట్ వేర్ కంపెనీల నుండి వచ్చిన వాలంటీర్లు, హాస్పిటల్‌కు చెందిన వైద్యులు, సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ నడక, హాస్పిటల్ నుండి జూబ్లీ హిల్స్ చెక్ పోస్టు వరకూ సాగి చివరకు హాస్పిటల్ ప్రాంగణంలో ముగిసింది. బ్రెస్ట్ క్యాన్సర్ పై అవగాహన కల్పించే పలు పోస్టర్లు, బ్యానర్లను ప్రదర్శిస్తూ అవగాహన కలిపించే నినాదాలు చేస్తూ నడకను కొనసాగించారు.

క్యాంపు కార్యాలయానికి నిరంతరం తాళాలు

ఖానాపూర్ పట్టణంపై సవతి తల్లి ప్రేమ

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ నియోజకవర్గానికి రాజ సింహాసనంగా పిలవబడే రాజ్మాల్ క్యాంపు కార్యాలయానికి నిరంతరం తాళాలు వేసి ఉంటోంది. ఎప్పుడో ఒకప్పుడు ప్రముఖ నాయకుల మీటింగ్‌లు ఉంటే తప్ప ఈ గేట్లు తెరుచుకోవడం లేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అంటేనే అడవి తల్లి బిడ్డలు, ఆదివాసులు నివసించే జిల్లాగా ఆదివాసులు ఎక్కువ శాతం నివసించే జిల్లా. అదిలాబాద్ జిల్లాలోని ఆదివాసులు వారి జీవన గమనం అడవిలోనే కొనసాగుతుంది. గత దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉమ్మడి అదిలాబాద్ జిల్లాగా ఉన్నప్పుడు ఆదివాసీలు ఎక్కువగా ఉన్న గ్రామాలు, పట్టణాలను పరిగణలోకి తీసుకోని నియోజకవర్గం అప్పటి తెలుగుదేశం పార్టీ హయాంలో అభివృద్ధి కోసం అడుగులు వేయాలి అని రిజర్వేషన్ కల్పించి ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశబ్ద కాలం పూర్తి అవుతున్న సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తూ ఏర్పాటు జరిగినా జిల్లాల పరిగణలో ఖానాపూర్ నియోజకవర్గం మూడు జిల్లాల్లో విస్తరించి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వ ఆదాయంతో క్యాంపు కార్యాలయాలు నిర్మించి ప్రతి నియోజకవర్గానికి రాజభవన్‌ల ఏర్పాటు చేసింది.

గత ప్రభుత్వ పాలనలో ఇట్టి ఖానాపూర్ క్యాంపు కార్యాలయం ప్రస్తుత ఎమ్మెల్యే నియోజకవర్గ రాజ్‌భవన్‌లో ఉండలేకపోతున్నారు. ఖానాపూర్ పై సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారు. ఖానాపూర్ క్యాంపు కార్యాలయానికి నిరంతరం తలలు వేసి ఉంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. పొత్తుల రాష్ట్రం నుంచి విముక్తి కలిగిన నియోజకవర్గానికి అదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల ఈ మూడు జిల్లాల పొత్తుల నియోజకవర్గమైన ఖానాపూర్ పట్టణానికి రిజర్వేషన్ కాకుండా జనరల్ ఎలక్షన్ మోక్షం ఎప్పుడు అని ఎదురుచూపులతో రిజర్వేషన్ ఎత్తివేయబడుతూ జనరల్ నియోజకవర్గం ఏర్పడే వరకు ఏ పార్టీ అధినేతలు గెలుస్తూ పదవులు అధిరోహించినా చవతి తల్లి ప్రేమ తప్పదు అంటూ ఖానాపూర్ పట్టణవాసులు వాపోతున్నారు.

కార్పొరేటర్ గుర్రాల రమ వెంకటేష్ యాదవ్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర - మేడిపల్లి : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమ వెంకటేష్ యాదవ్ చేసిన సేవలకు గాను జ్యోతి నగర్ కాలనీ వాసులు అధివారం వారిని ఘనంగా సన్మానించారు. కాలనీ వాసులు ఒక్కొక్కరుగా మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి జ్యోతి నగర్ కాలనీలో ప్రతి సమస్యను తన సొంత సమస్యగా భావించి తీర్చారు అని అన్నారు అదేవిధంగా కాలనీలో ప్రధాన సమస్యలైనా డ్రైనేజీ సమస్య,మంచినీటి సమస్య, రోడ్డు సమస్యలు, కరెంటు స్తంభాల సమస్యలు, కరెంటు త్రీఫేస్ మరియు ట్రాన్ఫారం సమస్యలు,పార్కు సమస్యలు, ఐ మ్యాక్స్ లెట్ ప్రారంభించడం, సీసీ కెమెరాలు పెట్టించడం, కాలనీలో పార్కులను కాపాడి కమిటీ హాల్ నిర్మించడం అంతేకాకుండా ప్రతి వ్యక్తి యొక్క సమస్య తన సొంత సమస్యగా భావించి ప్రజల సొంత సమస్యలను కూడా తీర్చారని ప్రజలు కొనియాడారు. అధ్యక్షులు మాట్లాడుతూ మృదు స్వభావునివిగా, సామ్య వ్యాధిగా, యదార్థవాదిగా, అనునిత్యం మాకు అందుబాటులో ఉంటూ అన్నా అంటే నేను ఉన్నాను అంటూ ఎవ్వరి సమస్యనైనా మీ సొంత సమస్యగా భావించి పరిష్కరించి అనతి కాలంలోనే ప్రజా నాయకుడిగా అందరి మన్ననలు పొందిన మీకు మా కాలనీ తరఫున హృదయపూర్వక అభినందనలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెడ్డి కార్పొరేషన్ కు నిధులను కేటాయించి తమ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి పాలమూరు రెడ్డి సేవా సంఘం కోరింది. ఆదివారం పాలమూరు రెడ్డి సేవాసమితి ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం రాజాబహద్దూర్ వెంకట్రామిరెడ్డి కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన రెడ్డి కార్పొరేషన్ కు చట్ట బద్ధతతో కూడిన నిబంధనలు, నిధులు, కార్యవర్గాన్ని ఏర్పాటు వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతము నిర్వహిస్తున్న పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్-1 పరీక్షలలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. 10 శాతం రిజర్వేషన్లు ఉద్యోగ నియామకాలలో అమలు పరచాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రెడ్డి సేవా సమితి నుండి రెడ్ల విద్యార్థులకు ఉపకారవేతనాబ ఇద్దరు వైద్య విద్యార్థులకు, ఇంజనీరింగ్ విద్యార్థులకు కమందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు అందించడము జరిగింది. ఏదైనా సహరం కోసం రెండు కుటుంబాలకు రూ. 30 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మకి జిల్లా ప్రధాన కార్యదర్శి వేపూరు రాజాందర్ రెడ్డి, కోశాధికారి మల్లు నర్సింహా రెడ్డి, సహాయ కార్యదర్శి పసుల ధనుంజమరెడ్డి, యన్. సురేందర్ రెడ్డి, కార్యదర్శి పరమేశ్వరరెడ్డి, పట్లోళ్ళ అక్కారెడ్డి, జిల్లాల అధనలు దొడ్ల మ్యారెడ్డి, సుదర్శనరెడ్డి, మేఘారెడ్డి, నీలంరెడ్డి, మల్లా రెడ్డి, గోవర్ధన రెడ్డి, రాంజేర్రెడ్డి, మహిళావిభాగం అధపురాలు మల్లు సరసవల, వంశీలత, నవరూప, కోహేశ్వరరెలి తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: దేశవ్యాప్తంగా ఓబీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, బీసీ మంత్రిత్వ శాఖను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు మాజీ ఎంపీ ఆర్. కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్స్ కల్పించాలని కోరారు. బీఎస్ఎన్ఎల్ ఓబీసీ ఎంప్లాయిస్ సంఘం గుర్తింపు కోసం కృషి చేస్తున్నాని అన్నారు.బీసీ క్రిమిలేయర్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీసీ వ్యక్తి ఇప్పటివరకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కాలేదని పేర్కొన్నారు. రాజ్యాంగంలో మన బీసీల వాటా కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. అసోసియేషన్ తెలంగాణ సర్కిల్ అధ్యక్షులు కే. అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సర్కిల్ సెక్రటరీ ఎస్. శివ కృష్ణ, అసోసియేషన్ నేతలు ధర్మరాజు, విజయ్ కుమార్, కె సురేష్, నరేష్ తోపాటు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మ గౌరవ సభకు తరలిన మాల మహానాడు నాయకులు

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాలల ఆత్మ గౌరవ సభకు ఆమనగల్లు మండలం నుండి తరలివెళ్లారు.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పును పునః పరీక్షించాలని అన్నారు. కేవలం మాలలను ఓటు బ్యాంకు గా చూసే పార్టీలకు బుద్ధి చేపడానికి మరియు మాల కులస్థుల ఐక్యతను చాటి చెప్పడానికి మాలల ఉనికిని ప్రపంచానికి తెలియజేసేలా ఈ ఉద్యమం కొనసాగుతుందని వర్గీకరణ చేసి అంబేద్కర్ ను కించ పరచవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు కాలే మల్లయ్య, లండం చంద్రయ్య, ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్లు గోరటి నర్సింహా, చెట్టిమల్ల చెన్నకేశవులు, మాల మహానాడు యువ నాయకులు కాలే మల్లేష్, సూరిగమల్ల శేఖర్, కోరే రవి, మద్దెల మల్లేష్, దొడ్డి పరమేష్, గోరటి భరత్, లండం మల్లేష్, నీరటి సురేష్, చెట్టిమల్ల ప్రశాంత్, కోరే చెన్నకేశవులు, లండం రాఘవేందర్, శివ మాల మాల మహానాడు నాయకులు బయలుదేరారు.

పెట్రోల్ బంకులో అగ్ని ప్రమాదానికి కారణమైన ఇద్దరు అరెస్టు

విశాలాంధ్ర - కాప్రా : బైకులో పెట్రోల్ పోసే విషయంలో జరిగిన ఘర్షణ లో బంకుకి నిప్పు పెట్టిన వ్యక్తితోపాటు, ఈ ఘటనను అడ్డుకోకుండా చోద్యం చూసిన బంకు క్యాషియర్ ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నాచారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి మీర్పేట్ లో ఉండే అరుణ్ కుమార్ 19 మరో ఇద్దరు మిత్రులతో కలిసి మల్లాపూర్‌లో ఉండే హెచ్ పి పెట్రోల్ బంకు వచ్చాడు. తన బైక్‌లో రూ. 50ల పెట్రోల్ పోయాలని అడిగాడు. అయితే అప్పటికే అతని ముందున్న మరో వ్యక్తికి పెట్రోల్ బాయ్ వాటిల్‌లో పెట్రోల్ పోస్తున్నాడు. తనకంటే వెనుక వచ్చిన వ్యక్తికి బాటిల్లో పెట్రోల్ ఎందుకు పోస్తున్నామని ముందుగా నాకే పోయాలంటూ ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య మాట పెరిగింది. పెట్రోలు ముందుగా తన బైక్‌లో పోయా లని, లేదంటే బంకుకు నిప్పు పెడతానని బెదిరించాడు. అక్కడే ఉన్న క్యాషియర్ బంకు ఎలా నిప్పు పెడతావో పెట్టి చూడు నీ సంగతి చూస్తానని అనడంతో రెచ్చిపోయిన నిందితుడు పెట్రోల్ బాయ్ పెట్రోల్ పోస్తుండగా అగ్గిపుల్ల గీకి పెట్రోల్ గన్ పై వేయడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడ ఉన్న వారంతా పరుగులు తీశారు. ఈ ఘటన జరిగిన సమయంలో ఓ మహిళ తన చిన్నారి కూతురుతో అక్కడే ఉండగా మంటలు లేవడంతో వాళ్ళు భయాందోళన గురై పరుగులు తీశారు. అయితే నిందితుడు పెట్రోలు బంకులో నిప్పంటిస్తున్నప్పు టికీ ఈ ఘటనను అక్కడే ఉన్న బంకు క్యాషియర్ అడ్డుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన పోలీసులు సదరు క్యాషియర్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదాన్ని అడ్డుకోలేదని పోలీసులు అతనిపై కూడా కేసు నమోదు చేశారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బంగారం చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్..

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడి ఇంట్లో దాచిన 30 గ్రాముల బంగారాన్ని చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న నిందితుని నాచారం పోలీసులు వెస్ట్ బెంగాల్లో అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్ రాష్ట్రం, హౌరా జిల్లా గుజార్పూర్ గ్రామానికి చెందిన సాగర్ పండిత్ (19), సూర్య హేల అనే వ్యక్తితో కలిసి దొంగతనాలు పాల్పడుతున్నాడు. ఈనెల 6న నాచారంలోని కనకవ్వ అని మహిళ ఇంట్లో 30 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించి వెస్ట్ బెంగాల్‌కు పారిపోయాడు. కనకవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నాచారం పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి బెంగాల్లో సాగర్ పండితును అరెస్టు చేసిన అతని వద్ద నుంచి 13 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించిన పోలీసులు మరో నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఏపీ అభివృద్ధిలో భాగస్వాములవ్వండి

- యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పారిశ్రామిక విధానాలు
- శాన్ ఫ్రాన్సిస్కోలో పారిశ్రామికవేత్తలతో ఏపీ మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అభివృద్ధి వికేంద్రీకరణ, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని, యువతకు రాబోయే అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పించాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఆరు పాలసీలను ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ జనరల్ శ్రీకర్ రెడ్డి అధ్వర్యంలో పారిశ్రామికవేత్తలతో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మీ నుంచి పెద్దఎత్తున పెట్టుబడుల కోసం నాల్గవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు ఎదురుచూస్తున్నారన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కియా ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణం నెలకొని ఉందని చెప్పారు. ఏపీలో దేశంలోనే 2వ అతిపెద్ద తీర ప్రాంతం ఉందన్నారు. త్వరలో నాలుగు కొత్త పోర్టులు రాబోతున్నాయని తెలిపారు. కర్నూలు జిల్లాను డ్రోన్ వ్యాలీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సంకల్పించారని వివరించారు. ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాలను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా తయారు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటికే దేశంలో తయారయ్యే సెల్ ఫోన్లలో 25 శాతం, 50 శాతం ఏసీలు కూడా ఏపీలోనే తయారవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా ప్రకాశం జిల్లాలో బయో ఫ్యూయల్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. కృష్ణా, గుంటూరు క్యాపిటల్ రీజయన్‌లో 5 బిలియన్ డాలర్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామన్నారు. డిసెంబరు నుంచి అమరావతి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. గోదావరి జిల్లాల్లో ఆక్వా ఎక్స్ ఫోర్ట్స్, పెట్రో కెమికల్స్, గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలు, ఉత్తరాంధ్రలో కెమికల్, ఫార్మా రంగాలపై దృష్టిసారించామని వివరించారు. రాష్ట్రానికి ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖపట్నంలో పౌర విమానయాన యూనివర్సిటీ, డేటా సెంటర్ రానున్నాయని, త్వరలో టీసీఎస్ సంస్థ తమ కార్యకలాపాలను ప్రారంభించనున్నదని తెలిపారు. రాజకీయంగా జాతీయ స్థాయిలో కీలకపాత్ర వహిస్తుండటం ఏపీకి కలిసి వస్తోందన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో 300 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయని, అందులో ఏపీ కీలకపాత్ర పోషించనున్నదని చెప్పారు. ప్రధాని మంత్రి మోదీ 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా వికసిత్ ఏపీ దిశగా రాష్ట్రం వేగవంతంగా ముందుకు సాగుతోందన్నారు. అందువల్ల అమెరికాలోని వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు ఏపీకి వచ్చి రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిందిగా మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ జనరల్ శ్రీకర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌కు పెట్టుబడులు ఆకర్షించేందుకు సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ అనేక ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అందులో భాగస్వామ్యం కావాలన్న ఉద్దేశంతో కాన్సులేట్ జనరల్ తరఫున రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పారిశ్రామిక వేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు, ఏపీ ప్రతినిధి బృందం సభ్యులు కార్తికేయ మిశ్రా, సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో డేటా సెంటర్ పెట్టండి

ప్రఖ్యాత ఈక్వెనెక్స్ డేటా సెంటర్ కేంద్ర కార్యాలయాన్ని లోకేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా తమ కంపెనీ అందిస్తున్న డేటా సేవలు, కార్యకలాపాలను సంస్థ గ్లోబల్ ఎండీ కౌశిక్ జోషి, సీనియర్ స్ట్రాటజిక్ సేల్స్ ఇంజనీర్ రాబర్ట్ ఎలెన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా లోకేశ్‌కు వివరించారు. ప్రపంచంలోనే అత్యంత విస్తృత, సురక్షిత డేటా సేవలను అందిస్తున్న సంస్థగా ఈక్వెనెక్స్‌కు పేరుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 260కి పైగా ఇంటర్నేషనల్ బిజినెస్ ఎక్స్ఛేంజి డేటా సెంటర్ ల నెట్ వర్క్ కలిగి ఉన్నామని చెప్పారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో డేటా సెంటర్ ఏర్పాటుకు గల అనుకూలతలను వివరించారు.

గ్రూపు-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలి

ఏపీపీఎస్‌సీ చైర్‌పర్సన్‌కు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: అభ్యర్థుల భవితను పరిగణనలోకి తీసుకుని గ్రూప్-1 ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ పరీక్షకు 1:100 నిష్పత్తిలో ఎంపిక చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (ఏపీపీఎస్‌సీ) చైర్‌పర్సన్ ఏఆర్ అనురాధకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం లేఖ రాశారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్-2, డిప్యూటీ డీఈవో పరీక్షలలో 1:100 నిష్పత్తిని అనుసరించి మెయిన్స్ పరీక్షకు దాదాపు 92,000 మంది అభ్యర్థులను ఎంపిక చేశారని తెలిపారు. 2024 మార్చి 17న ఏపీపీఎస్‌సీ నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నుంచి మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో మాత్రమే కేవలం 4,000 మందిని మాత్రమే ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఏపీపీఎస్‌సీ మాజీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ 2023న సెప్టెంబరు 19న నిర్వహించిన విలేకర్ల సమావేశంలో గ్రూప్-1 సిలబస్, నమూనా మార్పును ప్రకటించి, కొత్త నమూనా వివరాలను విడుదల చేశారని, తరువాత ఏపీపీఎస్‌సీ పాత సిలబస్, నమూనాతో నోటిఫికేషన్‌ను విడుదల చేయడంతో అభ్యర్థుల గందరగోళంలో ఉన్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఇంగ్లీషు-తెలుగు అనువాద పొరపాట్లు వెలుగుచూశాయన్నారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల మధ్య చాలా తక్కువగా మూడు వారాల సమయం మాత్రమే ఉండడంతో అభ్యర్థులు గ్రూప్-1 ప్రిలిమ్స్ సిలబస్‌ను పూర్తిచేయలేక పోయారని తెలిపారు. గ్రూప్-2, గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షల మధ్య కాలం తక్కువగా ఉండడం, అనువాద సమస్యలు, గ్రూప్-1 సిలబస్ రివిజన్ కాకపోవడం వంటి అనేక ఇబ్బందులతో అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల గ్రూప్-2 డిప్యూటీ డీఈవో పోస్టుల ఎంపిక తరహాలోనే గ్రూప్-1 ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ పరీక్షకు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

జార్ఖండ్‌లో మహిళా ఓటర్లదే నిర్ణయాత్మక పాత్ర

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రాష్ట్రంలో మహిళా ఓటర్లదే నిర్ణయాత్మక పాత్రగా ఉండనుంది. సీఎం నియోజకవర్గంతో పాటు 31 అసెంబ్లీ స్థానాలపై మహిళా ఓటర్లకు పట్టు ఉంది. ఫలితాలను వారు ప్రభావితం చేయగలరు. దీంతో ప్రధాన పార్టీలు కూడా మహిళల మెప్పు కోసం యత్నిస్తున్నాయి. జేఎంఎం కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మయన్ సమ్మాన్ యోజనకు దీటుగా గోగో దీదీ యోజనను బీజేపీ ప్రకటించింది. మయన్ సమ్మాన్ యోజన కింద రాష్ట్రంలోని 50లక్షల మంది మహిళల ఖాతాల్లో నెలకు రూ.వెయ్యి జమ అవుతుంది. తాము అధికారంలోకి వస్తే డిసెంబరు నుంచి ఈ మొత్తాన్ని రూ.2,500కు పెంచుతామని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ హామీనిచ్చారు. తమ ప్రభుత్వం వస్తే నెలకు రూ.2,100 ఇస్తామని బీజేపీ చెబుతోంది. మొత్తంగా ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, మాజీ సీఎం చంపై సోరెన్ పోటీ చేసే స్థానాలు కలిపి మొత్తం 32 స్థానాల్లో మహిళా ఓటర్లే నిర్ణయాత్మక పాత్ర పోషించనున్నారు. రాష్ట్రంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువ. హేమంత్ సోరెన్ నామినేషన్ పత్రాలను బర్హెయిత్ నియోజకవర్గం నుంచి దాఖలు చేశారు. ఈ స్థానంలో 1.15లక్షల మంది మహిళలు, 1.09లక్షల మంది పురుష ఓటర్లు ఉన్నారు. సరైకేలా అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు 3.69 లక్షల మంది ఉంటే ఇందులో 1.83లక్షల మంది పరుషులు, 1.85లక్షల మంది మహిళా ఓటర్లు. బీజేపీ తరపున చంపై సోరెన్ ఇదే స్థానం నుంచి నామినేషన్ వేశారు. 81 అసెంబ్లీ నియోజకవర్గాలలో 28 గిరిజన రిజర్వ్‌డ్ స్థానాలున్నాయి. తొమ్మిది షెడ్యూల్డ్ కులాలవి కాగా మిగతావి జనరల్ సీట్లు. పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలోని మఝ్‌గావ్ అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 1.21లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అక్కడ పురుష ఓటర్లు 1.12లక్షల మంది ఉన్నారు. రాష్ట్రంలో 2.60 కోట్ల మంది ఓటర్లు ఉంటే వీరిలో 1.31కోట్ల మంది పురుషులు, 1.28 కోట్ల మహిళా ఓటర్లు ఉన్నారు. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకునే వారు 11.84లక్షల మంది ఉంటే, 1.13లక్షల మంది దివ్యాంగులు, థర్డ్ జెండర్, 85ఏళ్లు పైబడిన వృద్ధ ఓటర్లు కూడా ఉన్నారు. ఎన్నికలు నవంబరు 13, 20వ తేదీల్లో జరుగుతాయి. ఫలితాలు 23న వెలువడుతాయి.

పలక్కాడ్ అసెంబ్లీ ఉప ఎన్నిక...

కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు

పలక్కాడ్: కేరళలోని పలక్కాడ్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక కోసం ప్రచారం ఊపందుకున్న వేళ కాంగ్రెస్ సీనియర్ నేత కె.మురళీధరన్‌ను అభ్యర్థిగా ప్రతిపాదిస్తూ ఏఐసీసీకి పలక్కాడ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) పంపిన లేఖ వివాదాస్పదంగా మారింది. పలక్కాడ్ స్థానం నుంచి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ మాంకుతాతిల్ అభ్యర్థిత్వం విషయంలో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలకు ఈ లేఖ అద్దం పట్టిందని అధికార సీపీఎం విమర్శించింది. ప్రతిపక్ష నేత వీడీ సతీశన్, లోక్‌సభ ఎంపీ షఫీ పరంబిల్ అమలు చేసిన ప్రత్యేక ప్యాకేజీ ద్వారా రాహుల్ మాంకుతాతిల్‌కు పలక్కాడ్ అభ్యర్థిత్వం లభించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ ఆదివారం వ్యాఖ్యానించారు. ఆయన త్రిస్సూరులో విలేకరులతో మాట్లాడుతూ కె.మురళీధరన్ పేరును కాంగ్రెస్ జిల్లా నాయకత్వం ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిసిందన్నారు. ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని డీసీసీపై సతీశన్, షఫీ ఒత్తిడి తెచ్చారని, ఇది కాంగ్రెస్‌లో అంతర్గతంగా పెద్ద చర్చకు దారితీసిందని చెప్పారు. ఈ పరిస్థితి లెఫ్ట్ ఫ్రంట్‌కు అనుకూలంగా పరిగణమించవచ్చని గోవిందన్ అన్నారు. డీసీసీ థంకప్పన్ రాసిన లేఖలోని రెండు పేజీలు బహిర్గతం కావడంతో ఈ వివాదం మొదలైంది. కాగా, నవంబరు 13న పలక్కాడ్ ఉప ఎన్నిక జరగనుంది.

మధుమిత హత్యకేసు... ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ: 2003లో ఉత్తరప్రదేశ్ రాజకీయ రంగాన్ని కుదిపేసిన యువ కవయిత్రి మధుమితా శుక్లా హత్య కేసులో దోషుల్లో ఒకరిని ముందస్తుగా విడుదల చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వ స్పందనను కోరింది. తనను ముందస్తుగా విడుదల చేసేలా సంబంధిత కాంపిటెంట్ అథారిటీని ఆదేశించాలని కోరుతూ జీవితఖైదు పడ్డ దోషుల్లో ఒకరైన రోహిత్ చతుర్వేది వేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం... ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు అడ్వకేట్ జనరల్ గరిమా ప్రసాద్... బిల్కిస్ బానో కేసులో 2022 జనవరి 8, మే 13 తేదీల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ప్రస్తావించారు. ఈ కేసులో ఉత్తరాఖండ్ ప్రభుత్వమే కాంపిటెంట్ అథారిటీ అని స్పష్టం చేశారు. ఒక క్రిమినల్ కేసు విచారణ జరిగిన రాష్ట్రానికి రాష్ట్ర విధానం ప్రకారం ఖైదీల పిటిషన్‌ను పరిశీలించి... ముందస్తుగా విడుదల చేయడంలో సమర్థ అధికారం ఉంటుందని జనవరి 8న ఈ కోర్టు పేర్కొన్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కోర్టు ఆదేశాల మేరకు కేసును ఉత్తరప్రదేశ్ నుంచి ఉత్తరాఖండ్‌కు బదిలీ చేసినందున, ఈ విషయంలో ఉత్తరాఖండ్ ప్రభుత్వానిదే సమర్థ అధికారం అని ప్రసాద్ వాదించారు. దీనిపై ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి తాజా నోటీసు జారీ చేసేందుకు అంగీకరించిన ధర్మాసనం.... తదుపరి విచారణను నవంబర్ 14కి వాయిదా వేసింది. అంతకుముందు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చతుర్వేదిని ముందస్తుగా విడుదల చేయడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించిన ఆర్డర్‌ను రీకాల్ చేయాలని లేదా సవరించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

లిస్బన్‌లో పోలీసు జులుంపై ప్రజాగ్రహం

వీధుల్లోకి వచ్చిన వేలాది మంది: భారీ నిరసన ప్రదర్శన

లిస్బన్: లిస్బన్‌లో పోలీసు జులంపై ప్రజా గ్రహం కట్టలు తెంచు కుంది. వేలాది మంది వీధు ల్లోకి వచ్చి నిరసన తెలిపారు. న్యాయం కోసం డిమాండ్ చేస్తూ భారీ ప్రదర్శన నిర్వహించారు. 'మమ్మల్ని చంపడం ఆపండి' అని నినాదమిచ్చారు. 'పోలీసులే హత్య చేస్తుంటే ఎవరిని పిలవాలి' అంటూ ప్రశ్నించారు. తమ పరిసరాల్లో పోలీసు జులం సర్వసాధారణమవుతోందని ప్రదర్శనకారులు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేశారు. కేప్ వర్దె-పోర్చుగీస్ పౌరుడు ఓడెయిర్ మొనిజ్ (43)ని పోలీసులు కాల్చి చంపిన ఘటన స్థానికంగా అనిశ్చితికి దారితీసింది. ఈ ఘటనకు నిరసనగా మానవ హక్కుల సంఘం 'విడా జస్టా' పిలుపుతో లిస్బన్‌లో భారీ ప్రదర్శన జరిగింది. మరోవైపు పోలీసులకు మద్దతుగా సెంట్రల్ లిస్బన్‌లో వేరొక ర్యాలీ నిర్వహించగా... అక్కడక్కడ స్వల్ప ఘర్షణలు జరిగాయి. హింసను నివారించేందుకు ప్రదర్శనకారులు తమ మార్గాన్ని మార్చుకొన్నారు. దీంతో మార్చ్ శాంతియుతంగా సాగింది. 'ఒడెయిక్‌కు న్యాయం' అంటూ పోస్టర్లు ప్రదర్శిస్తూ ప్రదర్శనకారులు పెద్దపెట్టున నినాదాలు చేశారు.

కూలుతున్న భారత మౌలిక వసతులు: రాహుల్

న్యూఢిల్లీ: దేశంలో కుప్పకూలుతున్న మౌలిక వసతులకు బాంద్రా స్టేషన్‌లో తొక్కిసలాట అద్దం పట్టిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయాలనే ఉద్దేశం లేకపోతే ప్రారంభోత్సవాలు, ప్రచారాలకు అర్థం ఉండదని అన్నారు. నిర్వహణ లోపం కారణంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే అవి నిష్ప్రయోజనమని 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. రిబ్బన్ కట్టింగుల తర్వాత వంతెనలు, ప్లాట్‌ఫారాలు కూలడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమన్నారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల అవసరం దేశానికి ఉందని రాహుల్ నొక్కిచెప్పారు. ప్రజలకు రోజువారీ పనులను సులభతరం చేస్తూ, ప్రయాణాన్ని సౌకర్యవంతం చేయడం, వారికి రక్షణ కల్పించడం, అవసరాలు తీర్చడం వంటివి ముఖ్యమని సూచించారు. భారత్‌కు సామర్థ్యం, పోటీతత్వం ఉందన్నారు. ప్రజలకు సేవలను మరింతగా మెరుగుపర్చేం దుకు... దేశ పటిష్ఠ భవిష్యత్ కోసం పునాది వేయడంపై దృష్టి పెట్టేందుకు ఇంకా సమర్థమైన, పారదర్శకమైన వ్యవస్థ మనకు కావాలని రాహుల్ గాంధీ నొక్కి చెప్పారు.

ఇదేనా దీపావళి కానుక?

విద్యుత్ చార్జీల పెంపుపై జగన్ ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'విద్యుత్ చార్జీలు పెంచడమేనా, ప్రజలకు ఇస్తున్న దీపావళి కానుక' అని టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌వేదికగా ట్వీట్ చేశారు. ఎన్నికల ముందు అధికారం కోసం ఇచ్చిన హామీ మేరకు, ఈ చార్జీలను ప్రభుత్వమే భరించాలన్నారు. వినియోగదారులు చేసిన విజ్ఞప్తులను ప్రభుత్వం ఎందుకు పెడచెవిన పెట్టిందని ప్రశ్నించారు. ప్రజలపై అదనపు చార్జీలను వేయడమేనా మీ విజన్, అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంత భారీ స్థాయిలో విద్యుత్ చార్జీలు పెంచి మాట తప్పడమే మీ నైజమని మరోసారి రుజువు చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే విద్యుత్ చార్జీలను 30శాతం తగ్గిస్తామని ఎన్నికల ముందు ప్రచారంలో మీరిచ్చిన హామీ ఏమైంది చంద్రబాబూ అంటూ నిలదీశారు. టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే విద్యుత్ చార్జీలను తగ్గించే వాళ్లమని చెప్పిన మీరు...ప్రజలపై రూ.6,072.86కోట్ల భారం వేయడం భావ్యమేనా? అని జగన్ ప్రశ్నించారు.

సముద్రంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

విశాలాంధ్ర-యస్. రాయవరం: సముద్రతీరాన స్నేహితులతో ఆహ్లాదంగా గడిపేందుకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులను మృత్యువు వెంటాడింది. స్నానానికని సముద్రంలోకి దిగిన వారిని సముద్ర అలలు ఈడ్చుకెళ్లాయి. వివరాల్లోకివెళితే... అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు గ్రామానికి చెందిన పదిమంది స్నేహితులు రేవుపోలవరం సముద్ర తీరానికి సందర్శనకు వెళ్లారు. అందరూ ఉత్సాహంగా సముద్రంలో స్నానానికి దిగారు. అదే సమయంలో భారీ అలలు రావడంతో వారిలో తుర్ల అర్జున్, బుంగా సంజయ్ కుమార్ సముద్రంలోకి కొట్టుకు పోయారు. విషయం తెలుసుకున్న మత్స్యకారులు హుటాహుటిన స్థానిక పోలీసులకు, మెరైన్ సిబ్బందికి సమాచారం అందించారు. స్థానిక ఎస్సై ఏ విభూషణరావు పరిస్థితిని సమీక్షించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గాలింపు చర్యల్లో భాగంగా బోట్లపై కొందరు మత్స్యకారులను సముద్రంలోకి పంపారు. కానీ గల్లంతైన ఇద్దరు విద్యార్థుల ఆచూకీ తెలియలేదు. నక్కపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

హోంమంత్రి ఆరా: సముద్రంలో ఇద్దరు విద్యార్థులు గల్లంతైన విషయంపై స్థానిక ఎమ్మెల్యే, హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత స్థానిక పోలీసులు, జిల్లా అధికారులతో మాట్లాడారు. సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

డిజిటల్ కేటుగాళ్లతో జరభద్రం

- భయపెట్టి... కంగారు పెట్టి దోచేస్తున్న నేరగాళ్లు
- ఆటకట్టించాలంటే ప్రజలు చైతన్యవంతులు కావాలి
- సీఈఆర్‌టీ-ఇన్ సూచన

న్యూఢిల్లీ: డిజిటల్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏదో ఒక పేరుతో కుంభకోణాలకు పాల్పడుతూ కొట్లల్లో డబ్బులు కొల్లగొట్టేస్తున్నారు. వృద్ధులు, పెద్దగా చదువుకోని వారే కాదు, మంచి పదవుల్లో ఉన్న వారిని సైతం బురిడీ కొట్టిస్తూ నిలువునా దోచేస్తున్నారు. ఇటీవల కాలంలో డిజిటల్ మోసాలు పేట్రేగిపోయాయి. డిజిటల్ అరెస్టు పదం పదేపదే వినిపిస్తోంది. దీంతో సైబర్ నేరాలపై అవగాహన కల్పించడమే కాకుండా వాటిని అరికట్టేందుకు కొన్ని పద్ధతులను సూచిస్తూ సైబర్ భద్రతా సంస్థ సీఈఆర్‌టీ-ఇన్ అడ్వైజరీ విడుదల చేసింది. డిజిటల్-సైబర్ కేటుగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, భయపెట్టి, కంగారు పెట్టి వారు దోచేస్తున్నారని, నేరగాళ్ల ఆట కట్టించాలంటే అవగాహన పెంచుకోవాలని ప్రజలకు సూచనలు చేసింది. వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించే డిజిటల్ మోసగాళ్ల భరతం పట్టాలంటే చైతన్యవంతులు కావాలని 'ది కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ ఆఫ్ ఇండియా (సీఈఆర్‌టీ-ఇన్) అడ్వైజరీ హితవు పలికింది. డిజిటల్ మోసాలను తప్పించుకునేందుకు ఎలా వ్యవహరించాలో కొన్ని పద్ధతులు సూచించింది.

'డిజిటల్ అరెస్ట్' అన్నది ఆన్‌లైన్ స్కామ్. ప్రభుత్వ సంస్థలు వాట్సాప్ లేక స్కైప్ వంటి మాధ్యమాలను అధికారిక సంప్రదింపుల కోసం వినియోగించవు. ఈ మాధ్యమాల్లో ఏదేని సంస్థ నుంచి మిమ్మల్ని సంప్రదిస్తే భయపడొద్దు. వారి గుర్తింపును ముందుగా ధృవీకరించుకోండి' అని సలహా ఇచ్చింది. డిజిటల్ అరెస్టు జరిగిన సమయంలో అక్రమ కార్యకలాపాల కోసం దర్యాప్తు జరుగుతున్నట్లు బాధితుడికి ఫోన్, ఈ-మెయిల్ లేక సంక్షిప్త సందేశం వస్తుంది. అరెస్టు లేక చట్టపరమైన చర్యల పేరుతో బెదిరించేందుకు కేటుగాళ్లు ప్రయత్నిస్తారు. వ్యక్తిలో భయాన్ని రేకెత్తించి ఆలోచన శక్తి కోల్పోయేలా చేసి తమ పని కానిచ్చేస్తారు. బాధితులు కూడా నింద నుంచి తప్పించుకునేందుకు కంగారు పడి వారు కోరే వ్యక్తిగత సమాచారం, బ్యాంకుల వివరాలు, యూపీఐ ఐడీలు వంటివి చెప్పేస్తుంటారు. పెద్ద మొత్తంలో డబ్బు బదిలీ చేస్తారు. సైబర్ నేరగాళ్లు సంప్రదిస్తే భయపడవద్దు. వారి మటల్లో పడి బురిడి కొట్టొద్దు. గుర్తుతెలియని నంబర్ల నుంచి ఫోన్లు లేక వీడియో కాల్స్ వస్తే వ్యక్తిగత లేక ఆర్థికపరమైన సమాచారం ఇవ్వవద్దు. నెమ్మదిగా ఉండి తప్పించుకునేందుకు ప్రయత్నించండి. ఒత్తిడికి గురై డబ్బు ఇచ్చేయవద్దు. లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు ఏవీ కూడా వెంటనే డబ్బు పంపాలని ఒత్తిడి చేయవు, బలవంత పెట్టవు అని గుర్తుపెట్టుకోండి' అని సీఈఆర్‌టీ-ఇన్ అడ్వైజరీ పేర్కొంది.

ఫోన్‌లో లేక ఆన్‌లైన్‌లో ఎవరైనా డబ్బు డిమాండ్ చేశారంటే అది స్కామ్ అని గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించింది. 'ఫిషింగ్ స్కామ్స్'లను ప్రస్తావించింది. లాటరీ లేక ప్రైజ్‌మనీ పేరిట నోటిఫికేషన్లు పంపి నిలువునా దోచేస్తున్న డిజిటల్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలని, ప్రజల్లో ఆశ-అత్యాశ వల్లే లాటరీ స్కాములు జరుగుతున్నాయని పేర్కొంది. ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌ల ద్వారా పరిచయం పెంచుకొని... మచ్చిక చేసుకొని, వైద్యం లేక ఇతరత్ర కారణాలతో డబ్బు అవసరమున్నట్లు నమ్మబలికి మోసాలకు పాల్పడుతున్నారని, క్రిప్టో కరెన్సీ రూపంలో డబ్బును కోరుతూ బురిడీ కొట్టిస్తున్నారని సీఈఆర్‌టీ-ఇన్ అప్రమత్తం చేసింది. ఉద్యోగాల పేరిట తప్పుడు వివరాలతో నియామక పోర్టళ్లు లేక సామాజిక మాధ్యమాల ద్వారా నిరుద్యోగులను దోచేస్తున్న విధానాన్ని వివరించింది. టెక్ సపోర్ట్ స్కామ్‌లు జరుగుతున్నాయని, సంబంధిత వ్యక్తిలో సాంకేతికపరమైన అవగాహన లేమిని ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని సీఈఆర్‌టీ-ఇన్ అడ్వైజరీ చైతన్యపరిచింది.

పొంజీ/పిరమిడ్ స్కాములు, క్యాష్ ఆఫ్ డెలివరీ స్కాములు, 'చారిటీ స్కాములు' గురించీ వివరించింది. నకిలీ ఆన్‌లైన్ స్టోర్లు పెట్టి క్యాష్ ఆన్ డెలివరీ ఉందని చెప్పి దోచుకుంటున్న విధానాన్ని సీఈఆర్‌టీ-ఇన్ అడ్వైజరీ తెలిపింది. విపత్తు లేక అనారోగ్యం పేరిట విరాళాల సేకరణ నెపంతో చారిటీ స్కాములు సాగుతున్నాయని తెలిపింది. పొరపాటున డబ్బు పంపించాం... తిరిగి పంపాలంటూ కొందరు కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నట్లు పేర్కొంది. వన్ టైమ్ పాస్‌వర్డ్స్ (ఓటీపీ)లు, గుర్తింపును ధృవీకరించేందుకు బ్యాంకు సమాచారం వంటివి కోరుతూ మోసాలు సాగుతున్న వైనాన్ని వివరించింది. పార్సిల్ స్కాములు కూడా డిజిటల్ అరెస్టు వంటివేనని తెలిపింది. 'మీ పేరుతో వచ్చిన పార్సిల్‌లో మాదక ద్రవ్యాలుఉన్నాయి... వాటిని సీజ్ చేశాం. అరెస్టు చేస్తామంటూ ఫోన్‌లు చేసి, సందేశాలు పంపి బురిడీ కొట్టిస్తున్నట్లు వివరించింది. తక్కువ వడ్డీకి రుణమిస్తామంటూ లోన్ లేక కార్డు స్కాములు జరుగుతున్నట్లు పేర్కొంది.

ఎన్ని రకాలుగా మోసం చేసేందుకు ప్రయత్నించి నాగానీ కేటుగాళ్ల ఆటకట్టించాలంటే ప్రజలు చైతన్య వంతులు కావడంతోనే సాధ్యమని నొక్కి చెప్పింది. సైబర్ నేరగాళ్ల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లకు తలొగ్గవద్దని, కంగారు పడి సర్వం కోల్పోవద్దని సీఈఆర్‌టీ-ఇన్ హితవు పలికింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.